www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 2-6-2024 | పేజీలు: 12 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 47 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి రా. 2.42 తదుపరి ద్వాదశి; నక్షత్రం: రేవతి రా. 1.40 తదుపరి అశ్వని; వర్జ్యం: మ. 2.28-3.57; దుర్ముహూర్తం: సా. 4.58-5.50; అమృతఘడియలు: రా. 11.25-12.55; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.42 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఫలితాలొస్తున్నాయి..
పారాహుషార్!



అంచనాలు, అభిప్రాయాల విషయం ఎలా ఉన్నా కౌంటింగ్ రోజున, ఆ తర్వాత రాష్ట్రంలో పరిస్థితులు ఎలా ఉండబోతున్నాయన్నది కీలకంగా మారింది. రాష్ట్రంలో రాజకీయ వైషమ్యాలు ప్రజల మెదళ్లలోకి చొరబడ్డాయి. దీనికితోడు గత ఐదేళ్లుగా ప్రధాన రాజకీయ పార్టీల మద్దతుదారుల మధ్య దాడులు, ప్రతిదాడులు జరగడంతోపాటు ప్రభుత్వపరంగా కక్షసాధింపు చర్యలు పరాకాష్ఠకు చేరడంతో ఎన్నికల ఫలితాలను బట్టి గొడవలు జరిగే అవకాశం కూడా కనిపిస్తోంది.

ఫలితాలు ఎలా ఉన్నా శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే ప్రస్తుతం ప్రజల్లో నెలకొన్న వైషమ్యాల స్థానంలో కక్షలు, కార్పణ్యాలు ప్రవేశిస్తాయి. రాష్ట్రం మొత్తం ఫ్యాక్షన్ జోన్‌గా మారిపోయే ప్రమాదం ఉంది. ఇది ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌కు మంచిదికాదు.

ఐదేళ్లుగా ఇష్టారాజ్యంగా వ్యవహరించిన అధికార పార్టీకి ఎన్నికల కమిషన్ తాజాగా తీసుకున్న నిర్ణయాలు రుచించడం లేదు. ఈ కారణంగానే ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగా పనిచేస్తున్న అధికారులను జగన్ రెడ్డి రోత మీడియా టార్గెట్ చేసుకుంది. నిన్నటి వరకు విధి నిర్వహణలో పక్షపాతంగా వ్యవహరించిన అధికారులను తప్పుబట్టినప్పుడు ఇదే రోత మీడియా గుండెలు బాదుకుంది.

"ఎవరైనా జగన్ రెడ్డి కక్ష్యలోకి వచ్చి నాలుగైదు అడుగుల దూరంలో నిలబడి కళ్లలోకి కళ్లు పెట్టి చూస్తే జగనన్న కోసం వాడు చచ్చిపోతాడు. జగన్ ఇజ్ నాట్ ఎ మ్యాన్. బట్ ఈజ్ యాన్ ఎమోషన్. ఆయనను చూస్తే పిచ్చి పట్టేస్తుంది. అతనొక ఎమోషన్, అతనొక శక్తి" అని అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి లండన్‌లో చేసిన వ్యాఖ్యలు గమనార్హం. అదనపు అడ్వొకేట్ జనరల్ స్థాయిలో ఉన్న వ్యక్తి నోటి నుంచి ఇలాంటి మాటలు వచ్చాయంటే జగన్ రెడ్డి మద్దతుదారుల మనస్తత్వం అర్థం చేసుకోవచ్చు.

ప్రస్తుతం రాజకీయ పార్టీలు పులిమీద స్వారీ చేస్తున్నాయి. ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని అరికట్టే స్థితిలో ఎన్నికల కమిషన్ లేదు. పోలీసులతోపాటు పోలింగ్ సిబ్బందికి కూడా ప్రధాన రాజకీయపార్టీల అభ్యర్థులు లంచాలు ఇచ్చుకోవాల్సిన దుస్థితి. ఈ నేపథ్యంలో ప్రజలకు సేవ చేయాలన్న చిత్తశుద్ధిగలవారు ఎన్నికల్లో పోటీ చేయడం సాధ్యమా?

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..



కూటమికే జై!
ఎగ్జిట్ పోల్స్ అంచనా..
మెజారిటీ జాతీయ సర్వే సంస్థల మొగ్గు అటే

మోదీ హ్యాట్రిక్!

కేంద్రంలో మళ్లీ బీజేపీకి తిరుగు లేని మెజారిటీ
ఎన్డీయేకు 350 సీట్లకుపైనే అంటున్న ఎగ్జిట్ పోల్స్
400 స్థానాలకుపైన రావచ్చంటున్న 3 సంస్థలు
కేరళలో ఖాతా తెరవనున్న కాషాయ దళం
తమిళనాడు, ఏపీ, తెలంగాణల్లో మరింత విస్తరణ
ఒడిసాలో అధికారం దిశగా.. బెంగాల్లో బలంగా
ఢిల్లీ సహా ఉత్తరాదిలో పట్టు నిలుపుకోనున్న బీజేపీ
200 సీట్లు కూడా దాటని ఇండియా కూటమి

2

ముగిసిన ఏడు వారాల ఎన్నికలు

ఏడో దశలో 59 శాతం పోలింగ్ నమోదు
ఓటర్లకు, సిబ్బందికి, భద్రతా దళాలకు ఎన్నికల సంఘం కృతజ్ఞతలు
నేడు సిక్కిం, అరుణాచల్ అసెంబ్లీ ఫలితాలు

లోక్‌సభ సీట్ల ప్రాతిపదికన అంచనా

కూటమికి 21-23 రావచ్చన్న 'ఇండియా టుడే'
3 పార్టీల మధ్య సమన్వయం కుదిరిందన్న సంస్థ
ఓట్ల బదిలీ సవ్యంగా జరిగిందని వెల్లడి
21-25 సీట్లు ఇచ్చిన ఏబీపీ-సీవోటర్
19-23 రావచ్చన్న ఇండియా టీవీ
న్యూస్18 అంచనా 19-22 స్థానాలు
ఇక రాష్ట్ర స్థాయి సర్వే సంస్థల్లోనూ ఒకట్రెండు తప్ప అన్నీ కూటమికే జై!
వైసీపీకి 94-104 రావచ్చన్న 'ఆరా'

టీడీపీ కూటమికి అనుకూలంగా..

పీపుల్స్ పల్స్, ప్రిజమ్, చాణక్య స్ట్రాటజీ, రైజ్ పొలిటికల్, పీటీఎస్, పయనీర్, జనగళం, కేకే సర్వేస్, ఇండియా టీవీ-సీఎన్ఎక్స్, ఇండియాటుడే, రిపబ్లిక్ టీవీ-మ్యాట్రిజ్, ఏబీపీ-సీవోటర్.. సీఎన్ఎన్-న్యూస్18, టుడే చాణక్య

161 స్థానాలు వస్తాయన్న 'కేకే సర్వేస్'

గత ఎన్నికల్లో దాదాపుగా నిజమైన ఆ సంస్థ అంచనాలు

అమరావతి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ కూటమి ఘనవిజయం సాధిస్తుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ సర్వేలు అంచనా వేశాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాబోతోందని ప్రకటించాయి. జాతీయ స్థాయి సర్వే సంస్థల్లో అత్యధికం.. కూటమి వైపే మొగ్గు చూపించాయి. ఒక సర్వే సంస్థ మాత్రమే వైసీపీకి అనుకూల ఫలితాలను వెల్లడించింది. రాష్ట్రానికి చెందిన సర్వే సంస్థల్లో కొన్ని తప్ప మిగిలినవి కూడా టీడీపీ కూటమిదే విజయమని పేర్కొన్నాయి. కొన్ని సర్వేల్లో టీడీపీ కూటమికి భారీ మొగ్గు వ్యక్తం కావడం విశేషం. వైసీపీకి అనుకూలత వ్యక్తం చేసిన సర్వేలు ఆ పార్టీకి కొద్ది మొగ్గు మాత్రమే చూపించాయి. లోక్‌సభ ఎన్నికల తుది (ఏడో) దశ పోలింగ్ పూర్తయిన తర్వాత శనివారం సాయంత్రం 6.30 గంటల నుంచి ఎగ్జిట్ పోల్స్ వెలువడడం మొదలైంది. లోక్‌సభ స్థానాల ప్రాతిపదికన జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో అనేక సంస్థలు తమ సర్వే ఫలితాలను విడుదల

మిగతా 12వ పేజీలో...

రాష్ట్ర స్థాయి సర్వే సంస్థల అంచనాలు (అసెంబ్లీ సీట్లు)

సంస్థ	టీడీపీ కూటమి	వైసీపీ
కేకే సర్వేస్	161	14
పీపుల్స్ పల్స్	111-135	45-60
రైజ్	103-118	48-60
స్మార్ట్ సర్వే	93	82
ఆరా	71-81	94-104

జాతీయ స్థాయి సంస్థల సర్వే అంచనాలు (ఎంపీ సీట్లు)

సంస్థ	టీడీపీ కూటమి	వైసీపీ
ఇండియా టీవీ-సీఎన్ఎక్స్	19-23	3-5
సీఎన్ఎన్-న్యూస్18	19-22	5-8
ఏబీపీ-సీ ఓటర్	21-25	0-4
టైమ్స్ నౌ-సీటీజీ	11	14
టుడేస్ చాణక్య	22	3
రిపబ్లిక్ టీవీ-మ్యాట్రిజ్	18	7
ఇండియాటుడే	21-23	2-4

పదేళ్లయినా ఎక్కడి గొంగడి అక్కడే!

ఒక్క వాగ్దానమూ పూర్తికాని వైనం.. వెనుకబడిన జిల్లాలకు మొండిచేయి
డైలీ సీరియల్‌ను తలపిస్తున్న పోలవరం అంచనా వ్యయం కుదింపు
ఇరిగేషన్ కాంపోనెంట్‌కే నిధులిస్తామంటూ కేంద్రం మెలిక
నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ 2026 వరకు పెండింగ్
గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రానికీ బ్రేకు.. రైల్వేజోన్, ప్రత్యేక హోదా, కడప ఉక్కు పారిశ్రామిక కారిడార్‌కు కూడా జగన్ విధానాలతో అంతులేని జాప్యం

11

విభజన.. వివాదం

నత్తనడకన విభజన హామీల అమలు
చట్టంలో భరోసా.. ఆచరణలో నిరాశ

రాష్ట్రాన్ని విభజించి పదేళ్లు పూర్తయింది. సర్వం కోల్పోయిన అవశేష ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలా నిలబెట్టేందుకు కేంద్రం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ సంపూర్ణంగా అమలు కాలేదు. ప్రత్యేక హోదాకు ముందే నో చెప్పింది. గత ఎన్నికల సమయంలో ప్రకటించిన రైల్వే జోన్‌కు జగన్ సర్కారు భూములివ్వకుండా మోకాలడ్డింది. పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. అసోం, జమ్మూకశ్మీరుల్లో నియోజకవర్గ పునర్విభజన చేపట్టిన కేంద్రం.. మన రాష్ట్రంలో మాత్రం 2026 తర్వాతే చేస్తామని పక్కనపెట్టేసింది. చివరకు గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం ఏర్పాటు కూడా నత్తనడకన సాగుతోంది.

అప్రమత్తంగా ఉండండి



శాంతిభద్రతల పరిరక్షణే ముఖ్యం: సీఈఓ

భావోద్వేగాలు అదుపు తప్పే అవకాశం.. ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేలా ఉండాలి
చట్టబద్ధమైన ఆదేశాలు పాటించని వారిని లెక్కింపు కేంద్రం నుంచి పంపించేయండి
సమస్యాత్మక ప్రాంతాలను, వ్యక్తులను నిరంతరం పర్యవేక్షించండి
ఇప్పటి వరకూ ఎన్నికల ప్రక్రియను సాఫీగా నిర్వహించినందుకు ధన్యవాదాలు
ఎన్నికల అధికారులు, ఎస్పీలు, సీపీలకు మీనా లేఖ

12



మహా సంగ్రామం

టీ20 ప్రపంచకప్ నేటినుంచే
తొలిరోజు అమెరికాతో కెనడా, వెస్టిండీస్‌తో న్యూగినీ ఢీ

10

రూ.పది ఇవ్వరు..
ఫైవ్‌స్టార్ భోజనమట!

మధ్యాహ్న భోజనంపై వైసీపీ కలరింగ్

వంటచేసే వారికి స్టార్ హోటల్ చెఫ్‌ల వీడియోలు
అవి చూడగానే స్టార్ రుచులు వస్తాయట
ఆ హోటళ్లలో భోజనం ఖరీదు వేలల్లో
విద్యార్థులకు ఇచ్చేది రూ.8.57, రూ.5.88లే
ఈ మొత్తం పెంచాలని ఎండీఎం కార్మికుల గగ్గోలు
రేట్లు పెంచకుండా స్టార్ హోటల్ కబుర్లు

2

వైసీపీకి గట్టి షాక్!

పోస్టల్ బ్యాలెట్‌ల విషయంలో ఈసీ ఉత్తర్వులపై జోక్యం చేసుకోం

ఎన్నికల పిటిషన్ దాఖలుకు అవకాశం
అది కూడా ఫలితాలు ప్రకటించాకే
హైకోర్టు ఉత్తర్వులు.. పిటిషన్ కొట్టివేత
బెడిసి కొట్టిన అధికార పార్టీ కుటిల వ్యూహం



అమరావతి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్‌ల విషయంలో వైసీపీకి హైకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్‌కు సంబంధించి ఫారమ్-13ఏపై అటెస్టింగ్ అధికారి సంతకం ఉండి, హోదా వివరాలు లేకపోయినా బ్యాలెట్ చెల్లుబాటవుతుందని కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. ఈసీ నిర్ణయంపై అభ్యంతరం ఉంటే కౌంటింగ్ ప్రక్రియ ముగిసి, ఫలితాలు ప్రకటించిన తర్వాత ఎన్నికల పిటిషన్ దాఖలు చేసుకునేందుకు వైసీపీకి అవకాశం కల్పించింది. ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి వీల్లేదన్న కేంద్ర ఎన్నికల సంఘం వాదనతో ఏకీభవించింది. ఈ నేపథ్యంలో ఈసీ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వైసీపీ కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి వేసిన వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన ధర్మాసనం శనివారం తీర్పు చెప్పింది. పోస్టల్ బ్యాలెట్

మిగతా 2వ పేజీలో...

సర్వీసు ఓట్లనూ వదల్లేదు!

పోస్టాఫీసుకు వచ్చిన కవర్లు ఆర్వోకు పంపకుండా వెనక్కి
ఒంగోలులో 156 కవర్లను తిప్పి పంపిన పోస్టల్ సిబ్బంది
టీడీపీ నాయకుల ఫిర్యాదుతో మరోసారి పంపించిన వైనం
రేపు సాయంత్రానికల్లా అందకపోతే వృథా అయ్యే ప్రమాదం
'ప్రకాశం'లో సర్వీసు ఓటు వేసినవారు 5వేల మందికి పైనే
ఇప్పటికీ జిల్లా అధికారులకు చేరింది 1,896 ఓట్లు మాత్రమే

(ఒంగోలు-ఆంధ్రజ్యోతి)

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల విషయంలో నానా గందరగోళం సృష్టించడానికి జగన్ సర్కారు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను సవాలు చేస్తూ వైసీపీ నేతలు హైకోర్టుకు వెళ్లినా ఊరట దక్కలేదు. దీంతో వారి కన్ను సర్వీసు ఓట్లపై పడిందన్న ఆరోపణలు వస్తున్నాయి. రక్షణ సిబ్బంది పోస్టులో పంపిన సర్వీసు ఓట్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందించాల్సి ఉండగా వాటిని గుట్టుగా వెనక్కి తిప్పి పంపుతున్న వైనం వెలుగు

మిగతా 12వ పేజీలో...



ఖరీఫ్‌పై కోటి ఆశలు

సాగుకు సిద్ధమవుతున్న రైతన్న
మరో వారంలో రాష్ట్రమంతా నైరుతి
'వర్షాలు ఆశాజనకం'.. ఐఎండీ వెల్లడి
వైసీపీ ఐదేళ్ల పాలనలో వరుస నష్టాలు
అతివృష్టి, అనావృష్టితో కుదేలు
కోలుకోలేని దెబ్బతిన్న కౌలుదారు
ఈ ఏడు 86 లక్షల ఎకరాల్లో సాగు!
99,600 కోట్ల రుణాలు: బ్యాంకర్లు

నిరుడు 30% రైతులు సాగుకు దూరం
43 లక్షల ఎకరాల్లో పడని విత్తనం
కరువు మండలాల ప్రకటనలో కోత
తీవ్రంగా నష్టపోయిన లక్షలాదిమంది
ఇప్పటికీ అందని 'సాయం'

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ మొదలైంది. నైరుతి రుతుపవనాల విస్తరణ వేగంగా సాగుతోంది. రెండు, మూడు రోజుల్లో రాయలసీమకు వచ్చి, అతికొద్ది రోజుల్లో రాష్ట్రమంతా విస్తరించనున్నాయి. వర్షాలు విస్తారంగా కురిస్తే పంటల సాగు ప్రారంభం కానున్నది. కొద్దిరోజులుగా వేసవి దుక్కులతో పొలాలను సిద్ధం చేస్తున్న రైతులు ఖరీఫ్ సాగుకు అనువైన వంగడాలను సమకూర్చుకుంటున్నారు. ప్రభుత్వ రాయితీ విత్తనాలు పూర్తిస్థాయిలో అందుతాయన్న నమ్మకం లేని కొందరు రైతులు బయట వ్యాపారుల వద్ద

మిగతా 11వ పేజీలో...

మూడు రోజుల్లో సీమకు నైరుతి?

రేపటి నుంచి రాష్ట్రంలో పెరగనున్న వర్షాలు
ఏలూరు జిల్లాలో వడదెబ్బకు ఇద్దరు మృతి

12

నేడూ ఎండ, ఉక్కపోత

ముగిసిన మోదీ ధ్యానం

2



దేశ సేవకే జీవితం అంకితమని సందేశం
తమిళ కవి తిరువళ్లువర్‌కు పుష్పాంజలి
కన్యాకుమారి నుంచి ఢిల్లీకి పయనం

పీవోకే మాది కాదు

అది విదేశీ భూభాగమే.. అక్కడ పాక్ చట్టాలు చెల్లవు
ఇస్లామాబాద్ హైకోర్టులో అక్కడి ప్రభుత్వం అంగీకారం
కశ్మీరీ కవి కిడ్నాప్ కేసులో వాదనలు

2

ఆ ఫిరాయింపులకు నేను కారణం కాదు

చెప్పుడు మాటలు విని నన్ను బకరాను చేశారు
చేయని తప్పునకు పోరాటం చేయాల్సి వచ్చింది
వివేకా హత్య కేసులో ప్రాథమిక సాక్ష్యాలే కీలకం
అప్పట్లో పూర్తి ఆధారాలు సేకరించలేదు
ప్రజలు, సమాజం కోసం స్పందిస్తూనే ఉంటా
'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'తో ఏబీ వెంకటేశ్వరరావు

12





విజయంపై 'ఇండియా' నేతల ధీమా..

న్యూఢిల్లీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఎగ్జిట్‌పోల్స్ ఎలా ఉన్నప్పటికీ.. ఇండియా కూటమి 295కు పైగా ఎంపీ సీట్లు సాధిస్తుందని ఆ కూటమి నేతలు ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఇండియా కూటమి నేతలు సమావేశమై భవిష్యత్తు కార్యాచరణపై దాదాపు రెండున్నర గంటలపాటు చర్చించారు. బీజేపీ ఎంతగా రెచ్చగొట్టినా సంయమనం కోల్పోకుండా వ్యవహరించాలని, బీజేపీ అనుకూల మీడియా సంస్థల ప్రచారానికి లోబడకూడదని సమావేశంలో నిర్ణయించారు.



ప్రపంచంలోనే ఎత్తైన పోలింగ్ స్టేషన్ తాశిగంగ్ వద్ద ఓటర్లు

ముగిసిన ఏడు వారాల ఎన్నికలు

» ఏడో దశలో 61% పోలింగ్.. సిబ్బందికి ఈసీ కృతజ్ఞతలు

» నేడు సిక్కిం, అరుణాచల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

న్యూఢిల్లీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గత ఏడు వారాలుగా ఏడు దశలలో జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. శనివారం జరిగిన చివరి విడతలో 61.63% పోలింగ్ నమోదైందని ఎన్నికల సంఘం (ఈసీ) ప్రకటించింది. చివరి విడతలో దేశవ్యాప్తంగా 57 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో యూపీలో 13 స్థానాలు, బిహార్‌లో 8, పంజాబ్‌లో 13, పశ్చిమబెంగాల్‌లో 9, ఒడిశాలో 6, హిమచల్‌ప్రదేశ్‌లో 4, జార్ఖండ్‌లో 3, చండీగఢ్‌లో ఒక స్థానం ఉన్నాయి. ఒడిశాలోని 42 అసెంబ్లీ స్థానాలకు కూడా చివరిదశలోనే ఎన్నికలు జరిగాయి. బిహార్‌లో 51.92%, చండీగఢ్‌లో 67.9%, హిమాచల్ ప్రదేశ్‌లో 69.67%, జార్ఖండ్‌లో 70.66%, ఒడిశాలో 70.67%, పంజాబ్‌లో 58.33%, యూపీలో 55.59%, పశ్చిమబెంగాల్‌లో 73.36% పోలింగ్ జరిగినట్లు ఈసీ తెలిపింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలతో పాటే అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరిగాయి. కాగా, పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినందుకు ఓటర్లు, పోలింగ్ సిబ్బంది, భద్రతా బలగాలు, వలంటీర్లు, రైల్వేకు ఈసీ కృతజ్ఞతలు తెలిపింది. 'భారతీయ ప్రజాస్వామ్యం, భారత ఎన్నికలు మరోసారి మ్యాజిక్ చేశాయి. కులం, మతం, సామాజిక, ఆర్థిక, విద్యా నేపథ్యాలకు అతీతంగా భారతీయ ఓటర్లు తమ గొప్పదనాన్ని మరోసారి చాటుకున్నారు' అని ఈసీ పేర్కొంది. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 19న జరిగిన తొలిదశతో ప్రారంభమైంది. ఎన్నికల ప్రక్రియలో ఆఖరి ఘట్టమైన ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఈ నెల 4వ తేదీన జరగనుంది. కాగా సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడనున్నాయి. ఉదయం 6 గంటలకు కౌంటింగ్ మొదలవుతుందని ఈసీ తెలిపింది.

ముగిసిన ప్రధాని మోదీ ధ్యానం

చెన్నై, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ తమిళనాడులోని కన్యాకుమారిలో స్వామి వివేకానందుడి స్మారకమందిరంలో చేపట్టిన 45 గంటల ధ్యానం శనివారం మధ్యాహ్నం ముగిసింది. తన జీవితంలోని ప్రతి క్షణం ప్రజాసేవకే అంకితమని ఈ సందర్భంగా వివేకానందుని స్మారకమందిరం విజిటర్స్ పుస్తకంలో మోదీ తన సందేశాన్ని రాశారు. 'వివేకానంద స్మారక మందిరం సందర్శనతో నాకు అద్భుతమైన దివ్య శక్తి ప్రాప్తించినట్టు అనిపిస్తోంది. స్వామి వివేకానంద ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి మార్గదర్శకుడు. ఆయనే నాకు స్ఫూర్తి. స్వామి వివేకానంద దేశమంతా పర్యటించిన తర్వాత ఇక్కడే ధ్యానం చేశారు. భారతదేశ పునరుజ్జీవనానికి కొత్త మార్గాన్ని ఆయన ఇక్కడే కనుగొన్నారు. చాలా ఏళ్ల తర్వాత స్వామి వివేకానంద కలలుగన్న భారతదేశాన్ని ఆయన విలువలు, ఆలోచనలతో తీర్చిదిద్దుతున్న సందర్భంగా ఇదే స్థలంలో ధ్యానం చేసే అవకాశం నాకు లభించడం నా అదృష్టం. నా జీవితంలోని ప్రతి క్షణం, నా శరీరంలోని ప్రతి కణం దేశ సేవకే అంకితం చేస్తానని భారత మాత పాదాల వద్ద కూర్చొని మరోసారి పునరుద్ఘాటిస్తున్నా' అని విజిటర్స్ పుస్తకంలో మోదీ పేర్కొన్నారు. ధ్యానం ముగించిన అనంతరం ఆయన తెల్లని దుస్తులు ధరించారు. సమీపంలోనే ఉన్న 133 అడుగుల ఎత్తయిన తమిళ కవి తిరువళ్లువర్ విగ్రహాన్ని మోదీ సందర్శించి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ప్రధాని ఢిల్లీకి వెళ్లారు.

విశ్వసనీయ మరణ వాంగ్మూలం ఒక్కటి చాలు

న్యూఢిల్లీ, జూన్ 1: మరణ వాంగ్మూలం యదార్థమైనదైతే దాన్ని విశ్వసించి కోర్టులు తీర్పులు ఇవ్వవచ్చని, ఇంకా ఇతరత్రా ఎలాంటి సాక్ష్యాలు అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మరణ వాంగ్మూలం వాస్తవమైనదని కోర్టు బలంగా నమ్మినప్పుడు కేవలం ఆ ఒక్క దాన్ని ఆధారం చేసుకొని నిందితుణ్ణి శిక్షించవచ్చని, ఇతరత్రా రూపాల్లో ఆ వాంగ్మూలాన్ని ధ్రువపరచుకోవాల్సిన పని లేదని తెలిపింది. అయితే మరణ వాంగ్మూలాన్ని జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొంది.

కుమారుడిని కాల్చి చంపాడు!

» ఒంగోలులో ఏఆర్ కానిస్టేబుల్ ఘాతుకం

ఒంగోలు (క్రైం), జూన్ 1: జీతం ఇవ్వలేదని ప్రశ్నించిన కుమారుడిని విధుల్లో ఉన్న కానిస్టేబుల్ తుపాకీతో కాల్చి చంపాడు. ఈ సంఘటన శనివారం రాత్రి ప్రకాశం జిల్లా ఒంగోలులోని భాగ్యనగర్‌లో ఉన్న వీవీప్యాట్‌ల గోదాము వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ప్రకాశం జిల్లా త్రిపురాంతకానికి చెందిన కె.ప్రసాద్ ఒంగోలులో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన మద్యం సేవించి విధుల్లో ఉండగా, ఆయన కుమారుడు శేషకుమార్ (20) శనివారం రాత్రి వెళ్లి జీతం డబ్బులు ఇంట్లో ఇవ్వడం లేదేమని తండ్రిని ప్రశ్నించాడు. దీంతో కానిస్టేబుల్ ప్రసాద్ ఆగ్రహంతో ఊగిపోయాడు. తనవద్ద ఉన్న తుపాకీతో శేషకుమార్‌పై కాల్పులు జరపడంతో ఆయన మృతి చెందాడు. అడ్డుకోబోయిన సహచర కానిస్టేబుల్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కాల్పులకు ప్రయత్నించగా అతను తప్పుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు.

మోదీ హ్యాట్రిక్!

న్యూఢిల్లీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ హ్యాట్రిక్ కొట్టబోతున్నారా!? కేంద్రంలో వరుసగా మూడోసారి కూడా బీజేపీయే తిరుగులేని మెజారిటీతో అధికారంలోకి రాబోతోందా!? ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎన్డీయే ప్రభంజనమేనా!? టీడీపీ అధినేత చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ఘన విజయం సాధించనుందా!? తెలంగాణలో కాషాయ సునామీ రానుందా!? అత్యధిక సీట్లలో బీజేపీ ఘన విజయం సాధించనుందా!? ఈ ప్రశ్నలు అన్నిటికీ 'ఔను' అనే అంటున్నాయి మెజారిటీ ఎగ్జిట్ పోల్స్! దేశవ్యాప్తంగా ఎన్డీయే సునామీని అత్యధిక పోల్స్ అంచనా వేశాయి. ఎన్డీయే 400కుపైగా సీట్లు సాధించే అవకాశం ఉందని ఇండియా టుడే - సీఎన్ఎక్స్; టుడేస్ చాణక్య; ఇండియా టుడే - యాక్సిస్ మై ఇండియా సర్వేలు తేల్చి చెప్పాయి. ఇండియా కూటమి డబుల్ డిజిట్‌కే పరిమితమయ్యే అవకాశాన్ని కొట్టిపారేయలేమని టుడేస్ చాణక్య సర్వే తెలిపింది. ఏడు దశల సార్వత్రిక సమరం శనివారం ముగిసింది! ఏడో దశ పోలింగ్ ముగిసిన తర్వాత ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. వాటిలో అత్యధిక సంస్థలు తిరుగు లేని మెజారిటీతో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని అంచనా వేశాయి. ఎన్డీయేకు 350కిపైగా స్థానాలు వస్తాయని ఇండియా టుడే, ఇండియా న్యూస్ - డి డైనమిక్స్, జన్ కీ బాత్, రిపబ్లిక్ భారత్ - మ్యాట్రిజ్; రిపబ్లిక్ టీవీ- పి మార్క్; టుడేస్ చాణక్య తదితర సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు తేల్చాయి. ప్రతిపక్ష పార్టీలన్నీ జట్టు కట్టినా.. కుల గణన, రిజర్వేషన్ల అంశాలను తెరపైకి తెచ్చినా.. ఇండియా కూటమి పెద్దగా ప్రభావం చూపించలేకపోయిందని స్పష్టం చేశాయి. దైనిక్ భాస్కర్ మినహా మిగిలిన అన్ని సంస్థలు ఎన్డీయేకి 350 సీట్లకు పైనే వస్తాయని; ఇండియా కూటమికి 200 స్థానాల్లోపు వస్తాయని అంచనా వేశాయి. ఎన్డీటీవీ పోల్ ఆఫ్ పోల్స్ సర్వే ప్రకారం.. ఎన్డీయేకు 361; ఇండియా కూటమికి 145; ఇతరులకు 37 సీట్లు లభించనున్నాయి. ఎన్నికల ఫలితాలు 4న వెలువడనున్న సంగతి తెలిసిందే.

దక్షిణాదిలో పాగా..

ఇప్పటి వరకూ ఉత్తరాదికి, ఈశాన్య రాష్ట్రాలకే పరిమితమైన బీజేపీ.. ఈసారి దక్షిణాదిలోనూ గణనీయమైన సంఖ్యలో సీట్లను సాధించనుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. మరీ ముఖ్యంగా, ఒకప్పుడు కమ్యూనిస్టుల కంచుకోట, విద్యాధికుల రాష్ట్రమైన కేరళలో బీజేపీ ఖాతా తెరవనుంది. ఇక్కడ బీజేపీకి 1-3 సీట్లు వస్తాయని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. తమిళనాడులోనూ బీజేపీ సీట్ల సంఖ్య పెరగనుందని అంచనా వేశాయి. ఇక్కడ బీజేపీకి అనూహ్యంగా 5 నుంచి 7 సీట్ల వరకు లభించవచ్చని ఇండియా టీవీ- సీఎన్ఎక్స్, జన్ కీ బాత్ తేల్చాయి. తద్వారా.. రాబోయే పార్లమెంటులో దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల నుంచీ బీజేపీ ప్రాతినిధ్యం ఉండనుందని స్పష్టం చేస్తున్నాయి. అంతేనా.. గత ఎన్నికల ఫలితాల్లో అసలు ప్రాతినిధ్యమే లేని ఆంధ్రప్రదేశ్‌లో ఈసారి సొంతంగానే గణనీయ సంఖ్యలో సీట్లు సాధించుకోనుందని, కర్ణాటకలో పట్టును నిలుపుకోనుందని; తెలంగాణలో మరింత విస్తరించనుందని ఆయా ఎగ్జిట్ పోల్స్ సంస్థలు తెలిపాయి. కర్ణాటకలో ఎన్డీయే 23-25 సీట్లను సాధిస్తుందని ఇండియా టుడే యాక్సిస్ - మై ఇండియా పోల్‌తోపాటు న్యూస్ 18 సంస్థ అంచనా వేసింది.

తూర్పులో అధికారం దిశగా...

బీజేపీ ఒడిసాలో ఈసారి అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని, లోక్‌సభ ఎన్నికల్లోనూ మెజారిటీ సీట్లు దక్కించుకుంటుందని అంచనా వేశాయి. బెంగాల్లో గతంలో కంటే మెరుగైన ప్రదర్శన కనబరుస్తుందని, ఇక్కడ తృణమూల్ కాంగ్రెస్‌ను మించి లోక్‌సభ సీట్లను సాధిస్తుందని విశ్లేషిస్తున్నాయి. జార్ఖండ్‌లోనూ బీజేపీయే పైచేయి సాధిస్తుందని, బిహార్లో ఈసారి కూడా ఎన్డీయేకే మెజారిటీ సీట్లు వస్తాయని స్పష్టం చేస్తున్నాయి. వెరసి, తూర్పులోనూ రాబోయే రోజుల్లో అధికారం దిశగా బీజేపీ అడుగులు వేస్తోందని సంకేతాలు ఇస్తున్నాయి.

ఉత్తరాది మళ్లీ కాషాయమయమే

ఉత్తరాదితోపాటు ఈశాన్య రాష్ట్రాల్లో మళ్లీ బీజేపీయే ఆధిక్యం ప్రదర్శించబోతోందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఆప్ కనుమరుగు కానుందని విశ్లేషిస్తున్నాయి. గుజరాత్, పంజాబ్‌తోపాటు అటు ఢిల్లీలో కూడా బీజేపీయే పైచేయి సాధించనుందని స్పష్టం చేశాయి. గుజరాత్‌లో మళ్లీ మొత్తం 26 సీట్లు బీజేపీయే సాధిస్తుందని న్యూస్ 18 చెబితే.. న్యూస్ 24- టుడేస్ చాణక్య ప్రకారం పంజాబ్‌లో బీజేపీకి 4, కాంగ్రెస్‌కు 4, ఆప్‌కు 2 సీట్లు లభించే అవకాశం ఉందని తెలిపింది. ఢిల్లీ, గుజరాత్, హరియాణా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో ఎప్పట్లాగే బీజేపీకే మెజారిటీ సీట్లు రానున్నాయని తేల్చి చెప్పాయి. ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌లలో మొత్తం సీట్లు బీజేపీకే దక్కనున్నాయని టుడేస్ చాణక్య అంచనా వేసింది. ఒక్క మహారాష్ట్రలో ఇండియా కూటమి కాస్త పోటీ ఇచ్చినా.. ఎన్డీయే కూటమికే మెజారిటీ స్థానాలు వస్తాయని అంచనా వేశాయి. మహారాష్ట్రలో ఎన్డీయేకు 32-35, ఇండియా కూటమికి 15-18 మధ్య సీట్లు లభిస్తాయని న్యూస్ 18 సంస్థ తేల్చింది.

సర్వే సంస్థ	ఎన్డీయే	ఇండియా	ఇతరులు
ఇండియా టుడే- యాక్సిస్ మై ఇండియా	361-401	131-166	8-20
ఏబీపీ-సీ ఓటర్	353-383	152-182	4-12
దైనిక్ భాస్కర్	281-350	145-201	33-49
ఇండియా టీవీ-సీఎన్ఎక్స్	371-401	109-139	28-38
రిపబ్లిక్ టీవీ-పీ మార్క్	359	154	30
టైమ్స్ నౌ-ఈటీజీ	358	152	33
ఇండియా న్యూస్	371	125	47
న్యూస్ నేషన్	342-378	153-169	21-23
జన్ కీ బాత్	362-392	141-161	10-20
టుడేస్ చాణక్య	385-415	96-118	27-45
రిపబ్లిక్ భారత్-మ్యాట్రిజ్	353-368	118-133	43-48
ఎన్డీటీవీ పోల్ ఆఫ్ ద పోల్స్	361	145	37
పోల్‌స్టార్ట్ ప్లస్	346	162	35



ప్రజలు ఎన్డీయే ప్రభుత్వంపై విశ్వాసం ఉంచారని నమ్మకంగా చెప్పగలను. మా పనితీరు కారణంగా తమ జీవితాల్లో గుణాత్మక మార్పు వచ్చిందని పేదలు, బడుగు, బలహీన వర్గాల వారు గుర్తించారు.

- నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి



మా కూటమికి 295 సీట్లు వస్తాయి. ఒక్కటి కూడా తగ్గదు. మా కూటమి నాయకులందరి నుంచీ వివరాలు సేకరించాకే ఈ నిర్ధారణకు వచ్చాం. ప్రజలు మా నాయకులకు చెప్పిందే, మేము మీకు చెబుతున్నాం.

- మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు



ఎగ్జిట్ కావడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తే ఈ ఎగ్జిట్ పోల్స్‌కు సూత్రధారి. 'ఇండియా' కూటమి కనీసం 295 సీట్లు సాధిస్తుంది. దిగిపోతున్న ప్రధాని మాపై మానసికంగా దెబ్బ తీయడానికి ఇలాంటి ఆటలు ఆడుతున్నారు. అసలు ఫలితాలు భిన్నంగా ఉంటాయి.

- జైరాం రమేశ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

లోకం తీరు

లండన్ నుంచి రాష్ట్రానికి జగన్



నాగపూర్‌లో 56 డిగ్రీలు.. సెన్సర్ లోపం వల్లే కావొచ్చు

న్యూఢిల్లీ, జూన్ 1: నాగపూర్‌లో నమోదైన 56 డిగ్రీల ఉష్ణోగ్రత సరైంది కాదని, ఆటోమాటిక్ వెదర్ స్టేషన్(ఏడబ్ల్యూఎస్)లో సెన్సర్ లోపం వల్ల తప్పుడు ఫలితం వచ్చి ఉంటుందని ప్రాంతీయ వాతావరణ శాఖ వెల్లడించింది. ఆటోమాటిక్ వ్యవస్థలు ఒక్కోసారి తప్పుడు నివేదికలు ఇస్తాయని వివరించింది. "ఏడబ్ల్యూఎస్ ఉన్న ప్రాంతంలో పరిస్థితులు, సెన్సర్లలో లోపాలు, సెన్సర్లు దెబ్బతినడం, వాటి భద్రత కవచం దెబ్బతినడం వల్ల తప్పుడు ఉష్ణోగ్రతలను చూపుతాయి. మే 30న నాగపూర్ స్టేషన్‌లో నమోదైన ఉష్ణోగ్రతలు సరైనవి కావు" అని పేర్కొంది.

పీవోకే మాది కాదు.. పాక్ ప్రభుత్వం అంగీకారం

న్యూఢిల్లీ, జూన్ 1: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) విదేశీ భూభాగమని, దానిపై పాకిస్థాన్‌కు ఎలాంటి అధికార పరిధి లేదని పాక్ ప్రభుత్వం అంగీకరించింది. కశ్మీరీ కవి, జర్నలిస్టు అహ్మద్ ఫర్హాద్ షా కిడ్నాప్ కేసు విచారణలో భాగంగా ఇస్లామాబాద్ హైకోర్టు ముందు పాక్ అదనపు అటార్నీ జనరల్ ఈ మేరకు ప్రకటన చేశారు. ఫర్హాద్ షా పీవోకేలో పోలీసుల కస్టడీలో ఉన్నారని, ఆయన్ను కోర్టులో హాజరుపర్చడం సాధ్యం కాదని తెలిపారు. కశ్మీర్... తన కంటూ ప్రత్యేక రాజ్యాంగం, కోర్టులు కలిగిన విదేశీ భూభాగమని, అక్కడ పాక్ చట్టాలు చెల్లుబాటు కాబోవని పేర్కొన్నారు.

తగ్గిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర

న్యూ ఢిల్లీ, జూన్ 1: ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలు హోటళ్లు, రెస్టారెంట్లలో వాడే వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరలు తగ్గించాయి. 19 కేజీల వాణిజ్య సిలిండర్‌కు రూ.69 చొప్పున తగ్గించడం విశేషం. కాగా ఇళ్లలో వాడే 14.2 కేజీల గ్యాస్ సిలిండర్ల ధర మాత్రం రూ.803 వద్దే స్థిరంగా ఉంచాయి. విమాన ఇంధనం ధర కూడా ఏకంగా 6.5 శాతం తగ్గించాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుముఖం పట్టడంతో ఈ నిర్ణయం తీసుకున్నాయి.

సల్మాన్ ఖాన్‌ను చంపేందుకు.. రంగంలోకి మైనర్లు!

» పాక్ నుంచి ఆయుధాలు

» బిష్ణోయ్ గ్యాంగ్ కుట్ర



ముంబై, జూన్ 1: బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్‌ఖాన్‌ను అంతమొందించేందుకు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ భారీ కుట్ర పన్నిందని, ఇందుకు మైనర్ బాలురను రంగంలోకి దింపిందని నవీ ముంబై పోలీసులు గుర్తించారు. ఇందుకోసం కెనడాలో ఉంటున్న బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్, గోల్డీబ్రార్ తమ గ్యాంగ్‌కు పాకిస్థాన్ నుంచి ఏకే-47, ఏకే-92, ఎం-16 ఆయుధాలను తరలించినట్టు దర్యాప్తు అధికారులు తేల్చారు. ఇందుకు పాక్‌లోని డోగర్ అనే ఆయుధాల డీలర్ సహకరించినట్లు ఆధారాలు సేకరించారు. ఏప్రిల్ 14న బంద్రాలోని సల్మాన్ ఇంటి వద్ద బైక్‌పై వచ్చి ఇద్దరు దుండగులు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే.! ఈ కేసులో పోలీసులు నిందితులు.. గుజరాత్‌లో తలదాచుకు న్న విక్కీ గుప్తా అలియాస్ సాగర్‌పాల్, పంజాబ్‌లో ఉన్న అంజూ థాపన్, మరో వ్యక్తితోపాటు తదుపరి దర్యాప్తులో ఇంకో ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ కేసులో అన్మోల్, గోల్డీబ్రార్ మరో 17మందిపై పోలీసులు కేసునమోదు చేశారు.

ఓట్ల కోసం నోట్ల వర్షం!

ఒక్కో ఓటుకు రూ.1,400 వినియోగం

» దాదాపు రూ.1.35 లక్షల కోట్ల ఖర్చు

» భారీగా ఖర్చు చేసిన పార్టీలు, నాయకులు

» సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ వెల్లడి



న్యూఢిల్లీ, జూన్1: దేశంలో 7 దశల్లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కరెన్సీ పరుగులు పెట్టింది. ఓటర్లపై నోట్ల వర్షం కురిసింది. దీంతో గతంలో ఎన్నడూ లేనంతగా అత్యంత ఖరీదైన ఎన్నికలుగా ఈ ఎన్నికలు చరిత్ర సృష్టించాయి. తాజా ఎన్నికల్లో దాదాపు రూ.1.35 లక్షల కోట్లు ఖర్చయినట్టు సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ వెల్లడించింది. దీని ప్రకారం ఒక్కో ఓటుకు రూ.1,400 ఖర్చు చేసినట్టు ఈ సంస్థ అంచనావేసింది. పార్లమెంటుకు పోటీచేసే అభ్యర్థి రూ.95 లక్షల వరకు ఖర్చు చేసే అవకాశం ఉంది. తాజా ఎన్నికల్లో ఈ హద్దులు చెరిగిపోయినట్టు సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ తెలిపింది. రాజకీయ పార్టీలు పెట్టే ఖర్చులకు ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో ప్రధాన పార్టీలు విరివిగా ఖర్చు చేశాయని..ముఖ్యంగా అధికార పార్టీ బీజేపీ, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ సహా ప్రాంతీయ పార్టీలైన సమాజ్‌వాదీ, ఆర్జేడీ పార్టీలు ఓటర్లను ఆకట్టుకునేందుకు చేతికి ఎముకలేకుండా ఖర్చు చేశాయని ఈ అధ్యయనం తెలిపింది. ముందస్తు అంచనాల ప్రకారం ఈ ఎన్నికల్లో రూ.లక్ష కోట్ల వరకు ఖర్చు పెడతారని అంతా భావించారు. కానీ, అంచనాలను మించి రూ.1.35 లక్షల కోట్ల వరకు నాయకులు, పార్టీలు ఖర్చు చేసినట్టు అధ్యయనం తెలిపింది. ఇది 2019 ఎన్నికలతో పోల్చితే రూ.55-60 వేల కోట్లు ఎక్కువని పేర్కొంది. అమెరికాలో 2020లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో రూ.1.2 లక్షల కోట్లు ఖర్చు కాగా భారత్ దీన్ని అధిగమించింది. ఇక సార్వత్రిక ఎన్నికల వేళ కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థి రూ.95లక్షలే ఖర్చు చేయాలని పేర్కొంది. అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థి రూ.28లక్షల నుంచి రూ.40లక్షల మధ్య ఖర్చు పెట్టాలని నిబంధనలు విధించింది. అరుణాచల్‌ప్రదేశ్‌లో ఎంపీ అభ్యర్థి రూ.75లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థి రూ.28 లక్షలే ఖర్చు చేయాలని పేర్కొంది. ఎవరూ ఈ పరిమితులను పట్టించుకోలేదని అధ్యయన సంస్థ వెల్లడించింది. రాజకీయ పార్టీల ఖర్చులపై నిబంధనలు విధించకపోవడంతో బీజేపీ, కాంగ్రెస్‌సహా అన్ని ప్రాంతీయ పార్టీలు విచ్చలవిడిగా ఖర్చు చేశాయని తెలిపింది. ఓటర్లను ప్రలోభపరిచే కానుకలు, నగదు పంపిణీ వంటివి గోప్యంగా సాగినట్టు పేర్కొంది.

ఇంతింతై.. అన్నట్టే!

దేశంలో 1951-52 మధ్య జరిగిన ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి రూ.25 వేలే ఖర్చు చేయాలని నిబంధన విధించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఈ ఖర్చు రూ.75-95 లక్షలకు పెంచారు. తొలి ఎన్నికలతో పోల్చితే ప్రస్తుత ఖర్చు ఏకంగా 300 రెట్లు పెరిగినట్టయింది. 1998లో రూ.9,000 కోట్లున్న ఎన్నికల వ్యయం 2019నాటికి రూ.55 వేల కోట్లకు చేరింది. మొత్తంగా తాజా సార్వత్రిక ఎన్నికల్లో పార్టీలు, నాయకులు కరెన్సీ కట్టలు కురిపించారు.

వైసీపీకి గట్టి షాక్!

(మొదటి పేజీ తరువాయి)

డిక్లరేషన్‌కు సంబంధించి ఈసీ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. మరోవైపు ఇదే పిటిషన్‌లో తనను ప్రతివాదిగా చేర్చుకుని వాదనలు వినాలని కోరుతూ విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై శుక్రవారం హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల డ్యూటీలో ఉండి ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఉద్యోగులకు గత నెల 30న ఇచ్చిన ఉత్తర్వులు వర్తిస్తాయన్నారు. ఫెసిలిటేషన్ సెంటర్‌లోని అటెస్టింగ్ ఆఫీసర్‌ను రిటర్నింగ్ అధికారే నియమించారని, ఈ నేపథ్యంలో ఫాం 13(ఏ)పై అటెస్టింగ్ అధికారి సంతకం ఉంటే సరిపోతుందని తెలిపారు. ఆ అధికారి పేరు, సీలు ఉండాల్సిన అవసరం లేదన్నారు. రాజ్యాంగంలోని అధికరణ 329(బీ) ప్రకారం ఎన్నికల ప్రక్రియలో కోర్టులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదన్నారు. ఈసీ నిర్ణయాలపై ఎన్నికల పిటిషన్ ద్వారా మాత్రమే సవాల్ చేయగలరని తెలిపారు. ఇరువైపుల వాదనలు ముగియడంతో ధర్మాసనం శుక్రవారం తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం శనివారం నిర్ణయాన్ని వెల్లడించింది.

బెడిసి కొట్టిన వైసీపీ వ్యూహం

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అన్ని రకాల అడ్డదార్లు తొక్కి విఫలమైన వైసీపీ, చివరికి కోర్టులో కూడా భంగపాటుకు గురైంది. ఎన్నికల అధికారులు, విపక్షాలపై అనేక విమర్శలు చేసిన వైసీపీ చివరికి పోస్టల్ బ్యాలెట్‌పై భారీ ఆరోపణలు గుప్పించింది. పోస్టల్ బ్యాలెట్‌ను తప్పుదోవ పట్టించి టీడీపీని దెబ్బకొట్టాలని ప్రయత్నించింది. కానీ వైసీపీ రాజకీయ కుటిల వ్యూహానికి హైకోర్టు చెక్ పెట్టింది. పోస్టల్ బ్యాలెట్‌లో జోక్యం చేసుకునేది లేదని తేల్చి చెప్పింది. కాగా, పోలింగ్ సరళిని పరిశీలించిన తర్వాత ఓటమి ఖాయమని తాడేపల్లి పెద్దలు ఓ నిర్ణయానికి వచ్చారు. అయినప్పటికీ ఏదో ఒక విధంగా ఎన్నికల ప్రక్రియలో గందరగోళం సృష్టించాలన్న ఉద్దేశంతో పోస్టల్ బ్యాలెట్‌పై రాజకీయం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు వేసిన పోస్టల్ బ్యాలెట్‌ను అడ్డుకోవానికి కోర్టును ఆశ్రయించారు. అక్కడే వైసీపీ మాస్టర్ ప్లానతో పాటు కుటిల వ్యూహం బట్టబయలైంది. పోస్టల్ బ్యాలెట్‌పై రిటర్నింగ్ అధికారి సీల్ లేకపోతే దాన్ని తిరస్కరించాలన్నది వైసీపీ డిమాండ్. ఒక రాజకీయ పార్టీగా ఉండి, ఐదేళ్ల నుంచి అధికారంలో ఉన్న వైసీపీ నేతలకు ఈ ఆలోచన రావడమే విచిత్రం.

నిబంధనలకు అనుగుణంగానే

బ్యాలెట్ పేపర్‌పై పోటీలో ఉన్న అభ్యర్థి పేరు, ఫొటో, దానికి ఎదురుగా పార్టీ గుర్తు ఉంటాయి. ఓటరు తన ఓటు ఎవరికి వేయాలని నిర్ణయిస్తారో ఆ గుర్తుపై స్వస్తిక్ మార్క్ వేస్తారు. ఇప్పుడు ఉద్యోగులు వేసిన పోస్టల్ బ్యాలెట్ కూడా అలానే ఉంది. కానీ, ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌పైన స్వస్తిక్ సింబల్ కాకుండా వారు ఎవరికి ఓటు వేయాలని అనుకుంటున్నారో ఆ గుర్తుపై టిక్ చేస్తే సరిపోతుంది. ప్రభుత్వ ఉద్యోగులంతా ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగానే ఓటు వేశారు. అంతేకాకుండా ఆర్వో సంతకం ఉందా? సీల్ వేయాలా? అసలు ఆర్వో ఉన్నారా? ఆర్వోను ఈసీనే నియమించిందా? వంటి విషయాలతో ఉద్యోగులకు సంబంధం లేదు. తాము ఓటు వేశామన్న విషయాన్ని మాత్రమే వారు చూసుకుంటారు. కానీ, వైసీపీ మాత్రం ఆర్వో సంతకం, సీల్ వేయని ఓట్లు చెల్లకుండా చేయాలని వాదనకు దిగింది. భారీగా వేసిన ఉద్యోగుల ఓట్లు తమకు వ్యతిరేకంగా ఉన్నాయని గ్రహించడంతోనే ఈ వివాదాన్ని సృష్టించినట్టు పరిశీలకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వాటిని చెలుబాటు కాకుండా చేసే ఎత్తుగడ వేసింది. ఈ కుట్రలో భాగంగానే కోర్టుకు వెళ్లింది. అయితే, హైకోర్టు మాత్రం ఈసీ నిర్ణయాల్లో తాము జోక్యం చేసుకోబోమని తేల్చిచెప్పింది. దీంతో ఆ పార్టీ వ్యూహం బెడిసి కొట్టింది.

ఫైస్టార్ హోటల్‌లో భోజనం ఖరీదు రూ.వెయ్యి పైనే! త్రీస్టార్ హోటల్‌లో అయినా దాదాపుగా అంతే ఉంటుంది!! బయట మెస్‌లో భోజనం చేసినా రూ.వంద పెట్టాల్సిందే.. కానీ పట్టుమని పది రూపాయలు ఇవ్వకుండా.. పాఠశాలల్లో విద్యార్థులకు ఫైవ్‌స్టార్ రుచులతో భోజనం పెడతామంటూ వైసీపీ ప్రభుత్వం కలరింగ్ ఇస్తోంది. మధ్యాహ్న భోజనం పథకంలో ఇకపై స్టార్ హోటల్ రుచులు అంటూ కొత్త ప్రచారం మొదలుపెట్టింది. ఓ ప్రైవేటు స్టార్ హోటల్ చెఫ్‌లతో మధ్యాహ్న భోజనం వండుతున్న వంట కార్మికులకు తాజాగా అవగాహన కల్పించినట్లు ప్రకటించింది. తీరా చూస్తే కేవలం ఆ చెఫ్‌లతో వీడియోలు చేయించి, వాటిని ఆ కార్మికులకు చూపించి.. అదే అవగాహన కార్యక్రమం అని పాఠశాల విద్యాశాఖ చెప్పడం కొసమెరుపు! పైగా దీనికోసం తిరుపతిలో ప్రత్యేకంగా ఒక కార్యక్రమం నిర్వహించింది. ఇక, జగన్ సొంత మీడియాలో ఇకపై తాజ్ రుచులంటూ ఊదరగొట్టింది. కానీ ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం ఎంత ఇస్తున్నారనే విషయాన్ని మాత్రం దాచిపెట్టింది!

రూ.పది ఇవ్వరు.. ఫైవ్‌స్టార్ భోజనమట!

మధ్యాహ్న భోజనంపై వైసీపీ కలరింగ్.. వంటచేసే వారికి స్టార్ హోటల్ చెఫ్‌ల వీడియోలు

» అవి చూడగానే స్టార్ రుచులు వస్తాయట

» ఆ హోటళ్లలో భోజనం ఖరీదు వేలల్లో

» విద్యార్థులకు ఇచ్చేది మాత్రం రూ.8.57, రూ.5.88లే..

» ఈ మొత్తం పెంచాలని ఎండీఎం కార్మికుల గగ్గోలు

» రేట్లు పెంచకుండా స్టార్ కబుర్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మధ్యాహ్న భోజన పథకం విషయంలో జగన్ సర్కారుది ఆది నుంచీ ఆర్భాటమే! రోజురోజుకూ కొత్త రుచులు అంటూ సాక్షాత్తూ సీఎం జగన్మోహన్‌రెడ్డే ప్రత్యేక మెనూ ప్రకటించినా క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నది కేవలం అన్నం పప్పుచారే అన్నది సుస్పష్టం. గుడ్లు వండి పెడుతున్నా కొన్ని పాఠశాలల్లో అదీ లేదు. వాస్తవానికి ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రూ.8.57, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రూ.5.88 చొప్పున మెనూ ఖర్చు ఇస్తున్నారు. మధ్యాహ్న భోజనం వండే వంట కార్మికులకు ఈ మేరకు చెల్లిస్తున్నారు. దాంతోనే రోజూ విద్యార్థులకు భోజనం పెడుతున్నారు. ఇంత తక్కువ మొత్తంతో భోజనం పెడితే అది ఏ స్థాయిలో ఉంటుందో అర్థంచేసుకోవచ్చు. ఇందులో బియ్యం, గుడ్లు మినహా అన్నీ వంట కార్మికులే సమకూర్చుకోవాలి. భోజనానికి ఇది సరిపోవడం లేదని ఇచ్చే మొత్తం పెంచాలని కార్మికులు గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదు. గ్యాస్ సిలిండర్లపై అయినా రాయితీ ఇప్పించాలని కోరినా పట్టించుకోలేదు. కూరగాయలు, వంటనూనె, ఇతరత్రా వంట సరుకుల రేట్లు పెరిగాయని, ఈ రేటుకు భోజనం చేయడం సాధ్యం కావట్లేదని కార్మికులు కోరుతున్నారు. ఇవేమీ పట్టించుకోని ప్రభుత్వం ఇప్పుడు స్టార్ హోటల్ రుచులు అంటూ హడావిడి చేస్తోంది. అంతే తప్ప భోజనానికి ఎంత పెంచుతారు అనే విషయంపై స్పందించడం లేదు.

●ఇంటి నుంచే భోజనం

ప్రభుత్వ పాఠశాలల్లో 36లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో కొద్ది మంది మాత్రమే మధ్యాహ్న భోజనం తినడం లేదని పాఠశాల విద్యాశాఖ చెబుతోంది. కానీ 25లక్షల మంది కూడా ప్రభుత్వం పెడుతోన్న భోజనం చేయట్లేదు. చాలా మంది విద్యార్థులు ఇంటినుంచే భోజనం తెచ్చుకుంటున్నారు. అయితే గుడ్డు లాంటివి విద్యార్థులు తీసుకుంటే మొత్తం భోజనం చేసినట్లుగా అధికారులు లెక్కలేస్తున్నారు. సత్యసాయి ట్రస్టు సహకారంతో ఇచ్చే రాగి జావ కార్యక్రమం కూడా అస్తవ్యస్తంగా మారింది. చాలాచోట్ల నిల్వ పిండి కారణంగా రుచించక జావ తాగేందుకు పిల్లలు ఇష్టపడట్లేదు. భోజనం నాసిరకంగా ఉండటంతో కేవలం గుడ్లు, చిక్కీలు తప్ప విద్యార్థులు మిగిలిన భోజనం తినేందుకు ఆసక్తి చూపట్లేదు.

●చిక్కీల్లోనూ కమీషన్లు

ఈ ప్రభుత్వంలో విద్యార్థులకు కొత్తగా చిక్కీలు ఇవ్వడం ప్రారంభించారు. అయితే చిక్కీల పంపిణీ కాంట్రాక్టర్లపై వైసీపీ నాయకులు, కొందరు మంత్రులు విపరీతమైన ప్రేమ చూపిస్తున్నారు. 2022తో ముగిసిన చిక్కీ సరఫరా కాంట్రాక్టును ఎలాంటి టెండరు లేకుండా పొడిగించారు. దాంతో అడ్డగోలుగా వ్యవహరించిన చిక్కీల కాంట్రాక్టర్లు కాలం చెల్లిన(తేదీ ముగిసిన) చిక్కీలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఇది తనిఖీల్లో బయటపడినా కాంట్రాక్టర్లపై ఎలాంటి చర్యలూ లేవంటే ప్రభుత్వ పెద్దలకు ఏ స్థాయిలో కమీషన్లు అందుతున్నాయో అర్థంచేసుకోవచ్చు. ఇలా ప్రతి దాంట్లో కమీషన్లకు కక్కుర్తి పడుతున్న ప్రభుత్వ పెద్దలు భోజనం పథకాన్ని అస్తవ్యస్తం చేశారు. గతంలో ప్రతిరోజూ ఎంత మంది విద్యార్థులు బడుల్లో తింటున్నారనే లెక్కలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచగా, కొంతకాలంగా వాటిని తొలగించారు. అవి అందుబాటులో ఉంటే అసలు లెక్కలు బయటికొస్తాయని, పిల్లలు భోజనం తినట్లేదనే విషయం బయటపడుతుందని తొలగించేశారు!

శ్రీశైలంలో సరిహద్దుల పోరు

- దేవస్థానం, అటవీశాఖల మధ్య భూ వివాదం
- తాజాగా పనులు చేపట్టిన అటవీశాఖ
- అడ్డుకున్న ఆలయ అధికారులు


శ్రీశైలంలోని టోల్‌గేట్ వద్ద సరిహద్దులు వేసిన అటవీశాఖ అధికారులు


దేవస్థానం, అటవీశాఖ అధికారుల మధ్య వాగ్వాదం

శ్రీశైలం, జూన్ 1: శ్రీశైలం మహాక్షేత్రంలో దేవస్థానం, అటవీశాఖ భూముల మధ్య సరిహద్దుల వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. రెండు రోజుల నుంచి దేవస్థానం పరిధిలో సరిహద్దుల విషయంలో అటవీ శాఖ అధికారులు దూకుడుగా వ్యవహరిస్తున్నారు. శని వారం క్షేత్రంలోని టోల్‌గేట్, పాతాళగంగ మార్గంలోని డార్మిటరీల వద్ద గుంతలు తీసి సరిహద్దు స్థూపాలను ఏర్పాటు చేశారు. మరికొన్ని ప్రదేశాల్లో కూడా సరిహద్దు స్థూపాలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నించారు. సమాచారం తెలుసుకున్న శ్రీశైలం దేవస్థానం అధికారులు టోల్‌గేట్ వద్దకు చేరుకుని అటవీశాఖ అధికారి రేంజర్ నరసింహులుతో మాట్లాడారు. కొన్నేళ్ల నుంచి దేవస్థానం అభివృద్ధి చేసిన రహదారులు, భక్తుల వసతి సముదాయాల వద్ద సరిహద్దు స్థూపాలను ఏర్పాటు చేయడం సరికాదన్నారు. వెంటనే దేవస్థానం అధికారులు యంత్రాలతో గుంతలను పూడ్చివేయించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. సమాచారం అందుకున్న సీఐ ప్రసాదరావు... దేవస్థానం, అటవీశాఖ అధికారులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి చర్చలు జరిపారు. ఇరువర్గాలు ప్రభుత్వ శాఖలు కావడంతో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. గత ఏడాది దేవస్థానం, అటవీశాఖ, రెవెన్యూ సర్వే డిపార్ట్‌మెంట్ కలిసి చేపట్టిన సర్వేలో దేవస్థానం, అటవీశాఖ భూముల సరిహద్దులను గుర్తించారు. మల్లన్న భూముల రీ సర్వే కోసం ముగ్గురు మంత్రులు కమిటీగా ఏర్పడి సర్వేను పూర్తి చేయించారు. అయితే సర్వే జరగక ముందే దేవస్థానం భక్తుల కోసం చేపట్టిన అభివృద్ధి నిర్మాణాలు ఇప్పుడు అటవీశాఖ పరిధిలోకి వెళ్లాయి. అక్కడ ఇప్పుడు సరిహద్దు స్థూపాలు ఏర్పాటు చేయడం దేవస్థానం అధికారులకు ఆందోళన కలిగిస్తోంది.



ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, జస్టిస్ ఏవీ శేషసాయి

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, జూన్1(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, జస్టిస్ ఏవీ శేషసాయి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన వీరు ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం వీరు రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వదించారు. అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. జస్టిస్ శేషసాయి ఆదివారం పదవీవిరమణ చేయనున్న నేపథ్యంలో ఆయన శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం మరోసారి వందకోట్లు పైనే

- మేలో రూ.107.95 కోట్లు

తిరుమల, జూన్1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం మరోసారి వంద కోట్ల మార్క్ దాటింది. గడిచిన మే నెలలో స్వామికి హుండీ కానుకల రూపేణా రూ.107.95 కోట్లు లభించాయి. దీంతో కొవిడ్ అనంతరం వరుసగా 27వ నెల కూడా హుండీ ఆదాయం రూ.వంద కోట్లు దాటడం గమనార్హం. ఏప్రిల్‌లో 20.17 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా హుండీ ఆదాయం రూ.101.63 కోట్లు లభించింది. మే నెలలో 23.27 లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారు.

జాలాది సతీమణి కన్నుమూత


జాలాది ఆఘ్నేశమ్మ

డాబాగార్డెన్స్ (విశాఖపట్నం), జూన్ 1: సినీ గేయ రచయిత, కళాప్రపూర్ణ డా.జాలాది రాజారావు సతీమణి ఆఘ్నేశమ్మ (82) అనారోగ్యంతో ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శనివారం సాయంత్రం కన్నుమూశారు. ఆమె ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. వీరికి ఓ కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. జాలాదిగా పేరుగాంచిన జాలాది రాజారావు 275 సినిమాల్లో 1500కు పైగా పాటలను రాశారు. గేయ రచయితగా ఆయన ప్రయాణంలో ఆఘ్నేశమ్మ ప్రముఖ పాత్ర పోషించారు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు మర్రిపాలెం పీఎఫ్ ఆఫీస్ వద్ద ఉన్న ప్రశాంతినగర్‌లో వారి స్వగృహం నుంచి అంతిమయాత్ర బయలుదేరుతుందని, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దనున్న క్రైస్తవ శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరపనున్నట్టు ఆమె కుమారుడు శ్రీనివాసరావు, కుమార్తె విజయ తెలిపారు. ఆమె మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, అభిమానులు సంతాపం తెలిపారు. జాలాది రాజారావు 2011లో కన్నుమూశారు.

ఇండియా కూటమి పీఠమెక్కడం ఖాయం: సీపీఐ

అమరావతి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పదేళ్లు పూర్తయినా రాష్ట్ర విభజన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం విచారకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం విజయవాడలోని దాసరి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్ర మోదీ ఎన్ని డ్రామాలాడినా మళ్లీ ప్రధాని కాలేరని, జూన్ 4న వెలువడే ఎన్నికల ఫలితాలతో దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి రావడం తథ్యమని, ఏపీకి ప్రత్యేక హోదా ఇండియా కూటమితోనే సాధ్యమని రామకృష్ణ అన్నారు.

విషవాయువు పీల్చి 35మంది కార్మికులకు అస్వస్థత

రేణిగుంట, జూన్ 1 : విషవాయువులు పీల్చి 35మంది కార్మికులు అస్వస్థతకు గురైన సంఘటన తిరుపతి జిల్లాలో శనివారం చోటు చేసుకుంది. ఏర్పేడు మండలం చింతలపాళెం టోల్‌ప్లాజా- రాజులపాళెం మధ్య సీఎంఆర్ ఏకో అల్యూమినియం కర్మాగారాన్ని త్వరలో ప్రారంభించేందుకు యంత్రాల పనితీరుపై వారం రోజులుగా ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం మధ్యాహ్నం కర్మాగారంలో అల్యూమినియం ముక్కలను కరిగించే యంత్రంలో మంట అధికంగా మండించేందుకు ప్లాస్టిక్ ఖాళీ డబ్బాలను ఉపయోగించారు. వరిపైరుకు వాడే మోనోక్రోటోఫాస్ పురుగుమందు డబ్బా నిప్పుల్లో వేయడంతో అది పగిలి అందులో ఉన్న రసాయనాలు అక్కడ పనిచేస్తున్న కార్మికులపై పడ్డాయి. నిమిషాల వ్యవధిలో రసాయనాల వాసన చుట్టూ వ్యాపించడంతో విధుల్లో ఉన్న కార్మికుల్లో కొంతమంది కళ్లు తిరిగి పడిపోగా మరికొంతమంది అస్వస్థతకు గురయ్యారు. వారందరినీ సమీపంలోని బాలాజీ ఆస్పత్రికి తరలించారు. కోలుకున్న అనంతరం ఇళ్లకు పంపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

■ ఆర్కే RK



కొత్తపలుకు

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి


ఫలితాలొస్తున్నాయి... పారాహుషార్!

ఓట్ల లెక్కింపునకు సమయం సమీపిస్తున్న కొద్దీ ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో టెన్షన్ పెరిగిపోతోంది. ప్రధాన రాజకీయ పార్టీల తరఫున పోస్టులు పెడుతూ వీడియోలు చేస్తూ వదులుతున్న వారి హడావుడి కూడా పెరిగిపోతోంది. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు కూడా వెలువడ్డాయి. ఎగ్జాక్ట్ పోల్స్ ఫలితాలు వెల్లడి కావాల్సి ఉంది. అంచనాలు, అభిప్రాయాల విషయం ఎలా ఉన్నా కౌంటింగ్ రోజున, ఆ తర్వాత రాష్ట్రంలో పరిస్థితులు ఎలా ఉండబోతున్నాయన్నది కీలకంగా మారింది. రాష్ట్రంలో రాజకీయ వైషమ్యాలు ప్రజల మెదళ్లలోకి చొరబడ్డాయి. దీనికితోడు గత ఐదేళ్లుగా ప్రధాన రాజకీయ పార్టీల మద్దతుదారుల మధ్య దాడులు, ప్రతిదాడులు జరగడంతోపాటు ప్రభుత్వపరంగా కక్ష సాధింపు చర్యలు పరాకాష్ఠకు చేరడంతో ఎన్నికల ఫలితాలను బట్టి గొడవలు జరిగే అవకాశం కూడా కనిపిస్తోంది. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపు తప్పకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పైనే కాదు.. రాష్ట్ర పోలీసులపై కూడా ఉంది. లోక్‌సభకు కూడా ఎన్నికలు జరిగినప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రజలు మాత్రం శాసనసభ ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయన్న ఉత్సుకతతో ఉన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. అధికారంలో ఉన్న వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే పరిస్థితి ఎలా ఉండబోతున్నది? కూటమి అధికారంలోకి వస్తే పరిస్థితి ఏమిటి? అంటే ఫలితాలు ఎలా ఉన్నప్పటికీ గొడవలు జరిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి జగన్ అనుకూల, వ్యతిరేక వర్గాలుగా సమాజం విడిపోయింది. పోలింగ్‌కు, కౌంటింగ్‌కు మధ్య 20 రోజుల వ్యవధి ఉండటం వల్ల ఆయా పార్టీల మద్దతుదారులు, ప్రజల మెదళ్లను విషతుల్యం చేశారు. విశ్లేషణలు, వ్యాఖ్యల పేరిట ప్రజలను విడదీసి రెచ్చగొట్టే ప్రయత్నాలు జరిగాయి. దీని ఫలితం ఓట్ల లెక్కింపు తర్వాత కనిపించే ప్రమాదం ఉంది. నాలుగో తేదీ తర్వాత కూటమికి మద్దతుగా నిలబడిన వారికి దబిడి దిబిడే అని వైసీపీ అనుకూలురు హెచ్చరికలు చేయగా.. ఫలితాలు తమకు అనుకూలంగా వస్తే ఈ ఐదేళ్లు తమపై సాగిన వేధింపులకు ప్రతీకారం తీర్చుకోవాలని కూటమి మద్దతుదారులు భావిస్తున్నారు. దీన్నిబట్టి ఫలితాలు ఎలా ఉన్నా శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే ప్రస్తుతం ప్రజల్లో నెలకొన్న వైషమ్యాల స్థానంలో కక్షలు, కార్పణ్యాలు ప్రవేశిస్తాయి. రాష్ట్రం మొత్తం ఫ్యాక్షన్ జోన్‌గా మారిపోయే ప్రమాదం ఉంది. ఇది ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌కు మంచిది కాదు. జగన్మోహన్ రెడ్డి, చంద్రబాబుకు మద్దతు ఇస్తున్నవారు తమకు మంచి జరుగుతుందన్న ఉద్దేశంతో వారికి అండగా ఉన్నారు. అలాంటప్పుడు ఎవరు గెలిచినా మంచే జరగాలి కానీ గొడవలు జరగడం వాంఛనీయం కాదు. రాజకీయ పార్టీల మద్దతుదారుల్లో ఆవేశకావేశాలు ఉన్నందున వారిని అదుపు చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. ప్రభుత్వ యంత్రాంగం బాధ్యతతో మెలిగేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎలక్షన్ కమిషన్‌పై ఉంది. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ఎన్నికల కమిషన్‌గానీ, పోలీసులుగానీ ఆషామాషీగా తీసుకోకూడదు.

> హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అన్న విషయం ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా మర్చిపోయారు. మరోవైపు తెలంగాణ రాష్ట్రం దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకొంటోంది. విడిపోయి లాభపడిన రాష్ట్రంగా తెలంగాణ నిలబడింది. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి తొమ్మిదిన్నర ఏళ్లు అధికారంలో కొనసాగిన కేసీఆర్ ఆరు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో అధికారం కోల్పోయారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో కీలకపాత్ర పోషించిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఈ ఆరు నెలల రేవంత్‌రెడ్డి పాలనపై పెదవి విరవడానికి పెద్దగా ఏమీలేదు. అయితే, రైతాంగ సమస్యలపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. సాగునీటి కొరతతోపాటు విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. వర్షాభావం, ఆర్థిక సమస్యలు ఈ పరిస్థితికి కారణం కావొచ్చుగానీ.. ప్రజలు ప్రభుత్వాన్నే తప్పుబడతారు.

మారిన పరిస్థితులు...

చట్టం తన పని తాను చేయాలి. కానీ, రాష్ట్రంలో ఆ పరిస్థితులు లేకుండా చేశారు. తాము ప్రజలకు జవాబుదారీ అన్న స్పృహ పోలీసుల్లో లేకుండా పోయింది. ఉన్నతాధికారులు పాలకుల పాదాల వద్ద మోకరిల్లుతున్నారు. ఈ కారణంగా ఎన్నికల కమిషన్ రాష్ట్రంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఐదేళ్లుగా ఇష్టారాజ్యంగా వ్యవహరించిన అధికార పార్టీకి ఎన్నికల కమిషన్ తాజాగా తీసుకున్న నిర్ణయాలు రుచించడం లేదు. ఈ కారణంగానే ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగా పనిచేస్తున్న అధికారులను జగన్‌రెడ్డి రోత మీడియా టార్గెట్ చేసుకుంది. నిన్నటి వరకు విధి నిర్వహణలో పక్షపాతంగా వ్యవహరించిన అధికారులను తప్పుబట్టినప్పుడు ఇదే రోత మీడియా గుండెలు బాదుకుంది. అధికారులను నిందించడం తగదని సుద్దులు చెప్పే దుస్సాహసానికి పాల్పడ్డారు. ఇప్పుడు ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించడమే మహా పాపం అంటున్నారు. నిన్నటి వరకు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ప్రతిపక్షాల తరఫున ఎవరు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకునేవారు కాదు. ఇప్పుడు ముఖ్యమంత్రికి కళ్లు, చెవులుగా వ్యవహరించిన సజ్జల రామకృష్ణారెడ్డిపై కూడా కేసు నమోదు చేశారు. ఫిర్యాదుల్లో వాస్తవం ఉందా? లేదా? అన్నది తర్వాత తేలుతుంది. ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేసుకునే పరిస్థితులు ఇప్పటివరకూ లేకుండా పోయాయి. రూల్ ఆఫ్ లా అమలులో ఉండటానికి, ఉండకపోవడానికి తేడా ఇదే! కౌంటింగ్ సందర్భంగా గొడవలకు దిగడానికి కూడా వెనుకాడని వాళ్లు మాత్రమే తమకు ఏజెంట్లుగా ఉండాలని సజ్జల చెప్పడాన్ని బట్టి ఆ రోజు పరిస్థితి ఎలా ఉండబోతున్నదో అధికార యంత్రాంగం అంచనా వేసుకోవచ్చు. కయ్యానికి కాలు దువ్వడానికి సిద్ధంగా ఉండాలని సజ్జల వంటి వారు స్వయంగా పిలుపు ఇవ్వడం వల్ల శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఐదేళ్లుగా అణచివేతకు గురైన తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు.. నాయకులు కూడా అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రతీకార దాడులకు పాల్పడే అవకాశం ఉంది. జగన్మోహన్ రెడ్డికి అనుకూలంగా ఫలితాలు వస్తే కౌంటింగ్ కేంద్రం లోపల, బయట గొడవలు జరగవచ్చు. కూటమికి అనుకూలంగా ఫలితాలు వస్తే ధర్మాగ్రహం పేరిట కూటమి మద్దతుదారులు ప్రతీకారదాడులకు దిగవచ్చు. ముఖ్యమంత్రి జగన్‌కు మద్దతుదారులుగా ఉంటున్న వారిలో కొందరు ఉన్మాదులుగా మారారు. "ఎవరైనా జగన్‌రెడ్డి కక్ష్యలోకి వచ్చి నాలుగైదు అడుగుల దూరంలో నిలబడి కళ్లలోకి కళ్లు పెట్టి చూస్తే జగనన్న కోసం వాడు చచ్చిపోతాడట. జగన్ ఇజ్ నాట్ ఎ మ్యాన్. బట్ ఈజ్ యాన్ ఎమోషన్. ఆయనను చూస్తే పిచ్చి పట్టేస్తుంది. అతనొక ఎమోషన్, అతనొక శక్తి" అని అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి లండన్‌లో చేసిన వ్యాఖ్యలు గమనార్హం. అదనపు అడ్వొకేట్ జనరల్ స్థాయిలో ఉన్న వ్యక్తి నోటి నుంచి ఇలాంటి మాటలు వచ్చాయంటే జగన్‌రెడ్డి మద్దతుదారుల మనస్తత్వం అర్థం చేసుకోవచ్చు. ఎన్నికల ఫలితాలు ప్రతికూలంగా వస్తే ఈ బాపతుగాళ్లు ఎలా వ్యవహరిస్తారో ఊహించుకోవచ్చు. తస్మాత్ జాగ్రత్త!



ప్రజాస్వామ్యంలో ధనస్వామ్యం...

ఈ విషయం అలా ఉంచితే, రాష్ట్రంలో ఎన్నికలు అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారిపోతున్నాయి. ప్రధాన పార్టీల తరఫున పోటీ చేసిన అభ్యర్థులు చెప్పినదాన్ని బట్టి ఈ ఎన్నికల్లో సగటున ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో అభ్యర్థి 50 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. కొన్ని నియోజకవర్గాల్లో 100 కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేశారు. శాసనసభ్యుడిగా ఎన్నిక కావడానికి 50 నుంచి 100 కోట్ల రూపాయలు ఖర్చు చేసి సాధించేది ఏమిటి? అంత ఖర్చు చేసి గెలిచిన అభ్యర్థుల నుంచి ప్రజాసేవను ఆశించడం అత్యాశే అవుతుంది. ప్రజలు కూడా పూర్తిగా మారిపోయారు. గతంలో బడుగు బలహీనవర్గాలకు చెందిన వారికే డబ్బు పంచేవారు. ఈ ఎన్నికల్లో అగ్రవర్ణాల వారితోపాటు భూస్వాములు, ధనికులు కూడా అడిగి మరీ డబ్బు తీసుకున్నారట! ఆర్థికంగా ఉన్నతస్థితిలో ఉన్నవారు ఎన్నికల్లో డబ్బు తీసుకోవడాన్ని నామోషీగా భావించేవారు. ఇప్పుడు వారు కూడా అది తమ హక్కుగా భావిస్తున్నారట! ఒక నియోజకవర్గంలో రెండున్నర లక్షల మంది ఓటర్లు ఉంటే అందులో సగం మందికి మాత్రమే గతంలో డబ్బు పంచేవారు. ఈ ఎన్నికల్లో మాత్రం మెజారిటీ నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లందరికీ డబ్బులు పంచారు. కొన్ని నియోజకవర్గాల్లో పంపకాలకే 60 కోట్ల రూపాయలకుపైగా ఖర్చయ్యిందని అభ్యర్థులు లబోదిబోమంటున్నారు. పెద్ద పెద్ద భవనాల్లో నివసిస్తున్నవారు కూడా పక్క వారికి ఎక్కువ ఇచ్చి తమకు తక్కువ ఇచ్చారేంటి? అని నిలదీస్తున్నారట. ఈ లెక్కన వచ్చే ఎన్నికల నాటికి ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో అభ్యర్థి 100 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. అంటే రెండు ప్రధాన పక్షాలు బరిలో ఉంటే.. 175 నియోజకవర్గాల్లో మొత్తం 30 వేల కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇంత భారీ మొత్తంలో ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి రాజకీయ పార్టీలకు కూడా శిరోభారం అవుతుంది. ప్రస్తుతం రాజకీయ పార్టీలు పులి మీద స్వారీ చేస్తున్నాయి. ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని అరికట్టే స్థితిలో ఎన్నికల కమిషన్ లేదు. పోలీసులతోపాటు పోలింగ్ సిబ్బందికి కూడా ప్రధాన రాజకీయపార్టీల అభ్యర్థులు లంచాలు ఇచ్చుకోవాల్సిన దుస్థితి. ఈ నేపథ్యంలో ప్రజలకు సేవ చేయాలన్న చిత్తశుద్ధిగలవారు ఎన్నికల్లో పోటీ చేయడం సాధ్యమా? శాసనసభ్యులు దోపిడీకి తెరలేపారని నిందించే హక్కు ప్రజలకు ఉంటుందా? ఓటు వేయడానికి చేయిచాస్తున్న వారికి ప్రశ్నించే హక్కుగానీ, నిలదీసే అర్హతగానీ ఉంటుందా? వేలకోట్లు ఖర్చుచేసి అధికారంలోకి వచ్చే పార్టీలు నిప్పులా ఉండాలని ఆశించడం తప్పుకాదా? ఏ రాజకీయ పార్టీ అధినేత కూడా తమ సొంత ఆస్తులు కరిగించి ఖర్చు చేయరుగదా? వ్యాపారులు, పారిశ్రామికవేత్తల నుంచి విరాళాలు సేకరిస్తారు. అందుకు బదులుగా అధికారంలోకి వచ్చాక వారికి మేళ్లు చేయాలి. ఇదొక విష వలయం! ఓటర్లకు వేలల్లో దక్కుతుండగా విరాళాలు ముట్టజెప్పేవారితోపాటు కొంతమంది నాయకుల చేతుల్లోకి సంపద పోతుంది. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ నేతలకు ఇదొక పెట్టుబడి. ఎన్నికల్లో పెట్టుబడి పెట్టి అధికారంలోకి వచ్చాక లాభాల పంట పండించుకుంటారు. ప్రజలకు ఎన్నికలప్పుడు ఎంతో కొంత డబ్బు ముడుతోంది. తిలా పాపం తలా పిడికెడు! ఈ వ్యవస్థను మార్చుకోవాల్సిన అవసరం ఉందా? లేదా? అన్నది సమాజమే ఆలోచించుకోవాలి. ఎన్నికల ఖర్చు వేల కోట్ల నుంచి లక్షల కోట్లకు చేరడానికి ఎంతోకాలం పట్టకపోవచ్చు. మనదేశంలో ఎన్నికల ఖర్చు అగ్రరాజ్యం అమెరికాలో ఎన్నికల ఖర్చును ఇప్పటికే అధిగమించింది. డబ్బు పంచనిదే ఓటు వేయడానికి వచ్చేది లేదు అనేస్థాయికి ప్రజలు వచ్చేశారు. వారిని ఆ స్థాయికి దిగజార్చారు. పోలింగ్‌ను సజావుగా జరిపించేందుకు పోలీసులు, పోలింగ్ అధికారులకు కూడా లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి తెచ్చుకున్నది కూడా రాజకీయ పార్టీలే! ఈ విష వలయం నుంచి దేశం బయటపడని పక్షంలో అభివృద్ధి అనేది నినాదాలకే పరిమితం అవుతుంది. సంపన్నులు మరింత సంపన్నులు అవుతారు. వారు చెల్లించే పన్నులతో ప్రజలకు తాయిలాలు పంచుతూ రాజకీయ నాయకులు అపర దానకర్ణులుగా బిల్డప్ ఇచ్చుకుంటారు. మన ప్రజాస్వామ్యం మేడిపండులా మారిపోవడం విషాదం. పెరుగుట విరుగుట కొరకే అని అంటారు. ఈ విషాదం నుంచి దేశం ఏదో ఒక రోజు బయటపడుతుందని, బయట పడాలని కోరుకుందాం!

> ప్రభుత్వపరంగా కక్షసాధింపు చర్యలు పరాకాష్ఠకు చేరడంతో ఎన్నికల ఫలితాలను బట్టి గొడవలు జరిగే అవకాశం కూడా కనిపిస్తోంది. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపు తప్పకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పైనే కాదు.. రాష్ట్ర పోలీసులపై కూడా ఉంది.

> ఎన్నికలు అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారిపోతున్నాయి. ప్రధాన పార్టీల తరఫున పోటీ చేసిన అభ్యర్థులు చెప్పినదాన్ని బట్టి ఈ ఎన్నికల్లో సగటున ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో అభ్యర్థి 50 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. కొన్ని నియోజకవర్గాల్లో 100 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేశారు. శాసనసభ్యుడిగా ఎన్నిక కావడానికి 50 నుంచి 100 కోట్ల రూపాయలు ఖర్చు చేసి సాధించేది ఏమిటి? గతంలో బడుగు బలహీనవర్గాలకు చెందిన వారికే డబ్బు పంచేవారు. ఈ ఎన్నికల్లో అగ్రవర్ణాలవారితోపాటు భూస్వాములు, ధనికులు కూడా అడిగి మరీ డబ్బు తీసుకున్నారట! ఆర్థికంగా ఉన్నతస్థితిలో ఉన్నవారు ఎన్నికల్లో డబ్బు తీసుకోవడాన్ని నామోషీగా భావించేవారు. ఇప్పుడు వారు కూడా అది తమ హక్కుగా భావిస్తున్నారట! ఒక నియోజకవర్గంలో రెండున్నర లక్షల మంది ఓటర్లు ఉంటే అందులో సగం మందికి మాత్రమే గతంలో డబ్బు పంచేవారు. ఈ ఎన్నికల్లో మాత్రం మెజారిటీ నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లందరికీ డబ్బులు పంచారు. కొన్ని నియోజకవర్గాల్లో పంపకాలకే 60 కోట్ల రూపాయలకుపైగా ఖర్చయ్యిందని అభ్యర్థులు లబోదిబోమంటున్నారు. పెద్ద పెద్ద భవనాల్లో నివసిస్తున్నవారు కూడా పక్క వారికి ఎక్కువ ఇచ్చి తమకు తక్కువ ఇచ్చారేంటి? అని నిలదీస్తున్నారట. ఈ లెక్కన వచ్చే ఎన్నికల నాటికి ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో అభ్యర్థి 100 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి దాపురిస్తుంది.

పదేళ్ల 'తెలంగాణ'

ఇప్పుడు తెలంగాణ రాజకీయాలకు వద్దాం. పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ ఇవాళ్టి నుంచి తెలంగాణ సొంతం. రాష్ట్రం విడిపోయి అప్పుడే పదేళ్లు అయ్యింది. ఈ పదేళ్లలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌ను సొంతం చేసుకోగా.. ప్రకటించుకున్న రాజధానిని కూడా కాదనుకొని ఆంధ్రప్రదేశ్ రాజధాని లేని రాష్ట్రంగా మిగిలింది. హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అన్న విషయం ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా మర్చిపోయారు. మరోవైపు తెలంగాణ రాష్ట్రం దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకొంటోంది. విడిపోయి లాభపడిన రాష్ట్రంగా తెలంగాణ నిలబడింది. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి తొమ్మిదిన్నర ఏళ్లు అధికారంలో కొనసాగిన కేసీఆర్ ఆరు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో అధికారం కోల్పోయారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో కీలకపాత్ర పోషించిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఈ ఆరు నెలల రేవంత్‌రెడ్డి పాలనపై పెదవి విరవడానికి పెద్దగా ఏమీలేదు. అయితే, రైతాంగ సమస్యలపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. సాగునీటి కొరతతోపాటు విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. వర్షాభావం, ఆర్థిక సమస్యలు ఈ పరిస్థితికి కారణం కావొచ్చుగానీ.. ప్రజలు ప్రభుత్వాన్నే తప్పుబడతారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పోల్చితే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాస్వామ్యబద్ధంగానే వ్యవహరిస్తున్నారు. మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. అదే సమయంలో కొన్ని అవాంఛనీయమైన అంశాలు తాజాగా తెరమీదకు రావడం ఆశ్చర్యంగా ఉంది. ఇందులో రాష్ట్ర గీతంలో మార్పులు చేయాలనుకోవడం మొదటిది. అందెశ్రీ రచించిన గీతానికి ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి స్వరకల్పన చేయడాన్ని భారత రాష్ట్ర సమితి తప్పుబడుతోంది. ఇందులో హేతుబద్ధత లేదు. కళలకు కులం, మతం, ప్రాంతం అంటూ ఎల్లలు ఉండవు. సంగీతానికి అసలు ఏ హద్దులూ ఉండవు. అయినా రాష్ట్ర గీతానికి స్వరకల్పన చేయడానికి తెలంగాణకు చెందిన సంగీత దర్శకులే లభించలేదా? ఆంధ్రకు చెందిన కీరవాణి అవసరం ఏమిటి? అని ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్‌లాంటి నాయకులు నిలదీయడం ఎబ్బెట్టుగా ఉంది. నిజానికి కీరవాణి ఆంధ్రవాడు కూడా అని చెప్పలేం. హైదరాబాద్‌లో స్థిరపడటానికి ముందు ఆయన చెన్నైలో ఉండేవారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అనేక సందర్భాల్లో ఆంధ్రవారినే ఎంచుకున్నారు. కాళేశ్వరం నిర్మించిన ప్రధాన సంస్థ ఆంధ్రా వాళ్లది కాదా? యాదాద్రికి రూపకల్పన చేసిన ఆనంద్‌సాయి ఆంధ్రావాడు కాదా? చినజీయర్ స్వామి ఎవరు? రాజశ్యామల యాగం జరిపించిన స్వరూపానంద ఎవరు? కల్వకుంట్ల కవిత రూపొందించిన బతుకమ్మ పాటకు తమిళుడైన ఏఆర్ రెహ్మాన్ స్వరకల్పన చేయలేదా? అంటూ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్‌ను ఉద్దేశించి నెటిజన్స్ ఆడుకున్నారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన భారత రాష్ట్ర సమితి మళ్లీ పూర్వ వైభవం సాధించేందుకు తెలంగాణవాదాన్ని ఎత్తుకోబోతున్నదని దీన్నిబట్టి అర్థం అవుతోంది. రాష్ట్రం ఏర్పడి దశాబ్ది ఉత్సవాలు జరుపుకొంటున్న వేళ తెలంగాణ సెంటిమెంట్‌ను రాజేయాలనుకుంటున్నప్పటికీ ఫలితం ఉంటుందా? తెలంగాణవాదం ఇప్పుడు కేసీఆర్ గడీలో బందీగా లేదు. ఉమ్మడి రాష్ట్ర స్మృతులు మెదళ్ల నుంచి నిష్క్రమించాయి. అయినా కీరవాణిని అడ్డు బెట్టుకొని రాజకీయ లబ్ధి పొందాలని కేసీఆర్ అండ్ కో వృథా ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్‌గా రకుల్ ప్రీత్‌సింగ్‌ను ఆనాడు ఏ ప్రాతిపదికన నియమించారో వారు చెప్పగలరా? సెంటిమెంట్‌ను రగిలించాలనుకుని అవతలి వారి వైపు వేలెత్తిచూపే ప్రయత్నం చేస్తే కేసీఆర్‌వైపు నాలుగువేళ్లు కనిపిస్తాయి. కేంద్రంలో భారతీయ జనతాపార్టీ తీసుకువచ్చిన ఎన్ఆర్‌సీ (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్)ని తాము వ్యతిరేకిస్తున్నట్లుగా కేసీఆర్ అప్పట్లో చెప్పారు. ఇప్పుడు రాజకీయంగా మనుగడ సాగించడం కోసం టీఆర్‌ఎస్‌ని తీసుకురావాలని కోరుతారా? ఇప్పుడు తెలంగాణలో నివసిస్తున్న వాళ్లందరూ తెలంగాణ వాళ్లే! ప్రవీణ్‌కుమార్ లేదా మరొకరు వేలెత్తిచూపినంత మాత్రాన తెలంగాణ సెంటిమెంట్ పండదు. దొరల దురహంకారం తగదనే గత ఎన్నికల్లో కేసీఆర్‌ను ప్రజలు ఓడించారు. తలెత్తుకొని గర్వించే తెలంగాణ కావాలన్నదే ప్రజల వాంఛ.

అవసరం లేని 'మార్పులు'

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరో అవాంఛనీయమైన అంశాన్ని చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వ చిహ్నంలో మార్పులు చేయాలని రేవంత్‌రెడ్డి ఎందుకు భావిస్తున్నారో తెలియదు. కొద్దిమంది మినహా ప్రజలెవరూ ఈ మార్పు కోరుకోవడం లేదు. గత ఎన్నికల్లో ఈ అంశం చర్చకు కూడా రాలేదు. గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించడం వేరు – తిరగదోడటం వేరు. ప్రభుత్వ చిహ్నం వంటివి మార్చాలనుకోవడం వల్ల ప్రజలకు ప్రయోజనం కలగకపోగా ప్రభుత్వాలకు చికాకులు ఎదురవుతాయి. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొన్ని మార్పులు చేస్తే భవిష్యత్‌లో వచ్చే ప్రభుత్వం మరికొన్ని మార్పులు చేయవచ్చు. ఈ ధోరణివల్ల తెలంగాణ చిహ్నం ఎలా ఉంటుందో కూడా ప్రజలు గుర్తుపెట్టుకోలేని పరిస్థితి వస్తుంది. తెలంగాణ ప్రభుత్వ చిహ్నాన్ని మార్చేందుకు ప్రభుత్వ మార్పిడి జరగలేదు. ఈ చిహ్నాన్ని మార్చినంత మాత్రాన తెలంగాణ చరిత్ర నుంచి కేసీఆర్ పేరును తుడిచివేయలేరు. తెలంగాణ చరిత్రలో ఆయన స్థానం ఆయనకే ఉంటుంది. ప్రభుత్వం నుంచి ప్రజలు ఆశించేది వేరుగా ఉన్నప్పుడు ఇలాంటి అల్ప విషయాలకు ప్రాధాన్యం ఇస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికే ఇబ్బందులు ఎదురవుతాయి. ఇలాంటి చర్యలను ప్రజలు హర్షించరు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం ప్రజా వేదికను కూల్చడాన్ని, రాజధాని లేకుండా చేయడాన్ని ప్రజలు హర్షించలేదు. చిహ్నాలు మార్చడం వంటి చర్యల వల్ల గత ఎన్నికల్లో చతికిలబడిన భారత రాష్ట్ర సమితికి జవసత్వాలు కల్పించినవారు అవుతారు. ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే అవకాశం కోసం కేసీఆర్ సహజంగానే ఎదురుచూస్తారు. కేసీఆర్ ప్రభుత్వం రూపొందించిన చిహ్నంలో ఉన్న చార్మినార్‌ను మార్చాలనుకోవడం ఎందుకో తెలియదు. నిన్న మొన్నటివరకు హైదరాబాద్ చిహ్నంగా చార్మినార్‌నే చెప్పుకొన్నాం. రాష్ట్రానికి వచ్చిన అతిథులకు చార్మినార్ రూపంలో ఉన్న జ్ఞాపికలను ఇచ్చేవాళ్లం. ఈ నేపథ్యంలో అనవసర, అవాంఛనీయ అంశాలను కెలుక్కుని తనపై ప్రత్యర్థి రాజకీయ దాడి చేసేందుకు అస్త్రాలు సమకూర్చడమా? లేదా? అన్నది రేవంత్‌రెడ్డి తేల్చుకోవాలి. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వంపై స్వల్ప అసంతృప్తి నెలకొంటోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ విషయం గ్రహించి ప్రజల్లో అసంతృప్తి తలెత్తకుండా మొగ్గలోనే అరికట్టడానికి చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో ప్రజాభిమానం ప్రజాగ్రహంగా మారడానికి ఎంతో సమయం పట్టదు. కేసీఆర్‌కు ఎదురైన అనుభవం సజీవ సాక్ష్యంగా ఉండనే ఉంది!

> పోలింగ్‌కు, కౌంటింగ్‌కు మధ్య 20 రోజుల వ్యవధి ఉండటం వల్ల ఆయా పార్టీల మద్దతుదారులు ప్రజల మెదళ్లను విషతుల్యం చేశారు. విశ్లేషణలు, వ్యాఖ్యల పేరిట ప్రజలను విడదీసి రెచ్చగొట్టే ప్రయత్నాలు జరిగాయి. దీని ఫలితం ఓట్ల లెక్కింపు తర్వాత కనిపించే ప్రమాదం ఉంది. నాలుగో తేదీ తర్వాత కూటమికి మద్దతుగా నిలబడిన వారికి దబిడి దిబిడే అని వైసీపీ అనుకూలురు హెచ్చరికలు చేయగా.. ఫలితాలు తమకు అనుకూలంగా వస్తే ఈ ఐదేళ్లు తమపై సాగిన వేధింపులకు ప్రతీకారం తీర్చుకోవాలని కూటమి మద్దతుదారులు భావిస్తున్నారు. దీన్నిబట్టి ఫలితాలు ఎలా ఉన్నా శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే ప్రస్తుతం ప్రజల్లో నెలకొన్న వైషమ్యాల స్థానంలో కక్షలు, కార్పణ్యాలు ప్రవేశిస్తాయి. రాష్ట్రం మొత్తం ఫ్యాక్షన్ జోన్‌గా మారిపోయే ప్రమాదం ఉంది. ఇది ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌కు మంచిదికాదు.

జీవన వ్యవస్థగా మారుతున్న ఫాసిజం

ఇటీవలి కాలంలో ఫాసిజం అనే పదం అనేకమంది నోట తరచుగా వినవస్తోంది. బీజేపీ రెండోసారి కేంద్రంలో అధికారాన్ని చేపట్టిన తరువాత దీని గురించిన చర్చ అధికమైంది. నిరంకుశత్వం, అణచివేత, నిర్బంధం, హక్కులహననాన్ని ఫాసిజానికి పర్యాయపదాలుగా వాడుతుంటారు. అధికారపార్టీ సాగిస్తున్న నియంతృత్వపాలన ఫాసిజమేనని, ప్రభుత్వాధినేతను ఫాసిస్టు అని ప్రతిపక్షం కూడా ఆరోపించడం పరిపాటి అయింది. అయితే ఫాసిజమనే భావనను ఈ తరహా సాధారణ అవగాహనకు కుదించడం సరైందేనా? ఎందుకంటే రెండో ప్రపంచ యుద్ధంలో జర్మనీ, ఇటలీ, జపాన్ కూటమి సైనికంగా ఓడిన తరువాత మానవాళికి ఫాసిజమనే ప్రమాదం తప్పిందని చాలామంది భావించారు. కానీ అది వాస్తవం కాదని తర్వాతికాలంలో స్పష్టమైంది. ఫాసిస్టులు సైనికంగా ఓటమి చెందినప్పటికీ, అది ఒక ప్రగతినిరోధక భావజాలంగా అన్ని సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాలలో వ్యాప్తిచెందడం కనిపిస్తోంది. అభివృద్ధి చెందిన పశ్చిమదేశాలలోనే కాక ఆఫ్రికా లాంటి వెనుకబడిన దేశాలలో కూడా ఫాసిజం ఒక సార్వత్రిక దృగ్విషయంగా మారింది. ఇందుకు మనదేశం ఏ మాత్రం మినహాయింపు కాదు.

ఫాసిజం పోకడలను నిశితంగా పరిశీలిస్తే, సమాజపు నియమానుగత ప్రగతిని నిరోధించడానికి, అట్టడుగు పీడితప్రజల చైతన్యంతో సాగించే పోరాటాన్ని అడ్డుకోవడానికి తలెత్తిన ఒక రాజకీయ, ఆర్థిక, సైద్ధాంతిక, తాత్వికభావజాలంగా దాన్ని పరిగణించవచ్చు. 17, 18 శతాబ్దాలలో అప్పటి రాజరికపాలనను తొలగించి, ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థల ఆవిర్భావానికి నాయకత్వం వహించిన సామాజిక శక్తులు ఒకదశ వరకు సమాజానికి దిశానిర్దేశం చేశాయి. మార్క్సిస్టు పరిభాషలో వీరిని పాలక బూర్జువావర్గం అంటారు. అయితే వీరు కాలక్రమంలో మరొక రూపంలో దోపిడి, పీడనల వ్యవస్థను ప్రతిష్ఠించి, గుత్తపెట్టుబడికి జన్మనిచ్చి, ప్రగతినిరోధక శక్తులుగా రూపాంతరం చెందారు. నాటి స్వేచ్ఛాయుత మార్కెట్ స్థానంలో సామ్రాజ్యవాదం పాదుకుని సామాజికరంగాలు అన్నింటా సంక్షోభం వ్యాపించింది. తదుపరి దశలో, ఒకనాడు వీళ్లు ఘనంగా ఎలుగెత్తి చాటిన స్వేచ్ఛా, సమానత్వ, సౌభ్రాతృత్వ నినాదాలను, శ్రేయోరాజ్య స్థాపన ప్రకటనలను, మ్యాగ్నాకార్టాలను, ప్రజాస్వామ్య హక్కుల పత్రాలను, రాజ్యాంగపీఠికలను 20వ శతాబ్ది తొలినాళ్ల నుంచి వాళ్లే కాలరాసేయడం ప్రారంభమైంది. దీనికి ప్రతివాదంగా కార్మికవర్గ పోరాటాలు, తిరుగుబాట్లు, విప్లవాత్మక మార్పులు ప్రపంచమంతటా ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. ఈ పరిణామాల కారణంగా పాలకశక్తులలో కమ్ముకున్న మరణభీతి వాళ్లు ఫాసిజాన్ని ఆశ్రయించేలా చేసింది. ఈ నేపథ్యంలో కార్మికవర్గ విప్లవాన్ని నివారించడానికి, తమ పాలనను సుస్థిరం చేసుకోవడానికి పాలకవర్గాలు ముందస్తుగా చేపట్టే ఒక సమగ్ర ప్రగతినిరోధక పథకాన్నే ఫాసిజంగా నిర్వచించడం అధునాతన అవగాహన అవుతుంది.

మనదేశంలో 20వ శతాబ్ది ద్వితీయార్థంలో మార్క్సిస్టు అవగాహనను బహుముఖంగా పెంపొందించిన శిబ్దాస్ ఘోష్ రచనలలో ఈ ఫాసిజం గురించిన లోతైన అధ్యయనాన్ని మనం గమనించవచ్చు. ఆయన పరిశీలనల ప్రకారం ఫాసిజానికి ఉన్న మూడు మౌలికలక్షణాలను ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, తాత్విక పార్శ్వాలుగా విడదీసి అర్థం చేసుకోవచ్చు. ఒకటి: ఆర్థికంగా సామాజిక సంపద భారీస్థాయిలో కొద్దిమంది చేతుల్లోనే పోగుపడడం, రెండు: రాజకీయంగా అడ్మినిస్ట్రేటివ్ బ్యూరోక్రసీ చేతుల్లో అధికారాలన్నీ కేంద్రీకృతం కావడం. ఈ రెండూ రాజ్యాన్ని కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలతో మమేకమై పనిచేసేలా తీర్చిదిద్దుతాయి. మూడు: సాంస్కృతికరంగంలో ప్రజల ఆలోచనలలో అధ్యాత్మికవాదాన్ని సైన్సులోని సాంకేతిక అంశాలతో మిళితం చేయడం. ఒకచోట శిబ్దాస్ ఘోష్ ఇలా రాశాడు "ఫాసిజం ఒకవైపు ప్రజల్లో హేతుబద్ధ ఆలోచనా ప్రక్రియను నాశనం చేస్తుంది. వారిని పచ్చిస్వార్థపరులుగా మారుస్తుంది. జ్ఞానం, అధ్యయనం, విద్యా రంగాలను సాంకేతిక అంశాలకు పరిమితమయ్యే విధంగా చేస్తుంది. దీని అర్థం అన్నిరకాల మానవవిలువలను పూర్తిగా పరిత్యజించి, సమాజం పట్ల బాధ్యతాయుతమైన భావనలేవీ లేని ఒక టెక్నోక్రాట్ల సమూహాన్ని సృష్టిస్తుంది. వీరికి ఉద్యోగం, వేతన బానిసత్వమే పరమావధిగా ఉంటాయి. డబ్బు కోసం ఏమైనా, ఏదైనా చేయడానికి వీరు సిద్ధంగా ఉంటారు. ఇలాంటి మార్గం వైపు వారు సైన్సును, అధ్యయనాన్ని మళ్లిస్తారు. మరోవైపు ఫాసిజం అన్నిరకాల ఆధ్యాత్మికవాదాన్ని, మూఢనమ్మకాలను, అహేతుక మనస్తత్వాన్ని, గుడ్డితత్వాన్ని పెంచి పోషిస్తుంది. వీటన్నిటిని సైన్సులోని సాంకేతిక అంశాలతో విచిత్రంగా మిళితం చేస్తుంది". జనావళిలో ఈ మూడు లక్షణాలు పెరిగేకొద్దీ ప్రగతినిరోధక శక్తులకు బలం చేకూరుతుంది. వారు పరిరక్షించడానికి పూనుకున్న ప్రగతినిరోధక వ్యవస్థకు జీవనకాలం పెరుగుతుంది.

ఫాసిజం రూపురేఖల విషయానికి వస్తే ఆయా స్థల కాలాదులను బట్టి అవి దేశ దేశానికి వేర్వేరుగా ఉంటాయి. ఒకచోట అది మిలటరీ నియంతృత్వం కావచ్చు లేదా అధ్యక్షతరహా పాలన కావచ్చు. పాకిస్థాన్‌లో సైనిక ఆధిపత్యం, మయన్మార్‌లో మిలటరీ జుంటా పాలన దీనికి ఉదాహరణలు. మరోచోట పార్లమెంటరీ ప్రజాస్వామ్య ముసుగులో రెండు ప్రధానపార్టీలు లేదా కూటముల పాలన ద్వారా కూడా ఫాసిజం చాపకింద నీరులా వేళ్లూనుకోవచ్చు. ఒక పార్టీ లేదా కూటమి ప్రజల్లో అపఖ్యాతి పాలైనప్పుడు మరొకదాన్ని ముందుకు తెస్తారు. అమెరికా, ఇంగ్లండ్, భారతదేశం దీనికి సరైన నమూనాలు. అందువల్ల ఫాసిస్టురాజ్యం అన్ని చోట్లా, అన్ని సమయాలలో నిరంకుశ పాలనగా, అణచివేత సాధనంగా పైకి కనిపించకపోవచ్చు. అది చాలాసార్లు ప్రజలను ఒప్పించడం ద్వారా వారిని తన వెనుక పెద్దసంఖ్యలో సమీకరించుకునే ప్రయత్నం చేస్తుంది. ఇందుకు కొన్ని జనాకర్షక పథకాలను, నినాదాలను విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలను ఆకట్టుకునే చర్యలు చేపడుతుంది. ఒక నాయకుణ్ణి అన్ని శక్తులు కలిగిన అసమానవ్యక్తిగా, అద్భుతవ్యక్తిగా చాటుతుంది. జర్మనీలో హిట్లర్‌ను ఫ్యూరర్‌గా చిత్రీకరించిన సంగతి మనకు తెలుసు. మనదేశంలో కూడా ఒకప్పుడు ఇందిరాగాంధీని, ప్రస్తుతం మోదీని ఆకాశానికి ఎత్తి చూపించడం అలాంటి ప్రయత్నాల్లో భాగమే.

ఫాసిజం ఒక్క పాలకపార్టీకే పరిమితమైన విధానం కాదు, అదొక పాలకవర్గ పథకం. ఏ పార్టీ అయితే పాలకవర్గ ప్రయోజనాలను, ముఖ్యంగా కార్పొరేట్ సంస్థల అనుకూల ఆర్థిక, పారిశ్రామిక విధానాలను వేగంగా అమలు చేస్తోందో, దాని పర్యవసానంగా ప్రజలలో పెచ్చరిల్లే అసంతృప్తిని నేర్పుగా, చాకచక్యంగా పక్కకు మళ్లిస్తుందో ఆ పార్టీ వైపు ప్రగతినిరోధక శక్తుల తూకం మొగ్గుతుంది. ఈ పరిస్థితుల్లో ఫాసిజాన్ని నిలువరించే ప్రతి నిరోధకం ఎన్నికల సమీకరణల ద్వారా పెంపొందదు. ఫాసిస్టు భావజాలానికి విరుద్ధంగా సైద్ధాంతిక, సాంస్కృతిక, తాత్విక ప్రతిప్రవాహ ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహిస్తూ, బాధిత జన బాహుళ్యాన్ని దైనందిన సమస్యలపై సమరశీల పోరాటాల దిశగా సంఘటితం చేయాలి. అప్పుడే ఫాసిజాన్ని బలంగా ప్రతిఘటించే శక్తిని నిర్మించడం సాధ్యమవుతుంది.

> ఏ పార్టీ అయితే పాలకవర్గ ప్రయోజనాలను, ముఖ్యంగా కార్పొరేట్ సంస్థల అనుకూల ఆర్థిక, పారిశ్రామిక విధానాలను వేగంగా అమలు చేస్తోందో, దాని పర్యవసానంగా ప్రజలలో పెచ్చరిల్లే అసంతృప్తిని నేర్పుగా, చాకచక్యంగా పక్కకు మళ్లిస్తుందో ఆ పార్టీ వైపు ప్రగతినిరోధక శక్తుల తూకం మొగ్గుతుంది. ఈ పరిస్థితుల్లో ఫాసిజాన్ని నిలువరించే ప్రతి నిరోధకం ఎన్నికల సమీకరణల ద్వారా పెంపొందదు. ఫాసిస్టు భావజాలానికి విరుద్ధంగా సైద్ధాంతిక, సాంస్కృతిక, తాత్విక ప్రతిప్రవాహ ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహిస్తూ, బాధిత జన బాహుళ్యాన్ని దైనందిన సమస్యలపై సమరశీల పోరాటాల దిశగా సంఘటితం చేయాలి. అప్పుడే ఫాసిజాన్ని బలంగా ప్రతిఘటించే శక్తిని నిర్మించడం సాధ్యమవుతుంది.



■ ఎస్. గోవిందరాజులు



నిన్నటివరకు సందిగ్ధంలో ఉన్న పందెపురాయుళ్లు జోరు పెంచారు. ఈ ఎన్నికల్లో ఓటరన్న నాడిని సరిగ్గా పట్టలేక నిన్నటివరకు స్తబ్దుగా ఉండగా, ఎగ్జిట్ పోల్స్ విడుదల కావడం, చాలా సర్వేలు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి జెండా ఎగరేయడంతో నేడు రెండు జిల్లాల్లో మళ్లీ పందేల ఊపు పెంచారు. కొందరు కూటమి విజయావకాశాలపై రూ.కోట్లలో పందేలు కడుతుండగా, ఇంకొందరు మాత్రం వైసీపీకి అనుకూలంగానే ముందడుగు వేస్తున్నారు.

ఎగ్జిట్ పోల్ కేక

రెండు జిల్లాల్లో పెరిగిన బెట్టింగ్‌లు

- కూటమి విజయావకాశాలపై పందెపురాయుళ్లలో జోష్
- టీడీపీ గెలుపుపై గొల్లపూడిలో రూ.2 కోట్ల పందెం
- వైసీపీదే అధికారమంటూ రూ.75 లక్షలు
- గతంలో కంటే అదనంగా టీడీపీ నేతల పందేలు
- రూపాయికి రెండు రూపాయలు ఇస్తామని ఆఫర్లు



(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : సుమారు 20కిపైగా సర్వే సంస్థలు శనివారం సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెల్లడించాయి. వీటిలో అత్యధికం కూటమి వైపే మొగ్గు చూపాయి. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో 14 స్థానాల్లో తిరువూరు, పామర్రు మినహా మిగిలిన అన్ని స్థానాలు కూటమి ఖాతాలోనే పడతాయని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, కొన్ని సంస్థలు వైసీపీ వైపు మొగ్గు చూపాయి.

మళ్లీ జోరు

వాస్తవానికి రెండు జిల్లాల్లో ఎన్నికలు ముగిసిన వెంటనే రంగంలోకి దిగిన బెట్టింగ్‌బాబులు దూకుడు ప్రదర్శించారు. పోలింగ్ ముగిసిన వారంలో సుమారు రూ.100 కోట్ల మేర బెట్టింగ్‌లు కాశారు. ఆ తర్వాత ఫలితాలను విశ్లేషించుకుని జోరు తగ్గించారు. బూత్‌లవారీగా పోలైన ఓట్ల వివరాలను చేతిలో పట్టుకుని విశ్లేషించుకోవడం మొదలుపెట్టగానే, బెట్టింగ్ బాబుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. బయట జరుగుతున్న ప్రచారానికి, తమ విశ్లేషణల్లో వస్తున్న ఫలితాలకు పొంతన లేకపోవడంతో బెట్టింగ్ బాబులు సందిగ్ధంలో పడ్డారు. తొలుత రూపాయికి రెండు రూపాయిల పందేలు నడవగా, ఇప్పుడు రూపాయికి రూపాయి కట్టేందుకూ ముందుకు రావడం లేదు. చాలామంది 10 శాతం వదిలేసుకుని డబ్బు వెనక్కి తీసేసుకున్నారు. ఎగ్జిట్ పోల్స్ వెల్లడితో మళ్లీ బెట్టింగ్ బాబులు తెరపైకి వచ్చారు. ఆరా మస్తాన్ వంటి వారి సర్వేను ఆసరాగా చేసుకుని వైసీపీ గెలుపుపై బెట్టింగ్ బాబులు మళ్లీ పెద్ద ఎత్తున పందేలు కాసేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు టీడీపీ అభిమానులు సైతం గతంలో తాము కాసిన పందేలకు అదనంగా పందేలు కాయడానికి సై అంటున్నారు.

పందేలు ఇలా..

- రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తుందని, విజయవాడ తూర్పు, పెనమలూరు నియోజకవర్గాల్లోనూ గెలుస్తుందని తూర్పు నియోజకవర్గానికి చెందిన కొందరు పందెం కాశారు. వీరు సుమారు రూ.50 లక్షలు పందెం కాయడం గమనార్హం. మధ్యవర్తుల సమక్షంలో ఒప్పంద పత్రం రాసుకుని, సాక్షి సంతకాలు చేసుకుంటున్నారు. తాజాగా మరో రూ.25 లక్షలు పందెం కాయడానికీ వీరు సై అంటున్నారు.
- వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని గొల్లపూడికి చెందిన ఆ పార్టీ అభిమాని రూ.75 లక్షలు పందెం కాశారు.
- గొల్లపూడికి చెందిన టీడీపీ అభిమానులు నలుగురు కలిసి.. గత ఎన్నికల్లో వైసీపీకి వచ్చిన 151 సీట్ల కంటే ఈసారి కూటమికి ఒక సీటు ఎక్కువ అంటే 152 వస్తాయని పందెం కాశారు. ఈ పందెం విలువ రూ.2 కోట్లు.
- ఫలితాలపై అమెరికాలో సైతం పందేలు జోరుగా సాగుతున్నాయి. పటమటలంకకు చెందిన కొందరు ఎన్ఆర్ఐలు టీడీపీ అధికారంలోకి వస్తుందని 10వేల డాలర్లు పందెం కాశారు.
- వైసీపీ గెలుపుపై నమ్మకం లేక చాలామంది పందేలకు ముందుకు రావట్లేదు. దీంతో టీడీపీ అభిమానులు రూపాయికి రెండు రూపాయలు ఇచ్చేందుకూ సిద్ధమవుతున్నారు. కానూరుకు చెందిన ఓ టీడీపీ నాయకుడు రూ.2 లక్షలు పందెం కాశారు. ఇందులో ట్విస్ట్ ఏంటంటే టీడీపీ ఓడిపోతే ఈయన అవతలివారికి రూ.2 లక్షలు ఇవ్వాలి. అదే వైసీపీ ఓడిపోతే అవతలి వారు ఈయనకు రూ.లక్ష ఇస్తే సరిపోతుంది.
- విజయవాడ సెంట్రల్‌కు చెందిన ఓ నాయకుడు వైసీపీ అధికారంలోకి వస్తుందని రూ.25 లక్షలు పందెం కాశారు. ఈయన గత ఎన్నికల్లో పందెం కాసి సుమారు రూ.కోటి ఆర్జించారు.

లెక్క పక్కాగా..

ప్రధాన పార్టీల గెలుపోటములను అంచనా వేయడానికి బెట్టింగ్ బాబులు రాజకీయ నిపుణులను రంగంలోకి దించుతున్నారు. వారు బూత్‌లవారీగా పోలైన ఓట్ల వివరాలు, ఎవరికి మద్దతు ఉంటుందనే దానిపై సమాచారాన్ని సేకరించి, దాన్ని విశ్లేషించి ఏ బూత్‌లో ఏ పార్టీకి మెజారిటీ వస్తుందని లెక్కలు వేస్తున్నారు. పక్కాగా లెక్కలు తేల్చుతున్న తర్వాత బెట్టింగ్ బాబులకు ఆ వివరాలు అందజేస్తున్నారు. వాటి ఆధారంగా రెండు జిల్లాల్లో చాలాచోట్ల బెట్టింగ్‌లు నడిచాయి. ప్రధానంగా ప్రధాన పార్టీలు సాధించే సీట్లు, జిల్లాలో కీలకమైన నేతలు బరిలో ఉన్న స్థానాల్లో వారి గెలుపోటములు, మెజారిటీ ఆధారంగా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. అయితే, గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి సగం కూడా బెట్టింగ్‌లు నడవడం లేదనేది బెట్టింగ్ బాబుల మాట. గత ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణాలో సుమారు రూ.300 కోట్లు నడిచాయని సమాచారం. ఈసారి అందులో సగం కూడా లేదని చెబుతున్నారు.

నగరంలో హనుమాన్ శోభాయాత్ర

జై హనుమాన్





హనుమాన్ జంక్షన్ ఆలయంలో ప్రత్యేక అలంకారంలో అభయాంజనేయస్వామి

జై హనుమాన్.. నామస్మరణతో జిల్లా మార్మోగింది. హనుమజ్జయంతిని పురస్కరించుకుని శనివారం రెండు జిల్లాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, శోభాయాత్రలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ విజయవాడ మహానగర్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం నగరంలో హనుమాన్ శోభాయాత్ర, బైక్ ర్యాలీ నిర్వహించారు. శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి పాల్గొన్నారు. సత్యనారాయణపురంలోని బీఆర్టీఎస్ రోడ్డులో ఉన్న రామకోటి నుంచి ఫుడ్ జంక్షన్, మీసాల రాజారావు బ్రిడ్జి, పూర్ణానందంపేట, రైల్వేస్టేషన్, లోబ్రిడ్జి మీదుగా కదిలిన ఈ శోభాయాత్ర కెనాల్‌రోడ్డులోని వినాయకుడి గుడి వరకూ సాగింది. కాగా, హనుమాన్ జంక్షన్‌లోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. - సత్యనారాయణపురం

ఆగమేఘాలపై..

ఉమ్మడి కృష్ణాజిల్లా కాంట్రాక్టర్లకు ప్రభుత్వ షాక్

జేజేఎం బిల్లుల నిధులు విడుదల.. సగానికిపైగా మేఘా సంస్థకే..

- మొత్తం రూ.124 కోట్లు ముట్టజెప్పిన ప్రభుత్వం
- జిల్లాలోని ఇతర కాంట్రాక్టర్లకు పైసా విదిల్చింది లేదు..
- ఈఎన్‌సీ కార్యాలయ ముట్టడికి కాంట్రాక్టర్ల పిలుపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం పెద్ద షాక్ ఇచ్చింది. అస్మదీయులకే భారీగా చెల్లింపులు చేసింది. దీంతో జిల్లాకు సంబంధించి రూ.50 కోట్ల బకాయిల్లో ఒక్క పైసా కూడా స్థానిక కాంట్రాక్టర్ల చేతికి అందలేదు. అధికార పార్టీ సామాజికవర్గానికి చెందిన బడా కాంట్రాక్టు సంస్థలకు భారీగా చెల్లింపులు జరిపేశారు. ఇందులో ముందు వరసలో మేఘా సంస్థ ఉంది. ఎప్పుడో పనులు చేపట్టి జనవరిలోనే అప్‌లోడ్ అయిన ఉమ్మడి జిల్లా కాంట్రాక్టర్లను కాదని ఇటీవల మార్చిలో అప్‌లోడ్ చేసిన ఈ సంస్థ బిల్లులను ఆగమేఘాలపై చెల్లించారు. మొత్తం నాలుగు బిల్లుల్లో రూ.124 కోట్ల మేర చెల్లించారు.

ఆందోళన దిశగా కాంట్రాక్టర్లు

దీనిపై ఉమ్మడి జిల్లాకు చెందిన చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్లు భగ్గుమంటున్నారు. తాము అప్పులు తెచ్చి మరీ పెట్టుబడి పెట్టి పనులు చేశామని, చాలాకాలంగా బిల్లుల చెల్లింపు జరగకపోవటం వల్ల వడ్డీలు కడుతూ భారాన్ని మోస్తున్నామని మండిపడుతున్నారు. ప్రభుత్వ పెద్దల చర్యను నిరసిస్తూ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ అధికారుల వ్యవహారశైలిని తప్పుబడుతూ గొల్లపూడిలోని రాష్ట్ర ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించేందుకు ఉమ్మడి జిల్లా వాటర్ సప్లై కాంట్రాక్టర్లు రంగం సిద్ధం చేస్తున్నారు.

సగానికి పైగా మేఘాకే..

జేజేఎం పనులకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టర్లకు రూ.750 కోట్ల పైబడి బకాయిలున్నాయి. పనులు ఆపేస్తామని కొద్దిరోజులుగా కాంట్రాక్టర్లు అల్టిమేటం కూడా ఇస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం దిగివచ్చి రూ.206 కోట్లు విడుదల చేసింది. ప్రాధాన్యతా క్రమంలో బిల్లులు చెల్లించాల్సి ఉండగా, ప్రభుత్వం విడుదల చేసిన రూ.206 కోట్లలో సగానికి పైగా రూ.124 కోట్ల మేర ఒక్క మేఘా సంస్థకే బిల్లులు చెల్లించటం గమనార్హం.

ఆగని మరణాలు

మొగల్రాజపురంలో మరో ఇద్దరి మృతి



ప్రజాశక్తినగర్‌లో మంచినీటి శాంపిల్లను పరిశీలిస్తున్న అధికారులు

డయేరియా లక్షణాలతోనే... 8కి చేరిన మృతుల సంఖ్య

ప్రజాశక్తినగర్, రాధానగర్‌లో వాటర్ శాంపిళ్ల సేకరణ

గుణదల/పాయకాపురం, జూన్ 1 : మొగల్రాజపురం డయేరియా లక్షణాలతో మృతిచెందుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. తాజాగా శనివారం ఉదయం డయేరియా లక్షణాలతో మరో ఇద్దరు మృతిచెందారు. దీంతో ఇక్కడ మృతుల సంఖ్య 8కి చేరింది. స్థానిక అట్లూరి పరమాత్మ వీధిలో నివాసం ఉంటున్న గల్లా కోటేశ్వరరావు (60) డయేరియా లక్షణాలతో ఆసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అలాగే, మాచవరంలోని కార్మికనగర్‌కు చెందిన నీరుడు రజని వాంతులు, విరేచనాలతో తీవ్ర అనారోగ్యానికి గురైంది. ఆసుపత్రికి తరలిస్తుండగానే, ఆమె చనిపోయింది. కాగా, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న మరికొందరి పరిస్థితి కూడా విషమంగానే ఉంది.

రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : సీపీఎం

కలుషిత నీరు తాగి చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ సీపీఎం నాయకుడు బాబూరావు, సీపీఐ నాయకులు కాశీవిశ్వనాథ్ శనివారం మొగల్రాజపురంలో ధర్నా చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు మురహరి, శ్రీనివాస్, శేఖర్, రమణ, రాబిన్, మోహనరావు, ఈశ్వరరావు, ధర్మారావు, ప్రసాదరావు, శేషుకుమారి, కిరణ్, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

శివారులో మంచినీటి శాంపిళ్ల సేకరణ

నగర శివారు ప్రాంతాలైన ప్రజాశక్తినగర్, రాధానగర్ ప్రాంతాల్లో డయేరియా లక్షణాలతో అనేక మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. ఐదు రోజుల వ్యవధిలో ఓ మహిళ, వృద్ధురాలితో పాటు ఏడు నెలల బాలుడు మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే, సకాలంలో స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కనీస చర్యలు కూడా తీసుకోలేదు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం, మందుల పంపిణీ వంటి చర్యలు కూడా చేపట్టలేదు. డయేరియా లక్షణాలతో బాధపడుతున్న ప్రాంతాల్లో అధికారులు శనివారం మంచినీటి శాంపిళ్లు సేకరించి మమ.. అనిపించారు. జోనల్ కమిషనర్, వాటర్ డీఈ లక్ష్మీ సిందూర అధికారులతో కలిసి 64వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి సిబ్బందితో మంచినీటి శాంపిళ్లు సేకరించి పరీక్షలు నిర్వహించారు. మంచినీటి సరఫరాలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

మరోమారు రైళ్ల రద్దు

విజయవాడ-గుంటూరు పరిధిలో ఏడు రైళ్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రైల్వే అధికారులు మరోసారి రైళ్లను రద్దు చేశారు. ఈసారి కూడా మెయింటినెన్స్ పనుల కారణంగానే రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈసారి విజయవాడ-గుంటూరు సెక్షన్ పరిధిలో ఏడు రైళ్లను రద్దు చేశారు. మరికొన్నింటిని దారి మళ్లించారు. విజయవాడ-గుంటూరు (07464), గుంటూరు-విజయవాడ (07465), గుంటూరు-విజయవాడ (07976), హుబ్బళ్లి-విజయవాడ (17329), విజయవాడ-హుబ్బళ్లి (17330) రైళ్లను ఈనెల 14 వరకు రద్దు చేశారు. అలాగే, రాజమండ్రి-విజయవాడ (07767), విజయవాడ-రాజమండ్రి (07459) రైళ్లను 30వ తేదీ వరకు రద్దు చేశారు.

పకడ్బందీగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు

గత వివాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు

- 6లో..

వీడియోకాల్ చేసి.. రూ.30 లక్షలు కొట్టేశారు..!

నగరంలో మోసపోయిన రిటైర్డ్ ఉద్యోగి



పట్టుబడిన నిందితులతో సైబర్ క్రైం ఏసీపీ తేజేశ్వరరావు, సీఐ శివాజీ, ఎస్సై మూర్తి

'మీరు సినీనటి శిల్పాశెట్టి భర్త రాజ్‌కుంద్రాతో రోజూ టచ్‌లో ఉంటున్నారు. ముంబయిలో ఆయన నేరాలు చేసి సంపాదించిన డబ్బు మీ అకౌంట్‌లో జమ అవుతోంది. మీ పేరు మీద ముంబయిలో రెండు బ్యాంక్ అకౌంట్లు ఉన్నాయి. మీరు ముంబయి క్రైం బ్రాంచ్ ముందు విచారణకు హాజరు కావాలి. ముందు మేం చెప్పిన అకౌంట్‌లో రూ.30 లక్షలు జమ చేయండి. ఈ నేరాలతో ఎలాంటి సంబంధం లేదని తేలితే డబ్బు తిరిగి ఇచ్చేస్తాం.' నగరానికి చెందిన ప్రభుత్వ మాజీ ఉద్యోగికి ఓ వ్యక్తి వీడియోకాల్ చేసి చెప్పిన మాటలివి. ఇది నిజమేనని నమ్మిన ఆయన అవతలి వ్యక్తులు చెప్పినట్టు బ్యాంక్ అకౌంట్లో డబ్బు డిపాజిట్ చేశాడు. ఆనక మోసపోయానని గ్రహించిన సదరు ఉద్యోగి విజయవాడ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. ఈ కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. తీగలాగితే డొంకంతా కదిలినట్టు విశాఖపట్నం కేంద్రంగా సిమ్‌కార్డులు విక్రయించే మ్యూల్ గ్యాంగ్ వివరాలు బయటపడ్డాయి. ఏడుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసిన పోలీసులు శనివారం ఆ వివరాలు వెల్లడించారు.

- కేసు దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన కొత్త విషయాలు
- విశాఖ కేంద్రంగా బయటపడిన మ్యూల్ గ్యాంగ్ ఆగడాలు
- సైబర్ నేరగాళ్లకు నకిలీ సిమ్‌కార్డుల విక్రయం

ఏడుగురు మ్యూల్ గ్యాంగ్ సభ్యుల అరెస్టు

విజయవాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : కొద్దిరోజుల క్రితం సూర్యారావుపేటకు చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగికి ముంబయి సైబర్ క్రైం డీసీపీనని చెప్పి ఓ వ్యక్తి వీడియోకాల్ చేశాడు. రాజ్‌కుంద్రా చేసిన మోసాల ద్వారా సంపాదించిన డబ్బు ఆయన అకౌంట్లలో జమ అవుతున్నాయని, ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని హిందీ, ఇంగ్లీష్‌లో చెప్పాడు. వాట్సాప్‌లో ఆయన ఎఫ్ఐఆర్, అరెస్టు వారెంట్ కాపీలను పంపించాడు. ఇవి చూడగానే రిటైర్డ్ ఉద్యోగి ఆందోళన చెందాడు. ఫోన్ చేసిన వ్యక్తి నిజంగా డీసీపీ అని భావించాడు. అతడిని బతిమాలుకోగా, దఫదఫాలుగా తాను చెప్పిన అకౌంట్‌లో రూ.30.37 లక్షలు జమ చేయాలని చెప్పాడు. రాజ్‌కుంద్రాతో ఎలాంటి సంబంధం లేదని తేలితే తిరిగి డబ్బు ఇచ్చేస్తామని చెప్పడంతో ఈ రిటైర్డ్ ఉద్యోగికి మరింత నమ్మకం పెరిగింది. డబ్బు ఎంతకీ తిరిగి రాకపోవడం, ముంబయి సైబర్ క్రైం బ్రాంచ్ నుంచి ఎలాంటి ఫోన్లు రాకపోవడంతో ఆయనకు అనుమానం వచ్చి సైబర్ క్రైం పోలీసులకు

- మిగతా 6లో

తప్పులు కప్పిపుచ్చి.. బుకాయింపు!

- వేలంలో బ్యాంకు సిబ్బంది బంధువులు లేరట
- గాంధీ బ్యాంకు అధికారుల ప్రకటన
- బ్యాంకు సీఈవో భర్త వేలంలో పాల్గొన్నది వాస్తవం

- 6లో..

నమో ఆంజనేయం

హనుమజ్జయంతి సందర్భంగా జంక్షన్‌లో, ఇంద్రకీలాద్రిపై స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు



హనుమాన్‌జంక్షన్‌లో అభయాంజనేయస్వామికి పంచామృతంతో అభిషేకం చేస్తున్న అర్చకులు



హనుమాన్‌జంక్షన్, జూన్ 1: హనుమజ్జయంతి సందర్భంగా శనివారం అభయాంజనేయస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామికి తెల్లవారుజామున 3గంటలకు ఆల య ప్రధాన అర్చకుడు మారేపల్లి సీతారామానుజాచార్యులు, అర్చక స్వాములు వెంకటరామాచార్యులు, శ్రీనివాసాచార్యులు వేద మంత్రాల మధ్య పంచామృతాభిషేకం చేశాక, ప్రభాత సేవ జరిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామ పెద్దలు అప్పన కనకదుర్గాప్రసాద్, సుంకర సుభాష్‌చంద్ర బోస్, మేడే పూడి రామ్మోహన్‌రావు, నెరుసు నాగభూషణం, ఈవో కె.శ్రీని వాస్ రథానికి పూజలు చేసి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయం నుంచి బయలుదేరిన రథం ఏలూరు రోడ్డు, గుడి వాడ రోడ్డు, విజయవాడ రోడ్డు, నూజివీడు రోడ్డు మీదుగా సాగింది. విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి విభాగం కృష్ణా జిల్లా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి ఆధ్వర్యంలో 9 కలశా లతో అభయాంజనేయస్వామికి నైవేద్యం సమర్పించారు. అనం తరం సాయిబాబా మందిరం నుంచి ఆంజనేయస్వామి ఆల యం వరకు కలశాలతో శోభ యాత్ర నిర్వహించారు. లారీ ట్రాన్స్‌పోర్టర్ కనుమూరి సూర్య నారాయణరాజు ఆధ్వర్యంలో హనుమాన్‌జంక్షన్ లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ 20 వేల మం దికి అన్నసమారాధన నిర్వహించారు. అభయాంజనేయస్వామి ఆలయాన్ని ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, టీడీపీ గన్న వరం, దెందులూరు, మచిలీపట్నం అభ్యర్థులు యార్లగడ్డ వెంకట్రావు, చింతమనేని ప్రభాకర్, కొల్లు రవీంద్ర, గన్నవరం మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు తదితరులు దర్శించుకున్నారు.

ఇంద్రకీలాద్రిపై క్షేత్రపాలకుడికి అర్చనలు

వన్‌టౌన్: హనుమజ్జయంతి సందర్భంగా ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో క్షేత్రపాలకుడిగా ఉన్న అభ యాంజనేయస్వామికి శనివారం ప్రత్యేక అర్చనలు జరిపారు. వైదిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం మూల మంత్ర జపాలు చేశారు. మూల మంత్ర హవనంతో పాటు మన్యసూక్త, సుందరకాండ పారాయణలు చేశారు. కార్యక్రమాల అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. తొలుత స్వామికి స్నపన చేయించి, అభిషేకాన్ని పూర్తి చేశారు. నూతన వస్త్రాలు, పుష్పమా లలు, నిమ్మకాయ దండలతో అలంకరించారు. హనుమజ్జ యంతి సందర్భంగా దత్తత దేవాలయమైన సీతానగరంలోని వీరాంజనేయస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు. స్వామి విగ్రహానికి సింధూర లేపనం రాశారు. తమలపాకులతో అర్చనలు నిర్వహించి అరటి, మామిడి పండ్లను నైవేద్యంగా సమర్పించారు.

ప్రసాదం లడ్డూలకు వేలం

హనుమజ్జయంత్యుత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన లడ్డూ ప్రసాదాలకు ఆలయం వద్ద వేలం పాట నిర్వహించారు. లడ్డూ ప్రసాదం వేలంపాట ద్వారా ఆలయానికి రూ. 31,700 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో కె. శ్రీనివాస్ తెలిపారు. బోడిచర్ల రాంబాబు సమర్పించిన 25 కేజీల లడ్డూను అప్పన కనక దుర్గాప్రసాద్ రూ.14,400కు, తవ్వా పూర్ణచంద్ర రావు ఇచ్చిన 18 కిలోలు లడ్డూను ఆలేటి రాజా రూ.10 వేలకు, మరో భక్తుడు అందించిన 10 కేజీల లడ్డూను తాతా వెంకట్రావు రూ.7,300కు పాడారు.



గ్రామోత్సవాన్ని ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు



కలశాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న వీహెచ్‌పీ మాతృశక్తి విభాగం మహిళలు



వేలంలో పాడుకున్న లడ్డూ ప్రసాదంతో భక్తులు

చంద్రబాబుకు ఘనస్వాగతం

గన్నవరం, జూన్ 1: టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబుకు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించిం ది. ఎన్నికల అనంతరం విదేశీ పర్యటన ముగించుకుని రెండు రోజుల క్రితం హైదరాబాద్ చేరుకున్న ఆయన... ప్రత్యేక విమానంలో శనివారం రాత్రి 8 గంటలకు ఇక్కడికి విచ్చేశారు. ఎయిర్‌పోర్టులో చంద్రబాబుకు స్వాగతం పలికిన వారిలో మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, గన్నవరం, పెనమలూరు, మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థులు యార్లగడ్డ వెంకట్రావు, బోడే ప్రసాద్, వసంతకృష్ణ ప్రసాద్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు తదితరులు పాల్గొన్నారు.

4న రాష్ట్ర ప్రజలకు ముందస్తు దీపావళి

● ఎగ్జిట్ పోల్స్‌పై కేశినేని శివనాథ్ హర్షం

విద్యాధరపురం, జూన్ 1: రాష్ట్ర ప్రజలు జూన్ 4న ఎన్నిక ల ఫలితాల అనంతరం ముందస్తుగానే దీపావళి పండుగను జ రుపుకోనున్నారని విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీ పీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎగ్జిట్ పోల్స్‌పై ఆయన హర్షం వ్యక్తం చేశారు. నరకాసురచెర నుంచి రాష్ట్రం బయటపడుతోందని, ఫలితాలరోజు ప్రజలు ముందస్తుగానే దీపావళి జ రుపుకుంటారని, వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కదన్నారు. పరిశపోగు రాజేష్, ఎండీ ఇర్ఫాన్, పామర్తి కిషోర్‌బాబు, ఆర్ శివప్రసాద్ సమావేశంలో పాల్గొన్నారు.

కూటమి గెలుపు ఖాయం

● దుర్గమ్మను దర్శించుకున్న సీఎం రమేష్

వన్‌టౌన్: ఎన్నికల్లో కూటమి ఖచ్చితంగా గెలుస్తుందని అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్ అన్నారు. శనివారం ఆయన కుటుంబసమేతంగా ఇంద్రకీలాద్రి పై దుర్గమ్మను దర్శించుకున్నారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం ఇచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడు తూ ఓట్ల లెక్కింపు సందర్భంగా అనకాపల్లి వెళుతూ కుటుంబసమేతంగా అమ్మవారి దర్శించుకున్నట్టు చెప్పారు. జగన్మోహనరెడ్డి 175 స్థానాలు తనకే అంటున్నాడని ముందు ఒకటో నెంబ ర్ కానీ ఆఖరి నెంబర్ కానీ ఖచ్చితంగా ఎగిరిపోతాయన్నారు.

సీఎస్‌పై గవర్నర్ విచారణకు ఆదేశించాలి: వర్ల

అమరావతి: 'విశాఖ భూదందా విషయంలో సీఎస్ జవహర్‌రెడ్డిపై గవర్నర్ విచారణకు ఆదేశించాలి. వెంటనే కేంద్ర ఎ న్నికల కమిషన్ చర్యలు తీసుకుని సీఎస్‌ను పదవి నుంచి తొలగించాలి' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య కోరారు. శనివారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారులపై ఆరోపణలొస్తే పాలనా యంత్రాంగం, ఏసీబీ వెంటనే విచారణ చేసి విషయా న్ని తేల్చాలి. ఇప్పుడు చేతులన్నీ సీఎస్ వైపు చూపిస్తున్నాయి. వెంటనే గవర్నర్ సీఎస్‌పై విచారణకు ఆదేశించాలి. సీఎస్ పద వి నుంచి జవహర్‌రెడ్డిని పక్కనబెట్టాలి. భూదందాపై ఏసీబీ చీఫ్ వెంటనే సుమోటోగా కేసు నమోదు చేయాలి. అవినీతి ఆ రోపణలు ఎదుర్కొంటున్న సీఎస్ అధికారంలో ఉంటే ఎన్నికల కౌంటింగ్ సక్రమంగా జరిగే అవకాశం లేదు. విశాఖ భూదందా లో త్రిలోక్ అనే వ్యక్తి ఎవరు? అతనికి విశాఖ, విజయనగరం కలెక్టర్లు ఎలా తెలుసు? అక్రమంగా పేదల భూములను ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు? కార్తిక అప్పల పైడమ్మ భూమి ని తక్కువ ధరకు కొట్టేసి రిజిస్ట్రేషన్ చేయించకున్న తీరే వారి భూదందాకు ఉదాహరణ. సుమారు రూ.2వేల కోట్లు విలువ చే సే పేదల భూములను సీఎస్ కుమారుడు, బినామీలు కొట్టేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దాన్ని ప్రశ్నించిన జనసేన నేత మూ ర్తి యాదవ్‌ను బెదిరిస్తున్నారు' అని రామయ్య మండిపడ్డారు.

గులకరాయి నిందితుడి పూచీకత్తులకు అనుమతి

నేడు జైలు నుంచి విడుదల

విజయవాడ: నగరంలోని అజిత్‌సింగ్‌నగర్‌లో సీఎం జగన్ పై జరిగిన గులకరాయి దాడి కేసులో నిందితుడు వేముల సతీ శ్ కుమార్ తరఫున పూచీకత్తులను స్వీకరించడానికి న్యాయస్థానం అంగీకరించింది. సతీష్ కుమార్ బెయిల్ ఉత్తర్వులపై ఇచ్చిన స్టే గడువు ముగిసినందున పూచీకత్తులను అంగీకరించాలని సతీష్ తరఫు న్యాయవాది అబ్దుస్ సలీం మెట్రోపాలిట న్ సెషన్స్ జడ్జి కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ శనివారం కౌంటర్ వేశారు. న్యాయాధికారి ఇరువర్గాల వాదనలు విన్నారు. నిందితుడి బెయి ల్ విషయంలో ఇద్దరి పూచీకత్తులను అంగీకరిస్తూ అనుమతి ఇచ్చింది. దీంతో నెల్లూరు జైలులో ఉన్న సతీశ్ కుమార్ ఆదివా రం విడుదల అవుతాడని న్యాయవాది అబ్దుస్ సలీం తెలిపారు.

స్పోర్ట్స్ కేటగిరిలో కౌన్సెలింగ్

భారతీనగర్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అందుబాటులో ఉన్న సీట్ల భర్తీకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కొనసాగుతున్న కౌన్సెలింగ్ ప్రక్రియలో శనివారం ఎన్‌సీసీ అండ్ స్పోర్ట్స్ కేటగిరిలో 150మంది హాజరైనట్టు పాలిసెట్ జిల్లా కో-ఆర్డినేటర్, ప్రిన్సిపల్ ఎం.విజయపారథి తెలిపారు. జనరల్ కేటగిరీలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆంధ్రాలయోలా కళాశాలలో 202మంది, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలలో 190 మంది విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు.

23న స్విమ్మింగ్ జట్ల ఎంపికలు

విజయవాడ స్పోర్ట్స్: నగరంలోని గాంధీనగర్ సర్ విజ్జీ వీఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో ఈనెల 23న ఉదయం 9 గంటలకు ఎన్టీఆర్, కృష్ణాజిల్లా సబ్ జూనియర్, జూనియర్ స్విమ్మింగ్ జ ట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా స్విమ్మింగ్ అసో సియేషన్ సెక్రటరీ ఐ.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన స్విమ్మర్లు తమ పేర్లను ఈ నెల 19న సాయంత్రం 6 గంటల్లోగా ఎస్ఎఫ్ఐ యూఐడీతో నమోదు చేయించుకోవాలన్నారు. ఎంపికైన జట్లను జూలైలో కర్నూల్ డీఎస్‌ఏ స్విమ్మింగ్‌పూల్‌లో జరిగే ఏపీ స్టేట్‌మీట్‌కు పంపుతామన్నారు. వివరాలకు 7989534719 నెంబర్‌లో సంప్రదించాలని రమేష్ కోరారు.

రాష్ట్రంలో వ్యాపారాభివృద్ధికి

ఏపీ చాంబర్స్ సలహా మండలి

విజయవాడ: రాష్ట్రంలో వ్యాపారాభివృద్ధితో పాటు ఆయా రంగాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు వీలుగా విస్తృత స్థాయిలో ఒక సలహా సంఘాన్ని ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఏపీ చాంబ ర్స్) ఏర్పాటు చేసింది. శనివారం ఈ సలహా సంఘ సభ్యులతో విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేసింది. నూతనంగా ఏర్పాటు చేసుకున్న సలహా మండలి ఏపీ చాంబర్స్‌కు అనుబంధ మండలిగా పనిచేస్తుంది. ప్రస్తుత వ్యా పార పరిస్థితులు, ఆయా రంగాలు ఎదుర్కొంటున్న సవాళ్లపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రం వేగవంతమైన ఆర్థికాభివృద్ధికి సంబంధించిన రోడ్ మ్యాప్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకు వెళ్లాల్సిన ప్రధాన అంశాలపై చర్చించారు.

వడదెబ్బకు ఇద్దరి మృతి

విస్సన్నపేట, జూన్ 1: ఎండ వేడిమికి తాళలేక వడదెబ్బ లక్షణాలతో విస్సన్నపేటకు చెందిన చొప్పరపు నారాయణ (51), కంచడం వీరమ్మ (73)లు మృతి చెందినట్లు మృతుల కుటుంబ సభ్యులు శనివారం తెలిపారు. ఎండదెబ్బ తగిలి ఒక్క సారిగా కుప్పకూలిపోయారని వారికి ప్రథమ చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయిందని మృతుల కుటుంబ సభ్యులు వాపోయారు. టీడీపీ నాయకులు డాబా శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, జనసేన నాయకులు తోట కిషోర్ తదితరులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేల చొప్పున అందించారు.

తప్పులు కప్పిపుచ్చి.. బుకాయింపు!

- వేలంలో బ్యాంకు సిబ్బంది బంధువులు లేరట
- గాంధీ బ్యాంకు అధికారుల ప్రకటన
- బ్యాంకు సీఈవో భర్త వేలంలో పాల్గొన్నది వాస్తవం
- రూ.86 లక్షల వరకు పాడింది నిజం

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

విజయవాడ బందరు రోడ్డులో తాజ్ వివాంత హోటల్‌కు ఎదురుగా ఉన్న మూడంతస్తుల భవనం వేలంలో బ్యాంకుకు నష్టం కలిగించేలా జరిగిన కుమ్మక్కు వ్యవహారాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన విషయం విదితమే. దీనిపై బ్యాంకు అధికారులు స్పందిస్తూ ఇచ్చిన వివరణలో తమకు రావాల్సిన రుణం రూ.1.80 కోట్లుగా పేర్కొన్నారు. మరి అంత మొత్తం రుణ బకాయి రావాల్సి ఉంటే కేవలం రూ.88 లక్షలకే వేలం ముగించడం వెనుక ఉన్న అదృశ్య శక్తి ఎవరు? రిజిస్టర్ ఆఫీసు ధరల ప్రకారం అప్రూవ్డ్ వాల్యూవర్ నిర్ణయించిన ధర రూ.48 లక్షలే ఉందని, అందుకే రూ.88 లక్షలకే వేలం ముగించామని బ్యాంకు అధికారులు సర్దిచెప్పుకొనే ప్రయత్నం చేస్తు న్నారు. బ్యాంకు అధికారులు ఇచ్చిన వివరణలోనే అద్దెల రూపంలో రూ.50వేలు వస్తున్నాయని పేర్కొన్నారు. అంటే ఆ భవనం ఉన్న ప్రదేశం ఎంత డిమాండ్ ఉన్న ప్రాంతమో అర్థమవుతుంది. బహిరంగ మార్కెట్‌లో అక్కడ ఆ భవనం విలువ తక్కువలో తక్కువ కోటిన్నర పలుకుతుంది. అలాంటిది రూ.88 లక్షలకే దాన్ని వేలం వేసి, బ్యాంకుకు నికరంగా రూ.కోటి నష్టాన్ని కలిగించారన్నది వాస్తవం.

> గాంధీ సహకార బ్యాంకు అధికారులు తప్పులు కప్పిపుచ్చుకోవడంపై చూపుతున్న శ్రద్ధ వాటిని దిద్దుకోవడంలో చూపడం లేదని బ్యాంకు సభ్యులు విమర్శిస్తున్నారు. కొందరు వైసీపీ నాయకుల కనుసన్నల్లో నడుస్తున్న బ్యాంకును దివాళా తీయించే దిశగా బ్యాంకు చైర్మన్, డైరెక్టర్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై సహేతుకమైన వివరణ ఇవ్వకుండా తప్పులను కప్పిపుచ్చేలా.. అవినీతి అధికారులను వెనకేసుకొచ్చేలా ఖండనలకే బ్యాంకు అధి కారులు పరిమితం అవ్వడం ఏమిటని సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధం కాదా?

ప్రస్తుతం బ్యాంకు సీఈవో భర్త రఘు వేలంలో పాల్గొన్నారు. నిబంధనల ప్రకారం బ్యాంకు చైర్మన్, డైరెక్టర్లు, ఉద్యోగులు వారి బంధువులు వేలంలో పాల్గొనకూడదు. కానీ సీఈవో భర్త స్వయంగా వేలంలో పాల్గొని రూ.86 లక్షల వరకు వేలం పాడింది వాస్తవం. బ్యాంకు నిర్వహించిన వేలం రికార్డులను పరిశీలిస్తే ఇది వెల్లడవుతుంది. మరో నలుగురు బ్యాంకు డైరెక్టర్లు, వారి బంధువులతో కలిసి వేలంలో పాల్గొన్నారు. నిబంధనల ప్రకారం బ్యాంకు సేల్ ఆఫీసర్, బ్యాంకు తరఫున సీఈవో లేదా బోర్డు ఆమోదం పొందిన బ్యాంకు ఉద్యోగి మాత్రమే వేలంలో పాల్గొని వేలాన్ని పర్యవేక్షించాలి. డైరెక్టర్లు వేలంలో పాల్గొనడం, పర్యవేక్షించడం చేయకూడదు.

సేల్ ఆఫీసర్ నిర్లక్ష్యం కాదా?

బ్యాంకు అధికారులు ఇచ్చిన వివరణలో ఐదుసార్లు వేలం నిర్వహించినట్టు, భవన యజమాని వేలం జరగకుండా కోర్టును ఆశ్రయించినట్టు పేర్కొన్నారు. 2015లోనే హైకోర్టు 25 శాతం బకాయి కట్టే విధంగా స్టే ఉత్తర్వులు ఇచ్చినట్టు అధికారుల వివరణలో తెలిపారు. మరి ఆ మొత్తం కట్టించుకోకుండా సేల్ ఆఫీసర్ ఎందుకు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేశారు. ఈ ఉత్తర్వు తర్వాత కూడా భవన యజమాని పలుమార్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించేలా వెసులుబాటు కల్పించిన ఘనత సేల్ ఆఫీసర్‌కు దక్కుతుంది. భవన యజమానికి నెలకు రూ.50వేలు అద్దెలు వస్తున్నాయని అధికారులే చెబుతున్నారు. మరి న్యాయస్థానాల ద్వారా ఆ మొత్తాన్ని అటాచ్‌మెంట్ చేసుకునేందుకు ఎందుకు చర్యలు తీసుకోలేదు.

సర్‌ఫేసీ యాక్ట్ పట్టదా?

సర్‌ఫేసీ యాక్ట్ ప్రకారం పాలకవర్గం ఆమోదంతో బ్రాంచి మేనేజర్లు బకాయిదారుల నుంచి ఆస్తులను స్వాధీనం చేసుకుని వేలానికి వెళ్లవచ్చు. సహకార చట్టం పరిధిలో ఉన్న పాత బకాయిలన్నింటినీ ఈ చట్టం పరిధిలోకి తెస్తే సహకార శాఖ నుంచి సేల్ ఆఫీసర్ల రూపంలో సిబ్బందిని తెచ్చుకుని లక్షలాది రూపాయల జీతం ఇవ్వాల్సిన పని బ్యాంకుకు ఉండదు. పైగా బకాయిలు వేగంగా వసూలవుతాయి.

విదేశీ పర్యటన ముగించుకుని..

రాష్ట్రానికి తిరిగొచ్చిన జగన్

జాతీయ రహదారిపై నిలిచిపోయిన ట్రాఫిక్ ● ప్రయాణికులు, వాహనదారులకు తిప్పలు



జాతీయ రహదారిపై పోలీసులు నిలిపివేసిన వాహనాలు

గన్నవరం, జూన్ 1: విదేశీ పర్యటనను ముగించుకుని సీఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రానికి చేరుకున్నారు. ఇంగ్లాండ్‌లోని ఫార్న్‌బరో విమానాశ్రయం నుంచి శుక్రవారం రాత్రి బొంబార్డియర్ గ్లోబల్ 7500 ప్రత్యేక విమానంలో బయలుదేరి శనివారం తెల్లవారుజామున 5.07 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ముందుగా 4.58 గంటలకు వచ్చిన విమానం రన్‌వే పైకి దిగేందుకు విజిబులిటీ లేకపోవటంతో తిరిగి విజయవాడ వరకూ వెళ్లింది. అక్కడ నుంచి మళ్లీ వెనక్కి వచ్చి ల్యాండైంది. విజయసాయిరెడ్డి, నందిగం సురేష్, జోగి రమేష్, చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, కారుమూరి నాగేశ్వరరావు, మేరుగ నాగార్జున, కొట్టు సత్యనారాయణ, వెలంపల్లి శ్రీనివాసరావు, తలశిల రఘురాం, రుహుల్లా, మొండితోక అరుణ్ కుమార్, వల్లభనేని వంశీ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం రోడ్డు మార్గాన తాడేపల్లి వెళ్లారు. ఇదిలా ఉండగా గన్నవరం విమానాశ్రయంలోకి జగన్ మీడియాకు తప్ప ఎవరికీ అనుమతి లేదని సెట్‌లో గన్నవరం సీఐ కేవీఎస్‌వీ ప్రసాద్ చెప్పటం గమనార్హం.

వాహనాల నిలిపివేత..జనం బాధలు వర్ణనాతీతం

జగన్ రాకను పురస్కరించుకుని పోలీసులు ట్రాఫిక్‌ను నిలుపుదలచేశారు. విమానాశ్రయం నుంచి గన్నవరం వరకు ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల నుంచి కేసరపల్లి వైపు వరకూ వాహనాలను నిలుపుదల చేయటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెల్లవారుజామున కావటంతో ఎక్కువమంది ఆర్టీసీ బస్సుల్లో విజయవాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లేవారు ఉన్నారు. వారు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవటంతో రైళ్లు అందవని ఆందోళనచెందారు. విమానం ల్యాండింగ్ కాకముందే జాతీయ రహదారిపై వాహనాలను నిలుపుదల చేయడంతో ప్రయాణికులు, వాహనదారుల బాధలు వర్ణాతీతంగా మారాయి.

వీడియో కాల్ చేసి..

రూ.30 లక్షలు కొట్టేశారు..!

(ఐదోపేజీ తరువాయి..)

ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు వీడియో కాల్ ఏ నెంబర్ నుంచి వచ్చిందో విచారణ చేపట్టారు. సైబర్ క్రైం ఏసీపీ ఎస్‌డీ తేజేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ కోమాకుల శివాజీ, ఎస్ఐ మూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్ ఏర్పడింది. వీడియో కాల్ వచ్చిన నెంబర్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. వీఐ సర్వీసు ప్రొవైడర్ నెంబర్ నుంచి ఈ కాల్ వచ్చినట్టు గుర్తించిన పోలీసులు సిమ్‌కార్డు ఏ చిరునామాతో ఉందో అక్కడికి వెళ్లారు. విశాఖపట్నం చిరునామా చూపించడంతో అక్కడికి వెళ్లి విచారణ చేశారు. ఈ సిమ్‌ను ఎక్కడ కొన్నారో కనుగొన్నారు.

ఒకే వేలిముద్రతో రెండు సిమ్‌ల యాక్టివేషన్

కొత్తగా సిమ్‌కార్డు తీసుకునే వారు సంబంధిత సర్వీసు ప్రొవైడర్ వద్దకు గానీ, సేల్స్ ఎగ్జిక్యూటివ్ వద్దకు గానీ వెళ్లి ఆధార్ ఫొటోస్టాట్ చూపించి బయోమెట్రిక్ వేయాలి. 24 గంటల తర్వాత సిమ్ యాక్టివేషన్ అవుతుంది. ఇలా సిమ్‌ల కోసం వచ్చిన వారి వేలిముద్రతో వారు తీసుకున్న సిమ్‌ను కాకుండా మరో సిమ్‌ను యాక్టివేట్ చేస్తున్నారని గమనించారు. పోలీసుల విచారణలో తాము ఒక సిమ్ కార్డు మాత్రమే తీసుకున్నామని కొందరు వివరించారు. దీంతో అనుమానం మరింత బలపడింది. సిమ్‌కార్డుల కోసం వచ్చిన వారికి ఒకటి అధికారికంగా ఇచ్చి, మరో మ్యూల్ సిమ్‌ను యాక్టివేట్ చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు గ్యాంగ్ వెలుగులోకి వచ్చింది. విశాఖపట్నం గాజువాక ప్రాంతానికి చెందిన రేపాక రాంజీ, నంబాల నితిన్, విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన తేలు ప్రణయ్‌కుమార్, నంద రూపేష్, కాగితాల సింహాద్రి, ఏలూరు జిల్లా నిడమర్రుకు చెందిన పందిరి సత్యనారాయణ, పాత గాజువాక ప్రాంతానికి చెందిన బండి నారాయణమూర్తిని అరెస్టు చేశారు. నిందితుల్లో రాంజీ వీఐ సర్వీసు ప్రొవైడర్ షోరూంలో డిజిటల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. నితిన్ మొబైల్ సర్వీసింగ్ షాపును నిర్వహిస్తున్నాడు. విశాఖపట్నం కేంద్రంగా మ్యూల్ సిమ్‌లను యాక్టివేట్ చేసి వాటిని సైబర్ నేరగాళ్లకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు.

ఒక్కో సిమ్ ఖరీదు రూ.1,500

మ్యూల్ గ్యాంగ్ సిమ్‌కార్డులను సైబర్ నేరగాళ్లకు విక్రయించి భారీగానే సొమ్ము చేసుకుంటున్నట్టు పోలీసులు గుర్తించారు. సర్వీసు ప్రొవైడర్ నుంచి సేల్స్ ఎగ్జిక్యూటివ్‌కు సిమ్‌ను రూ.500కు ఇస్తారు. దీనికి ఎగ్జిక్యూటివ్ మరో రూ.100 లాభం వేసుకుని రూ.600కు డిస్ట్రిబ్యూటర్‌కు విక్రయిస్తాడు. సిమ్‌లను యాక్టివేట్ చేసే క్రమంలో మ్యూల్ సిమ్‌ను సృష్టించిన డిస్ట్రిబ్యూటర్లు, ఏజెంట్లు కలిసి సైబర్ నేరగాళ్లకు ఆ సిమ్‌లను విక్రయిస్తున్నారు. ఒక్కో సిమ్‌కార్డును సైబర్ నేరగాళ్లకు రూ.1,500 వరకు విక్రయించారు. ఇలా మొత్తం 30 సిమ్‌కార్డులను సృష్టించినట్టు పోలీసులు గుర్తించారు. వాటిలో 20 సిమ్‌లను సైబర్ నేరగాళ్లకు విక్రయించేశారు. ఇలా సృష్టించిన 998 మ్యూల్ సిమ్‌లను సైబర్ క్రైం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, రిటైర్డ్ ఉద్యోగి డబ్బు జమ చేసిన ఖాతాల వివరాలను రాబట్టిన పోలీసులు అందులో ఉన్న రూ.1.21 లక్షలను స్తంభింపజేశారు. ఈ ఖాతాను పరిశీలించగా, ఒక్క రోజులోనే రూ.6.2 కోట్ల లావాదేవీలు జరిగినట్టు తేలింది.

పకడ్బందీగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు

● గత వివాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక దృష్టి : జిల్లా ఎన్నికల అధికారి

ఆంధ్రజ్యోతి, విజయవాడ: పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల యంత్రాంగం ఏర్పాట్లు చేపడుతోంది. వివాదాలకు తావులేకుండా ఎన్నికల సంఘం నిబంధనలననుసరించి చర్యలు చేపడుతోంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు సంబంధించి కౌంటింగ్ సిబ్బందికి ఇప్పటికే పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చారు. కౌంటింగ్ కేంద్రాల్లో నూరు శాతం ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ నెల 4న ఉదయం 8 గంటలకు ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఈ ఓట్ల లెక్కింపు వద్దే గతంలో వివాదాలు ఎక్కువగా జరగటాన్ని గుర్తించిన జిల్లా ఎన్నికల అధికారులు ప్రతి దశలోనూ అనుసరించాల్సిన విధి విధానాలను ఇప్పటికే స్పష్టంగా వివరించారు. జిల్లావ్యాప్తంగా పార్లమెంట్, అసెంబ్లీ పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించటానికి ఇప్పటికే నోవా, నిమ్రా కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. రౌండ్లవారీగా ఓట్ల లెక్కింపులో ఖచ్చితత్వం, వేగంతో నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారి దిల్లీరావు కౌంటింగ్ సిబ్బందికిచిచన శిక్షణలో ఇప్పటికే తెలిపారు. ప్రతి టేబుల్‌కు కౌంటింగ్ సూపర్ వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్స్, మైక్రో అబ్జర్వర్లు అప్రమత్తంగా పనిచేయాలని నిర్దేశించారు. ఫారం-13సీ, ఫారం-13ఏ (డిక్లరేషన్), ఫారం - 13 బీకు సంబంధించి తిరస్కరణ నిబంధనలు, డిక్లరేషన్‌లో సీరియల్ నంబర్లు, ఓటర్ల సంతకం, అటెస్టర్ల సంతకం వంటి వాటితో పాటు బ్యాలెట్‌లో మార్కింగ్, ట్యాబ్యులేషన్‌కు సంబంధించిన అంశాలను దిల్లీరావు ప్రత్యేకంగా కౌంటింగ్ సిబ్బందికి ఇప్పటికే వివరించారు.

సెంట్రల్‌జోన్‌లో బోణికొట్టిన కృష్ణా టీం

జగ్గయ్యపేట, జూన్ 1: గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగిన అండర్-19 సెంట్రల్ జోన్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రకాశం జిల్లా టీంపై 206 పరుగుల భారీ వ్యత్యాసంతో కృష్ణా జిల్లా టీం ఘన విజయం సాధించి బోణీ కొట్టింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో జగ్గయ్యపేటకు చెందిన బ్యాట్స్‌మెన్, కృష్ణా టీం కెప్టెన్ టి.వరుణ్ సాత్విక్ ఆల్‌రౌండ్ ప్రతిభ చూపారు. తొలుత బ్యాటింగ్ చేసిన కృష్ణా జట్టు కేవలం 5 వికెట్లు కోల్పోయి 385 పరుగులు సాధించగా, కేవలం 65 బంతుల్లో 9 బౌండరీలు, 8 సిక్స్‌లతో 108 పరుగులతో అజేయంగా నిలిచి జట్టు భారీ స్కోర్ సాధించటంలో కెప్టెన్ వరుణ్ సాత్విక్ ప్రధాన భూమిక పోషించారు. తర్వాత బ్యాటింగ్ చేపట్టిన ప్రకాశం టీం 179 పరుగులకే ఆలౌటైంది.

కోదండ రామాలయంలో

మన్యుసూక్త హోమం

వన్‌టౌన్, జూన్ 1: హనుమజ్జయంతి సందర్భంగా దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థాన దత్తత దేవాలయమైన సీతానగరంలోని కోదండ రామాలయం ప్రాంగణంలోని వీరాంజనేయ స్వామికి శనివారం 1100 మామిడి పండ్లతో సహస్రనామార్చన చేశారు. మన్యుసూక్త హోమం నిర్వహించి సాయంత్రం పూర్ణాహుతితో ముగించారు. సువర్చల సమేత వీరాంజనేయ స్వామివారికి శాంతి కల్యాణం నిర్వహించారు.

దుర్గమ్మకు శనివారం నాటి ఆదాయం

దుర్గమ్మకు శనివారం రాత్రి 8.30 గంటల వరకు టికెట్‌ల రుసుం ద్వారా రూ.34,29,750లు ఆదాయం సమకూరిందని ఈవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.500 రుసుం టికెట్ ద్వారా రూ.8,55,500లు, రూ.300 రుసుం టికెట్ ద్వారా రూ.3,15,000, రూ100 టికెట్ ద్వారా రూ.4,88,200లు ఆదాయం సమకూరింది. 3,108 మంది తలనీలాలు సమర్పించుకోగా లడ్డూ ప్రసాదం ద్వారా రూ.60,536, పులిహోర ప్రసాదం ద్వారా రూ.19,640 ఆదాయం సమకూరగా విరాళాల ద్వారా రూ.1,54,476 ఆదాయం సమకూరింది.

ధర్మపథం వేదికపై నాట్యచారిణి సిరిమల్ల చంద్రస్మిత ఆధ్వర్యంలోని వరంగల్‌కు చెందిన చంద్రనృత్య కళాక్షేత్రం బృందం శనివారం నాట్యప్రదర్శన ఇచ్చింది. కీర్తనలకు కూచిపూడి నృత్యం చేసి మన్ననలను అందుకున్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ఆద్యుడు కురియన్



పాలఫ్యాక్టరీలో వర్గీస్ కురియన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చలసాని ఆంజనేయులు

చిట్టినగర్, జూన్ 1: పాడి పరిశ్రమ అభివృ ద్ధికి ఆద్యుడు వర్గీస్ కురియన్ అని, పాడి రైతుల ఆర్థిక అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. ప్రపంచ పాల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పాలఫ్యాక్టరీ ఆవరణ లో వర్గీస్ కురియన్, మ్యాక్స్ చట్ట రూపకర్త ఎన్టీ ఆర్, ఏపీ డెయిరీ రంగ వ్యవస్థాపకుడు కాకాని వెంకటరత్నం విగ్రహాలకు చలసాని పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాల ఉత్పాదనలో దేశం అగ్రగామిగా నిలవడానికి కురియన్ కృషి చేశారన్నారు. నాణ్యమైన పాలు, పాల పదార్థా లను వినియోగదారులకు అందించడమే ధ్యేయ మని ఎండీ కొల్లి ఈశ్వరబాబు అన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.85

నలందాలో జాబ్‌మేళా



లబ్బీపేట: నలంద డిగ్రీ కళాశాలలో 24/7 ఏఐ సంస్థలో ఉద్యోగాల భర్తీకి ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలో 200మంది అభ్యర్థులు హాజరుకాగా మొదటి రౌండ్ రాత పరీక్షలో 81మంది విద్యార్థులు ఎంపిక కాగా రెండో రౌండ్ గ్రూప్ డిస్కషన్‌లో 44మంది, చివరి రౌండ్ కంప్యూటర్ లిటరసీ రౌండ్‌లో 15మంది ఎంపిక అయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐ సంస్థ ప్రతినిధులు శ్రీకన్య, దివ్యకృష్ణన్, ఏపీఐటీఏ సీఈవో డి.వి.రామకోటిరెడ్డి, జిల్లా మేనేజర్ ఎం.సత్యరత్నం, ఎస్.జనార్ధన్‌రావు, నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.చంద్రగిరి పాల్గొన్నారు.



విజయదుర్గా ఆలయంలో వీరాంజనేయస్వామి, దాసాంజనేయస్వామికి పూజలు చేసిన 48వ డివిజన్ టీడీపీ నేత రమణ దంపతులు



త్రిశక్తిపీఠంలో సామూహికంగా ఆకుపూజ



పూర్ణాహుతి హోమం



కరెన్సీ నగర్‌లో



భవానీపురంలో

వైభవంగా హనుమజ్జయంతి

- హనుమాన్ దీక్షాపీఠంలో మాలవిరమణ చేసిన భక్తులు
- తమలపాకులు, తులసీ దళాలతో పూజలు
- భక్తులతో కిటకిటలాడిన ఆంజనేయస్వామి ఆలయాలు

చిట్టినగర్, జూన్ 1: హనుమా మము కనుమా జయమ్ములివ్వుమా అంటూ భక్తులు హనుమంతుడిన్ని మనసారా కొలిచారు. శనివారం కొత్తపేట, చిట్టినగర్ పరిసర ప్రాంతాల్లో హనుమాన్ జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయాల్లో హనుమంతుని మూలవిరాట్‌లకు ప్రత్యేక అర్చనలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. పాలఫ్యాక్టరీ సమీపంలోని హనుమాన్ దీక్షాపీఠంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయ వీరాంజనేయ స్వామిని తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి హనుమాన్ దీక్షాదారులు ఆలయానికి తరలి వచ్చి మాల విరమణ చేశారు. దుర్గాప్రసాద్ స్వామీజీ భక్తులతో దీక్షా విరమణ చేశారు.

● గుజ్జారి ఎల్లారావు మార్కెట్‌లో ఉన్న వీరాంజనేయ స్వామికి విశేష పూజలు చేశారు. మహిళలు స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయకమిటీ సభ్యులు డి.వి.రమణబాబు పర్యవేక్షించారు.

● పాలఫ్యాక్టరీ బ్రిడ్జి సమీపంలో ఉన్న ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి అభిషేకం, లక్ష తులసి అర్చన జరిగాయి. భక్తులు స్వామిని దర్శించుకొని పూజలు చేశారు.

● వాగుసెంటర్‌లో వీరాంజనేయస్వామి దేవస్థానంలో, చిట్టినగర్ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు ఆలయాలకు తరలివచ్చి స్వామిని దర్శించుకొని పూజలు చేశారు.

టీడీపీ విజయాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు

తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరిల విజయాన్ని కాంక్షిస్తూ 48వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పేరాబత్తుల రమణ, రాజేశ్వరి దంపతులు డివిజన్‌లోని రాయప్పరాజువీధిలో దాసాంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సమీపంలోని లక్ష్మీనరసింహస్వామికి పూజలు చేశారు.

గవర్నర్‌పేట: లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీ షిర్డినాగ సాయిబాబా మందిరంలో భక్తులు రోజంతా ఉపవాసం ఉండి హనుమాన్ చాలిసా పఠనం, రామనామ జపం చేశారు. మహిళా భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

త్రిశక్తిపీఠంలో..

కృష్ణలంక : త్రిశక్తిపీఠంలోని ఆంజనేయ స్వామికి శనివారం ఉదయం 6 గంటలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. సహస్ర నామాలతో సహస్ర ఆకుపూజ నిర్వహించారు. శ్రీ కనకదుర్గా లలితా పారాయణం బృందం మహిళలు హనుమాన్ చాలీసాను 41 సార్లు పారాయణం చేశారు. భక్తులందరికీ వడపప్పు, పానకం ప్రసాదంగా ఆలయ నిర్వాహకులు అందించారు. పూజలో పాల్గొన్న భక్తులందరికీ అన్నప్రసాదాలు అందచేశారు.

● కృష్ణలంక పాతపోలీస్ స్టేషన్ రోడ్డులోని సనత్కుమార వైదిక ఆశ్రమం వ్యవస్థాపకుడు దేవరకొండ సనత్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా స్వామి వారి మహాసంకల్ప పూజ, గోత్రనామ పఠనం, తమలపాకుల అర్చన, సర్వ దేవతా యాగం నిర్వహించామన్నారు.

దాసాంజనేయ స్వామి ఆలయంలో

భారతీనగర్: కరెన్సీ నగర్ దాసాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామభక్త సేవాసమితి కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి మహోత్సవం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి స్వామికి పంచామృత అభిషేకాలు, సహస్రనామ ఆకు పూజ, మంత్ర పుష్పార్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భక్తులు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.



కొత్తూరు తాడేపల్లిలో

భవానీపురం: విద్యాధరపురం చెరువుసెంటర్‌లోని పురాతనమైన సువర్చలా సహిత ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ఉదయం స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, ఆకు, సింధూర పూజలను నిర్వహించారు. సాయంత్రం సువర్చలా సమేత హనుమంతుడికి కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

విజయవాడ: విజయవాడ రూరల్ మండలంలోని కొత్తూరు తాడేపల్లి గ్రామంలో శనివారం హనుమత్ జయంతి సందర్భంగా శ్రీ సువర్చలా సమేత ఆంజనేయ స్వామి సప్త ప్రహర సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. ఈ సందర్భంగా స్వామికి 108 సార్లు ఆకు పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమం జరిగింది. గోరంట్ల సుబ్రహ్మణ్యం, అనుమోలు గాంధీ, తోసేటి కృష్ణప్రసాద్, ఆవుల శివనాగేశ్వరరావు, ఆవుల కోటేశ్వరరావు, దొడ్డా శేఖర్, పామర్తి శివబాబు, రాయల సుబ్బారావు, పోతురాజు మహేశ్, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మంచినీటి కుళాయిల్లో రంగు నీరు రాకుండా చర్యలు తీసుకోండి

● సీపీఎం కార్పొరేటర్ బోయ సత్యబాబు



హెడ్ వాటర్ వర్క్స్‌లో నీటిని పరిశీలిస్తున్న బోయ సత్యబాబు

విద్యాధరపురం, జూన్ 1: మంచినీటి కుళాయిలకు రంగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం కార్పొరేటర్, ఫ్లోర్‌లీడర్ బోయ సత్యబాబు హెడ్‌వాటర్ వర్క్స్ అధికారులకు సూచించారు నగరంలో డయేరియా ప్రబలడం, నలుగురు మృతి చెందడం, పలువురు అస్వస్థతకు గురవుతున్న నేపథ్యంలో శనివారం ఆయన హెడ్ వాటర్‌వర్క్స్‌లో ఫిల్టర్ పాయింట్లను పరిశీలించారు. ఫిల్టర్ పాయింట్లలో నీరుతెల్లగా ఉంటున్నా కుళాయిలకు రంగు మారిన నీరు ఏ విధంగా వస్తుందో సంబంధిత అధికారులు పరిశీలించాలన్నారు. ఈ సందర్భంగా ఏఈ బసిరెడ్డి వాటర్ ఫిల్టరేషన్ విధానం గురించి వివరించారు. రంగు మారిన నీరు కుళాయిలకు వెళ్లకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

వన్‌టౌన్, జూన్1: ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని 53వ డివిజన్ కార్పొరేటర్ మహదేవ్ అప్పాజీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లో ఎవరికైనా కలుషిత నీటి సమస్య ఉంటే నేరుగా తన కార్యాలయంలో కానీ, ఫోన్ నెంబర్ 9848355188లో సంప్రతించాలని కోరారు. డివిజన్‌లో ఉదయం 6 నుంచి 7 వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటలకు మాత్రమే మోటార్‌లతో నీటిని ట్యాంక్‌ల్లో నింపుకోవాలని కోరారు.

డయేరియా మరణాలకు అధికారులు, ప్రజాప్రతినిధులే కారణం

● సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు

వన్‌టౌన్, జూన్ 1: నగరంలో డయేరియా మరణాలకు అధికారులు, ప్రజాప్రతినిధులే కారణమని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఆరోపించారు. శనివారం వన్‌టౌన్‌లోని లెనిన్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కలుషిత నీరు తాగి మరణించిన వారి కుటుంబాలకు నగరపాలక సంస్థ ఎక్స్‌గ్రేషియా అందించాలని, బాధితులకు ఉచిత చికిత్స అందించాలని డిమాండ్ చేశారు. పైప్‌లైన్‌లు సైడ్ కాలువలు, డ్రెయిన్లలో ఉండడం వల్ల కలుషిత నీరు వచ్చే ప్రమాదం ఉందని ముందుగానే హెచ్చరించినా పట్టించుకోలేదన్నారు. మొగల్రాజపురం ప్రాంతంలో కలుషిత నీరు కారణంగా ఏడుగురు మరణించారన్నారు. వందలాదిమంది డయారియా బాధితులు ఉన్నారన్నారు. ఇందుకు పూర్తిగా కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులే కారణమన్నారు. కొత్త పైపులైన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. సీపీఐ నగర కార్యదర్శి లంక దుర్గారావు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు ఏజెంట్లు సకాలంలో హాజరు కావాలి : బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 1 : టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ కౌంటింగ్ ఏజెంట్లతో బొండా ఉమామహేశ్వరరావు శనివారం టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం వద్ద గల నోవా కాలేజీలో ఈనెల 4న జరగనున్న కౌంటింగ్‌కు ఏజెంట్లు సకాలంలో హాజరు కావాలని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియలో పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంలలోని ఓట్లు క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. కౌంటింగ్ ప్రారంభం నుంచి రిజల్ట్ ప్రకటించేంత వరకు ప్రతి ఒక్క కౌంటింగ్ ఏజెంట్ కేంద్రంలోనే ఉండాలని సూచించారు.

ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

పాయకాపురం : శ్రీ ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని 62వ డివిజన్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించిన అన్నసంతర్పణలో పాల్గొని భక్తులకు భోజనం అందజేశారు.

రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్‌లో విజయవాడ లిఫ్టర్లకు పతకాలు



విజయవాడ స్పోర్ట్స్, జూన్ 1 : గుంటూరు జిల్లా మంగళగిరిలో గత నెల 29 నుంచి 31 వరకు జరిగిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో విజయవాడ లిఫ్టర్లు తరుణ్ కుమార్, ఆనంద్‌కుమార్‌లు సత్తా చాటారు. సబ్ జూనియర్ 53 కిలోల విభాగంలో తరుణ్ కుమార్ రజతం, జూనియర్ 90 కిలోల విభాగంలో ఆనంద్‌కుమార్ కాంస్యం సాధించారు. రాష్ట్రస్థాయిలో పతకాలను సాధించిన క్రీడాకారులను జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి మల్లేశ్వరరావు, రైల్వే ఏఎస్ఐ ఆర్. నాగేశ్వరరావులు అభినందించారు.

కీళ్లవాతంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

ప్రముఖ రుమటాలజిస్ట్ మమత



మాట్లాడుతున్న డాక్టర్ జి.మమత

పటమట, జూన్ 1 : కీళ్లవాతం జబ్బునే వైద్య బాషలో రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ అంటారని, కీళ్లవాతం జబ్బు మహిళల్లో అధికమని, ఈ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ప్రముఖ రుమటాలజిస్ట్ డాక్టర్ జి. మమత పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్ హోమ్‌లో డాక్టర్ సమరం అధ్యక్షతన శనివారం జరిగిన ఆరోగ్య సదస్సులో ఆమె 'కీళ్లవాతం- నొప్పులు 'అనే అంశంపై ప్రసంగించారు. మమత మాట్లాడుతూ ఇది ఆటోఇమ్యూన్ కోవకి చెందిన దీర్ఘకాలిక వ్యాధి అని తెలిపారు. కీళ్లవాతం చిన్నవయస్సులోనే వస్తుందని, చిన్న జాయింట్లకి కీళ్లవాతం రావడం ఎక్కువని అన్నారు. మణికట్టు, మోచేయి, మోకాలు, మడమ కీళ్లలో వాపు, నొప్పి ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ వ్యాధిని నిర్ధారించుకోవడానికి సీ-రియాక్టివ్ ప్రోటీన్ రుమటాయిడ్ ఫాక్టర్, యాంటీ సైక్లిక్ సిట్రులినేటెడ్ పెప్టైడ్ టెస్ట్‌లు ఉపయోగప డతాయన్నారు. కీళ్లవాతం జబ్బు ఉన్న వాళ్లు యాంటీ ఇన్‌ఫ్లేమేటరీ డ్రగ్స్ వాడాలన్నారు. ఎక్కువగా శాఖాహారం తీసుకోవాలని మమత సూచించారు. ఎక్సర్‌సైజ్ చేయడం ఉంటే చాలా వరకు వ్యాధి అదుపులో ఉంటుందన్నారు. డాక్టర్ మారు కూడా పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, దుప్పట్ల పంపిణీ



పేద విద్యార్థులకు దుప్పట్లు, స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న గుప్తా

గవర్నర్‌పేట, జూన్ 1: సమాజంలో సేవా భావంతో పనిచేసే సంస్థలు ఆవిర్భవించడం అభినందనీయమని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, లయన్స్ జిల్లా అంబాసిడర్ వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. జయహో విజయవాడ రెసిడెంట్స్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఏలూరు రోడ్డులోని రామమందిరం వద్ద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, దుప్పట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వారికి సేవలు అందించడంలో సేవా సంస్థలు పోటీ పడాలన్నారు. సంస్థ కన్వీనర్ జెవీ రెడ్డి మాట్లాడుతూ వేసవిలో చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు నిర్వహించడంతో పాటు అనాథాశ్రమానికి బియ్యం, నిత్యావసర సరుకులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు వైవీరావు, బుజ్జి, సుజన, ఆంజనేయరాజు, మార్కండేయలు, నిరంజన్‌నాయుడు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్ క్రికెట్‌లో గుంటూరు జయకేతనం

● డబుల్ సెంచరీ చేసిన గుంటూరు బ్యాటర్ సమన్విత్



సమన్విత్

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 1 : మూలపాడు ట్విన్ స్టేడియంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సెంట్రల్ జోన్ సీనియర్ పురుషుల వన్డే క్రికెట్ టోర్నీలో గుంటూరు జయకేతనం ఎగురవే సింది. పశ్చిమగోదావరి-గుంటూరు జట్ల మధ్య శనివారం మ్యాచ్ జరిగింది.తొలుత బ్యాట్‌పట్టిన గుంటూరు 49.4 ఓవర్లలో 356 పరుగుల భారీ స్కోర్ వద్ద ఆలౌట్ అయ్యింది. గుంటూరు బ్యాటర్ సమన్విత్ డబుల్ సెంచరీతో పరుగుల దాహం తీర్చుకున్నాడు.సమన్విత్ 111 బంతుల్లో 12 ఫోర్లు, 21 సిక్స్‌లతో 202 పరుగులతో అజేయంగా నిలిచాడు. పశ్చిమ బౌలర్ దీపక్ చంద్ 7 వికెట్లతో సత్తా చాటాడు. 357 పరుగుల విజయలక్ష్యంతో బరిలో దిగిన పశ్చిమగోదావరి జట్టు పోరాడి 50 ఓవర్లలో 287/8 పరుగులను చేసింది. ఈ జట్టు బ్యాటర్స్‌లో మునీష్ వర్మ 127 పరుగులు చేశాడు.

ఆలిండియా చెస్ చాంప్‌గా నిశ్చల్

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 1 :

విజయవాడ బాలుడు తాళ్ల నిశ్చల్ ఆలిండియా చిల్డ్రన్స్ చెస్ అండర్-15 చాంప్‌గా నిలిచాడు.

హైదరాబాద్‌లో వారాస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో గుజరాత్ భవన్‌లో శనివారం జరిగిన ఈ టోర్నీలో మొత్తం 266 ప్లేయర్స్ బరిలో దిగగా, నిశ్చల్ 8 పాయింట్లకు గాను 7.5తో సత్తా చాటాడు.

సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న నిశ్చల్ నగరంలోని స్పార్క్ చెస్ అకాడమీ కోచ్ టి. నరేష్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. ట్రోఫీతో పాటు రూ.5వేలు ప్రైజ్‌మనీని నిశ్చల్ అందుకున్నాడు.

తారాపేటలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



వన్‌టౌన్. జూన్ 1: వన్‌టౌన్ తారాపేట గాంధీకొండ ప్రాంతంలో ఉన్న ఒక గోడౌన్ వద్ద గుర్తు తెలియని మృతదేహం శనివారం లభించింది. ఆ ప్రాంతంలో వాటర్ మోటార్ షాపు నిర్వాహకుడు షేక్ మహబూబ్ ఆలీ ఇచ్చిన సమాచారం వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. షేక్ మహబూబ్ ఆలీ తన షాపునకు సంబంధించి ఉన్న గోడౌన్ వద్దకు శుక్రవారం వెళ్లగా సుమారు 25 నుంచి 30 ఏళ్ల వయస్సుగల వ్యక్తి మత్తుగా పడి ఉండగా నీళ్లు చల్లడంతో పక్కకు ఒరిగి పడుకున్నాడు. మళ్లీ శనివారం కూడా అతను గోడౌన్ వద్దకు వెళ్లగా ఆ యువకుడు అపస్మారకంలో ఉన్నాడు. లేపటానికి ప్రయత్నించినా అతను కదలలేదు. అతను పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడిని పందికొక్కులు కొరకడంతో పాదాల వద్ద నుంచి రక్తం వచ్చినట్లు అతను ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడి ఒంటిపై నీలంరంగుపై తెలుపు చారల పొడుగు చేతుల చొక్కా, నీలం రంగు ఫెడెడ్ జీన్స్ ప్యాంట్ ఉన్నాయి. వివరాలు తెలిసిన వారు వన్‌టౌన్ సీఐ 9440627076, ఎస్ ఐ9440627054లకు ఫోన్ చేసి చెప్పాలని పోలీసులు పేర్కొన్నారు.

దిక్సూచి DIKSUCHI

నిట్ తిరుచిరాపల్లిలో పీహెచ్‌డీ



తిరుచిరాపల్లిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- పీహెచ్‌డీ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైం, పార్ట్ టైం విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఇనీషియల్ స్ర్కీనింగ్, రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 146 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఫుల్ టైం ప్రోగ్రామ్‌లో చేరిన వారు గరిష్ఠంగా ఆరేళ్లలో; పార్ట్ టైం అభ్యర్థులు గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తి చేయవచ్చు.

విభాగాలు-సీట్లు: ఆర్కిటెక్చర్ 8, కెమికల్ ఇంజనీరింగ్ 8, కెమిస్ట్రీ 7, సివిల్ ఇంజనీరింగ్ 13, కంప్యూటర్ అప్లికేషన్స్ 8, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 10, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 11, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 13, ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ 3, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ 5, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్ 7, మేనేజ్‌మెంట్ స్టడీస్ 7, మేథమెటిక్స్ 8, మెకానికల్ ఇంజనీరింగ్ 13, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ 8, ఫిజిక్స్ 6, ప్రొడక్షన్ ఇంజనీరింగ్ 11 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సంబంధిత ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్/డిజైన్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ విభాగాలకు పీజీ(హ్యూమానిటీస్/సోషల్ సైన్స్/ఎకనామిక్స్/బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/కామర్స్/స్టాటిస్టిక్స్) పూర్తి చేసి ఉండాలి. మేథమెటిక్స్‌కు (మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్)(ఎంఏ/ఎమ్మెస్సీ); ఫిజిక్స్‌కు పీజీ(ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/ మెటీరియల్స్ సైన్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్); కెమిస్ట్రీకి పీజీ(కెమిస్ట్రీ/అప్లయిడ్ కెమిస్ట్రీ) పూర్తిచేసి ఉండాలి. విభాగాన్ని అనుసరించి డీఎస్‌టీ/డీఏఈ/ఎన్‌బీహెచ్‌ఎం/ఇన్‌స్పయిర్/యూజీసీ/సీఎస్ఐఆర్ ఫెలోషిప్ అర్హత ఉండాలి. గేట్/యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/క్యాట్/ఏఐఎంఏ/ఎక్స్‌ఏటీ/మ్యాట్/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఫెలోషిప్

- మొత్తం 146 ఫుల్ టైమ్ హెచ్‌టీఆర్ఏ ఫెలోషిప్స్‌తోపాటు విశ్వేశ్వరాయ పీహెచ్‌డీ స్కీమ్ కింద ఎలక్ట్రానిక్స్ & ఐటీ విభాగాల్లో మరో 5 ఫెలోషిప్స్ ఉన్నాయి.
- ఫుల్ టైం ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం అయిదేళ్లపాటు ఫెలోషిప్ అందిస్తారు. మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; తరవాత మూడేళ్లు నెలకు రూ.42,000 ఇస్తారు. అభ్యర్థులు వారానికి ఎనిమిది గంటలపాటు రీసెర్చ్ గైడ్‌గా వ్యవహరిస్తూ హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ సూచనల ప్రకారం అకడమిక్ వర్క్ పూర్తి చేయాల్సి ఉంటుంది. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి పీఎంఆర్ఎఫ్ ఫెలోషిప్ వర్తిస్తుంది.
- విశ్వేశ్వరాయ ఫెలోషిప్ కింద మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; తరవాత మూడేళ్లు నెలకు రూ.43,750 ఇస్తారు. హాస్టల్ సౌకర్యం లభించని వారికి ఫెలోషిప్ మొత్తంలో 16 శాతాన్ని రీయింబర్స్‌మెంట్ ఆఫ్ రెంట్(ఆర్ఓఆర్)గా ఇస్తారు. రీసెర్చ్ కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1.2 లక్షలు; ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సపోర్ట్ కింద రూ.1.5 లక్షలు చెల్లిస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 11
- **రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** జూన్ 20 నుంచి 30 వరకు
- **వెబ్‌సైట్:** nitt.edu

ఐఐఎస్‌డబ్ల్యూబీఎంలో ఎంఎస్‌డబ్ల్యూ

కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఐఐఎస్‌డబ్ల్యూబీఎం)- 'మాస్టర్స్ ఇన్ సోషల్ వెల్ఫేర్(ఎంఎస్‌డబ్ల్యూ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా క్లాస్ రూమ్ సెషన్స్, ప్రజంటేషన్స్, సెమినార్లు, సమ్మర్ ఇంటర్న్‌షిప్, ఫీల్డ్ వర్క్స్ ఉంటాయి. ఇది డ్యూయెల్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్. రిటెన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి యూనివర్సిటీ ఆఫ్ కోల్‌కతా డిగ్రీని ప్రదానం చేస్తుంది.

స్పెషలైజేషన్‌లు: చైల్డ్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, కరెక్షనల్ సోషల్ వర్క్, కమ్యూనిటీ ఆర్గనైజేషన్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాక్టీసెస్, లేబర్ వెల్ఫేర్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఇంజనీరింగ్ సహా ఏదేని ప్రొఫెషనల్ డిగ్రీ/అయిదేళ్ల ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.700
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **రిటెన్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 28
- **రిటెన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూలు:** జూలై 10, 11
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 12
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 28 నుంచి
- **వెబ్‌సైట్:** www.iiswbm.edu

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఆఫీస్ ఆటొమేషన్ అండ్ అసిస్టివ్ టెక్నాలజీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని పర్సన్ విత్ ఇంటలెక్చువల్ డిజెబిలిటీ, ఆటిజం స్పెక్ట్రం డిజార్డర్, మెంటల్ ఇల్‌నెస్, స్పెసిఫిక్ లెర్నింగ్ డిజెబిలిటీ, మల్టిపుల్ డిజెబిలిటీస్ కేటగిరీలకు ప్రత్యేకించారు. దీనికి తిరుచిరాపల్లిలోని భారతీదాసన్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిఫరెంట్లీ ఏబుల్డ్ పర్సన్స్ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 10 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎగ్జామ్‌కు సంబంధించిన మోడల్ పేపర్లను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. చెన్నై క్యాంపస్‌లో స్టడీ సెంటర్ ఉంది.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూన్ 15
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, అభ్యర్థి ఫొటో, కమ్యూనిటీ సర్టిఫికెట్, డిజెబిలిటీ సర్టిఫికెట్
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/1DWg1oeలో చదవండి.



కేదార్‌నాథ్‌లో తలైవా



నటుడిగా తను ఎంత బిజీగా ఉన్నా మధ్యలో వీలు చూసుకుని హిమాలయాలకు వెళ్లడం తలైవా రజనీకాంత్‌కు అలవాటు. కొన్ని రోజులు అక్కడే ధ్యానంలో గడుపుతుంటారు. అలాగే మే 29న ఆయన ఉత్తరాఖండ్ వెళ్లి కేదార్‌నాథ్, బదరీనాథ్ ఆలయాలు సందర్శించారు. ఈ సందర్భంగా ఉత్తరాఖండ్ పోలీసులు ఆయనకు స్వాగతం పలికి, దర్శనానికి ఏర్పాట్లు చేశారు. కేదార్‌నాథ్‌లో రజనీకాంత్ ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

సిద్ధమవుతున్న హరిహర వీరమల్లు



పవన్‌కల్యాణ్ తన కెరీర్‌లో తొలిసారిగా చేస్తున్న హిస్టారికల్ ఎపిక్ వారియర్‌మూవీ 'హరిహర వీరమల్లు'. 17 వ శతాబ్దంలో పేదల కోసం పోరాడిన యోధుడి పాత్రను ఆయన ఇందులో పోషిస్తున్నారు. క్రిష్ జాగర్లమూడి పర్యవేక్షణలో దర్శకుడు జ్యోతికృష్ణ బ్యాలెన్స్ షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేయబోతున్నారు. భారీ బడ్జెట్‌తో ఎ.ఎం.రత్నం ఈ సినిమా నిర్మిస్తున్నారు. భారతదేశంలోనే అత్యంత డిమాండ్ ఉన్న సినిమాటోగ్రాఫర్ మనోజ్ పరమహంస 'హరిహర వీరమల్లు' చిత్రానికి వర్క్ చేయనున్నారు. త్వరలోనే షూటింగ్‌ను ప్రారంభించే పనిలో నిర్మాత ఉన్నారు. ప్రస్తుతం లొకేషన్ల కోసం రెక్కీ నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకూ షూట్ చేసిన సన్నివేశాలకు సంబంధించిన వీఎఫ్ఎక్స్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ను కూడా శరవేగంతో పూర్తి చేస్తున్నారు. ఈ ఏడాది చివరికి 'హరిహర వీర మల్లు' పార్ట్ వన్ 'స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్'ను విడుదల చేయడానికి నిర్మాత సన్నాహాలు చేస్తున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో బాబీ డియోల్, సునీల్, నోరా ఫతేహి కీలక పాత్రలు పోషిస్తున్నారు.

యాక్షన్ ప్యాక్డ్ మూవీ

వైవిధ్యమైన చిత్రాలతో తెలుగు నాట అభిమానులను సంపాదించుకున్నారు తమిళ హీరో విజయ్ ఆంటోని. ఇప్పుడు ఆయన 'తుఫాన్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. ఈ నెల్లోనే



ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా విజయ్ ఆంటోని మాట్లాడుతూ 'తుఫాన్' యాక్షన్ ప్యాక్డ్ మూవీ. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది' అన్నారు. దర్శకుడు విజయ్ మిల్టన్ మాట్లాడుతూ "తుఫాన్' సినిమా కోసం రెండేళ్లు కష్టపడ్డాం. ఒక దీవిలో జరిగే కథ ఇది. హీరో క్యారెక్టరైజేషన్ సరికొత్తగా ఉంటుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అని చెప్పారు. ఈ చిత్రాన్ని కమల్ బోరా, డి. లలిత నిర్మిస్తున్నారు. సంగీతం: అచ్చు రాజమణి, విజయ్ ఆంటోని.



బ్లాక్‌బస్టర్ గ్యారంటీ

శర్వానంద్

"మనమే' చిత్రం మ్యాజికల్ బ్లాక్ బస్టర్. ఈ సారి కుమ్మేశాం. ఇది రాసి పెట్టుకోండి. ఈ నెల 7న థియేటర్లలో కలుద్దాం. ఇది కుటుంబం అంతా కలసి ఎంజాయ్ చేస్తూ చూసే సినిమా. 'శతమానం భవతి' కన్నా పెద్ద హిట్ అవుతుంది. మిమ్మల్ని ఏమాత్రం నిరాశపరచదు' అని శర్వానంద్ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'మనమే'. కృతిశెట్టి కథానాయిక. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ నెల 7న విడుదలవుతోంది. శనివారం చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా శ్రీరామ్ ఆదిత్య మాట్లాడుతూ 'ట్రైలర్‌లో మీరుచూసింది కొంచెమే. 'మనమే' అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది. మీ తల్లితండ్రులకు చూపించండి. ఈ సారి కొత్త శర్వాను చూడబోతున్నారు. కృతి తన నటనతో ఇరగదీసింది' అన్నారు. సినిమాలో ఎమోషన్స్‌తోపాటు ఎంటర్‌టైన్‌మెంట్ ఉంది అని కృతిశెట్టి చెప్పారు. ఈ సినిమా మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్, ప్రేక్షకులు ఆదరించాలి అని వివేక్ కూచిభొట్ల కోరారు.

డూప్ లేకుండా కాజల్ యాక్షన్ సీక్వెన్స్ చేశారు

- సుమన్ చిక్కాల



'ఎమోషన్, యాక్షన్ అంశాలతో 'సత్యభామ' చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. యాక్షన్ పార్ట్ కోసం కాజల్ అగర్వాల్ ఎంతో కష్టపడ్డారు. చాలా ధైర్యంగా స్టంట్స్ చేశారు' అని దర్శకుడు సుమన్ చిక్కాల అన్నారు. కాజల్ అగర్వాల్ పోలీసాఫీసర్‌గా నటించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సుమన్ మీడియాతో మాట్లాడారు.

- సినిమాలపై ఆసక్తి ఉండడంతో ఉద్యోగం చేస్తూనే చిత్రపరిశ్రమలో అవకాశాల కోసం ప్రయత్నించాను. దర్శకుడు శశికిరణ్ తీసిన కొన్ని సినిమాలకు పనిచేశాను. ఆయన ఈ సినిమాకు దర్శకుడిగా నాకు అవకాశం ఇచ్చారు. కొంతమంది పోలీసుల జీవితాల్లో జరిగిన సంఘటనల ఆధారంగా కథ రాసుకున్నాను.
- అయితే 'సత్యభామ' కథ రాయడం పూర్తయ్యాక లీడ్‌రోల్‌లో ఎవరైనా హీరోయిన్ చేస్తే బావుంటుంది అనుకున్నాం. కాజల్ కథ వినగానే 'ఎస్' చెప్పారు. డూప్ లేకుండా యాక్షన్ సీక్వెన్స్‌లు చేశారు. సత్యభామ తన దగ్గరకు వచ్చిన ఒక కేసును పర్సనల్‌గా తీసుకుంటుంది. ఎమోషనల్ అవుతుంది. బాధితురాలికి న్యాయం చేసేందుకు ఎలాంటి పోరాటానికైనా సిద్ధమవుతుంది. పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కాజల్ ప్రేక్షకులను ఆకట్టుకుంటారు. నవీన్ చంద్ర కీలకపాత్ర పోషిస్తున్నారు.

ఆ విల్లాలో ఏం జరిగింది?



విజయ్, శీతల్ భట్ జంటగా నటించిన 'విల్లా 369' చిత్రం షూటింగ్ పూర్తయింది. సురేశ్ ప్రభు దర్శకత్వం వహించారు. ' ఆ విల్లాలో ఏం జరిగింది అనే థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో చిత్రాన్ని రూపొందించాం. సెన్సార్ పూర్తి చేసి, త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం. టీజర్, ట్రైలర్ కూడా రిలీజ్ చేస్తాం' అని ఆయన చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: మహావీర్, ఫొటోగ్రఫీ: ఎస్.కె.రఫీ, లైన్ ప్రొడ్యూసర్: శీలం ప్రణయ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: ఎం.లక్ష్మణ్‌బాబు, చిత్రం శ్రీను.

పిల్లలతో విహార యాత్ర



తమిళ దర్శకుడు విఘ్నేశ్ శివన్, హీరోయిన్ నయనతార దంపతులు తమ ఇద్దరు పిల్లలతో ప్రస్తుతం హాంకాంగ్ పర్యటనలో ఉన్నారు. డిస్నీల్యాండ్ రిసార్ట్‌లో దిగిన ఫొటోలను విఘ్నేశ్ షేర్ చేస్తూ 'పన్నెండేళ్ల క్రితం 'పోడా పోడీ' షూటింగ్ కోసం ఇక్కడికి వచ్చాను. అప్పుడు నా దగ్గర వెయ్యి రూపాయలే ఉన్నాయి. షూస్ కూడా లేవు. చెప్పులతో ఈ ప్రదేశమంతా తిరిగా. ఇప్పుడు నా భార్య, పిల్లలతో ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉంది' అంటూ పేర్కొన్నారు.

హనీమూన్ సాంగ్



చైతన్యరావు, హెబ్బాపటేల్ జంటగా నటించిన రొమాంటిక్ ఎంటర్టైనర్ 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. సుహాసినీ, తనికెళ్ల భరణి కీలకపాత్రలు పోషిస్తున్నారు. బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాల రాజ్ నిర్మించారు. శనివారం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' టైటిల్ సాంగ్‌ను దర్శకుడు కె. రాఘవేంద్రరావు చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'దర్శకుడు బాల మంచి టైటిల్‌తో ఈ చిత్రాన్ని నిర్మించారు. టైటిల్ సాంగ్ చాలా బావుంది. ఈ సినిమా మంచి విజయం అందుకోవాలి' అని ఆకాంక్షించారు. పాప్ సింగర్ స్మార్తి జితేందర్ ఈ టైటిల్ పాటను స్వరపరిచి, ఆలపించారు. ఈ చిత్రానికి సంగీతం : కల్యాణి మాలిక్, సినిమాటోగ్రఫీ: శిష్టా వీఎంకే







అలనాటి కథ

హైదరాబాద్‌లో వైస్రాయ్ పర్యటన

కొన్ని సంఘటనలు మనో ఫలకంపై చెరగని జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. ఈ మధ్య పాత ఆల్బమ్స్ చూస్తుంటే... వైస్రాయ్ లార్డ్ ఇర్విన్, ఆయన భార్య లేడీ ఇర్విన్ హైదరాబాద్ పర్యటన ఫొటోలు కనిపించాయి. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యానికి మన దేశంలో ప్రతినిధి అయిన వైస్రాయ్‌కు ఆ రోజుల్లో విశేషమైన పలుకుబడి ఉండేది. ఆయనను కలవడానికి రాజులు, మహారాజులు పోటీ పడేవారు.

లార్డ్ ఇర్విన్ పర్యటనకు ముందే హైదరాబాద్ నగరమంతా ముస్తాబయింది. ఆయన రాక కోసం వేచి చూస్తోంది. హవేలీలకు, ప్యాలెస్‌లకు కొత్తగా రంగులు వేయించారు. కొత్త ఫర్నీచర్ కొన్నారు. తమ వద్ద ఉన్న ఇంగ్లీషు వంటవారితో రకరకాల పాశ్చాత్య ఆహార పదార్థాలు వండటం సాధన చేయించారు. ఇక బహిరంగ ప్రదేశాల విషయానికి వస్తే... వీధి దీపాలన్నిటినీ శుభ్రం చేయించారు. వీధులన్నిటినీ కడిగించారు. ఆయన ప్రయాణించే రోడ్ల చుట్టుపక్కల ఎక్కడా తుప్పలు లేకుండా శుభ్రపరిచారు. వైస్రాయ్‌కు... ఆయన కుటుం



బానికి నాంపల్లి రైల్వే స్టేషన్‌లో స్వాగతం చెప్పటానికి నిజాం తానే స్వయంగా వెళ్లారు. ఆ రోజుల్లో అది చాలా అరుదైన సంఘటన. సాధారణంగా నిజాంను కలవటానికి అందరూ ఆయన ప్యాలెస్‌కే వచ్చేవారు. నిజాం ఎవరికైనా స్వాగతం చెప్పాలన్నా... ఆయన ప్యాలెస్‌లోనే చెప్పేవారు. అలాంటిది వైస్రాయ్‌కు స్వాగతం పలకడానికి నిజాం స్వయంగా వస్తున్నారనే వార్త హైదరాబాద్‌లో సంచలనంగా మారింది. నిజాం స్వాగతం చెబుతున్నాడంటే... వస్తున్న అతిథి ఇంకెంత గొప్పవాడోనని ప్రజలు గుసగుసలాడుకున్నారు. నాన్న (రాజా ధన్‌రాజ్ గిర్) కూడా వైస్రాయ్‌కు స్వాగతం చెప్పటానికి వెళ్లిన జ్ఞాపకం. నాంపల్లి స్టేషన్‌లో వైస్రాయ్ ప్రయాణించే ప్రత్యేక ట్రైన్ కోసం అందరూ ఎదురుచూశారట. వచ్చిన తర్వాత పుర ప్రముఖులందరినీ వైస్రాయ్‌కు నిజాం పరిచయం చేశారు. ఆ తర్వాత ఆయన ఫలక్‌నుమా ప్యాలెస్‌కు వెళ్లారు. దారి పొడుగునా ప్రజలందరూ ఘన స్వాగతం పలికారు.

వైస్రాయ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో విడిది చేశారు. ఆయన పరివారం కూడా చాలా పెద్దదే. ఒక రోజు ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ఎట్‌హోమ్ ఏర్పాటు చేశారు. దానికి

కింగ్ జార్జి ఢిల్లీలో దర్బార్ నిర్వహించినప్పుడు... భారత ఉపఖండంలో ఉన్న రాజులు, మహారాజులు అందరూ తమ హోదాకు తగ్గట్టుగా తయారై వచ్చారు. ఆ దర్బారు సమయంలో నిజాంకు సంబంధించిన ఒక చిన్న కథను మా చిన్నప్పుడు చెబుతూ ఉండేవారు. కింగ్ జార్జి దర్బార్‌కు బ్రిటిష్ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ చేసింది. రాజులు, మహారాజులందరికీ వారి వారి హోదాలకు తగ్గట్టుగా సీట్లు కేటాయించారు. నిజాం ఒక ఏనుగుపై వచ్చి కింగ్ జార్జికి అభివాదం చేయాలి. కానీ ఆ రోజు నిజాం ఎక్కాల్సిన ఏనుగు మోకాళ్ల మీద కూర్చోవటానికి మొరాయించింది. దీంతో నిజాం చాలాసేపు ఏనుగు అంబారీ ఎక్కలేకపోయాడు. దీనివల్ల నిజాం దర్బారుకు ఆలస్యంగా వెళ్లాడు. అంతే కాదు... నిజాం వజ్ర వైఢూర్యాలు ధరించలేదు. కానీ ఆయన భార్య, ఇతర రాజ సిబ్బంది అమూల్యమైన ఆభరణాలు ధరించారు. అక్కడకు వచ్చిన ఒక మహారాజు నిజాం దగ్గరకు వచ్చి... "మీరు ఆభరణాలు ధరించలేదు" అన్నాడట. అప్పుడు నిజాం ఆయనతో... "నా వెనుక చూడు" అన్నాడట. ఇది ఆ రోజుల్లో విస్తృత ప్రచారంలో ఉండేది.



రాజ కుటుంబాల వారందరినీ ఆహ్వానించారు. మేమందరం ఎట్‌హోమ్‌కు వెళ్లాం. వైస్రాయ్ వెళ్లిపోయిన తర్వాత చాలా కాలం వరకూ అందరి సంభాషణల్లో ఆ పర్యటనకు సంబంధించిన మాటలే వినవచ్చేవి. వైస్రాయ్ పర్యటన తర్వాత కొన్ని రాజ కుటుంబాల జీవన విధానంలో మార్పులు వచ్చాయి. ఇంగ్లీషు ఫర్నీచర్, ఇంగ్లీషు వంటకాలు, ఇంగ్లీషు పాత్రలు ఇళ్లలోకి ప్రవేశించాయి. 1946లో మనకు స్వాతంత్ర్యం రాక ముందు లార్డ్ మౌంట్ బాటెన్‌ను కూడా కలిసే అవకాశం నాకు కలిగింది.

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/6tYjFgL లో చదవండి.

సండే సెలబ్రిటీ

'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమాలో సీత పాత్ర ద్వారా ప్రేక్షకులకు దగ్గరైన నటి అంజలి. కొద్దికాలం విరామం తర్వాత 'గీతాంజలి మళ్లీ వచ్చింది', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమాలతో రీ ఎంట్రీ ఇచ్చిన ఆమెను 'నవ్య' పలకరించింది. ఆ విశేషాలలోకి వెళ్తే...

మంచి పాత్ర చేస్తే ఆ కిక్కే వేరు



మీ సినిమా జర్నీ ఎలా అనిపిస్తోంది?

చాలా బావుంది. ప్రస్తుతం ఒక మంచి దశలో ఉన్నా. నాకు నచ్చే పాత్రలను ఎంపిక చేసుకుంటున్నా. అదృష్టవశాత్తు ప్రేక్షకులు కూడా వాటిని చూసి ఆదరిస్తున్నారు. 'గీతాంజలి మళ్లీ వచ్చింది', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' వంటి సినిమాలకు మంచి ఆదరణ లభించింది.

రీ ఎంట్రీ ఎప్పుడైనా కష్టమే.. మీకు ఎలా అనిపించింది?

నిజమే! రీ ఎంట్రీ చాలా కష్టమైన విషయం. రెండోసారి ప్రవేశించి విజయం సాధించటం కూడా చాలా కష్టమే! రీ ఎంట్రీకి ముందు - 'భవిష్యత్తులో నేను వెనక్కి తిరిగి చూసుకుంటే- నేను చేసే పాత్రలు నన్ను సంతృప్తి పరచాలి' అనుకున్నా. అందుకే చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటున్నాను. ఇది నాలో వచ్చిన ఒక గుణాత్మకమైన మార్పు.

ఒకప్పటి అంజలికి.. ఇప్పటి అంజలికి తేడా ఏమిటి?

ఇంతకు ముందు కన్నా ఇప్పుడు బాగా ఆలోచించగలుగుతున్నా. స్పష్టత వచ్చిన తర్వాతే ఏ విషయంపైనైనా నిర్ణయం తీసుకుంటున్నా. దీనివల్ల నేను చేసే పనిలో కూడా స్పష్టత వస్తోంది. షూటింగ్ నుంచి ఇంటికి వెళ్లిన తర్వాత - "ఈ రోజు నేను ఈ మంచి పాత్రలో నటించా" అనుకోగలుగుతున్నా. నిజంగా చెబుతున్నా. ఒక మంచి పాత్రను చేస్తే వచ్చే కిక్కే వేరు.

మీరు ఎమోషనల్ పర్సనేనా?

నేను చాలా ఎమోషనల్ పర్సన్. చిన్నప్పటి నుంచి సున్నితంగా ఉండేదాన్ని. మనసులో ఉండే మాటలు బయటకు చెప్పేదాన్ని. అందరినీ నమ్మేదాన్ని. చాలా మంది అలాంటి లక్షణాలు తప్పు అనుకుంటారు. కానీ నా వరకు నేను ఆ లక్షణాలు మంచివే అనుకుంటాను.

చిన్నప్పుడు ఎక్కువ అల్లరి చేసేవారా?

నేను చిన్నప్పుడు రాజోలులో పెరిగాను. అప్పుడు కూడా చాలా అల్లరి చేసేదాన్ని. ఇప్పటికీ అంతే! 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమా సెట్స్‌లో కూడా సందడిగా ఉండేదాన్ని. ఈ విషయాన్ని హీరో విశ్వక్‌సేన్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో చెప్పారు కూడా. చిన్నప్పుడు నేను ఫ్రెండ్స్‌తో ఎక్కువ సమయం గడిపేదాన్ని. సెట్స్‌లో నేను వీలైనంత సందడిగా ఉంటా. ఇది నా చిన్నతనపు లక్షణమనే చెప్పాలి.

చిన్నప్పుడు ఎప్పుడైనా నటి అవ్వాలని అనుకున్నారా?

చిన్నప్పుడు స్కూలులో చదివే సమయంలో టామ్‌బాయ్‌లా ఉండేదాన్ని. టీచర్లు ఎప్పుడైనా- "నువ్వు పెద్దయిన తర్వాత ఏమి అవుతావు?" అని అడిగితే- 'నటిని అవుతా'నని చెప్పేదాన్ని. కొద్దిగా పెద్దయిన ఆ ఆలోచన బలపడింది. ఇక ఇండస్ట్రీకి వచ్చిన తర్వాత- నటి కావటం అంత సులభం కాదని అర్థమయింది. అనేక పాఠాలు నేర్చుకున్నా.

పోలోతో ఆడుకుంటా...

ఖాళీగా ఉన్న సమయంలో నా కుక్క పోలోతో గడుపుతూ ఉంటా. నాకు సినిమాలు చూడటమంటే చాలా ఇష్టం. ఇక నా ప్రాజెక్టుల విషయానికి వస్తే త్వరలోనే 'గేమ్ ఛేంజర్' వస్తుంది. దీనిలో పాత్ర కూడా చాలా ఛాలెంజింగ్‌గా అనిపించింది. ప్రేక్షకులకు చాలా నచ్చుతుంది.

నటీనటులకు సంబంధించిన చిన్న విషయాలు కూడా పెద్దవి చేసి చూపిస్తూ ఉంటారు కదా... మీకెలా అనిపిస్తుంది?

ప్రతి ఇండస్ట్రీలోను మంచి, చెడులు ఉంటాయి. కానీ అందరూ సినిమా ఇండస్ట్రీ వైపే చూస్తూ ఉంటారు కాబట్టి చిన్న విషయం కూడా బాగా పెద్దదిగా బ్లో అవుట్ అవుతుంది. చెడు విషయాలు అందరినీ త్వరగా ఆకర్షిస్తాయి కాబట్టి - మీడియా, సోషల్ మీడియా కూడా వాటిపైనే దృష్టి పెడతాయి. ఒక గాడ్‌ఫాదర్ లేకుండా ఇండస్ట్రీలో ఎదగటం అనేది చాలా కష్టం. ఎందుకంటే మొత్తం బాధ్యతంతా మన భుజాలపైనే ఉంటుంది. తీసుకొనే ప్రతి నిర్ణయానికి మనమే బాధ్యులమవుతాం! ఏ సినిమా చేయాలి, ఏ సినిమా చేయకూడదు, ఏ సినిమా చేస్తే ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందన వస్తుంది? లాంటి ప్రశ్నలు అనుక్షణం ఉత్పన్నమవుతూనే ఉంటాయి. వీటికి సరైన సమాధానాలు కనుగొన్నప్పుడు మనం ఇండస్ట్రీలో నిలదొక్కుకోగలుగుతాం. ఒక మంచి పాత్ర చేస్తే దాని మొత్తం క్రెడిట్ అంతా మనకే దక్కుతుంది. చెడు పాత్ర అయినా అంతే! అందువల్ల వీలైనంత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంటుంది.



అనవసరంగా పెద్దది చేశారు...

'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో ఒక చిన్న సంఘటనపై అనవసర రాద్ధాంతం చేశారు. ఆ స్టేజీ మీద ఏం జరిగిందనే విషయం మాకు తెలుసు. బాలయ్య నన్ను కొద్దిగా జరగమని తోసారు. నేను వెంటనే నవ్వేసాను. దాన్ని సోషల్ మీడియాలో అనవసరంగా పెద్దది చేశారు. బాలయ్య నాకు 'డిక్టేటర్' సినిమా నుంచి తెలుసు. ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో కూడా ఆయన - "నాకు అంజలికి ఎనర్జీ మ్యాచ్ అవుతుంది. మా భావాలు మొహంలో తెలిసిపోతాయి" అన్నారు కూడా! ఇది చాలా చిన్న సంఘటన. సోషల్ మీడియాలో అనవసరపు సంఘటనలు ఎలా వైరల్ అవుతాయో చెప్పటానికి ఇదొక ఉదాహరణ.

ఒక సమయంలో మీరు సినిమాలు మానేసినప్పుడు అనేక వదంతులు వచ్చాయి కదా... వాటిపై ఎప్పుడైనా బాధపడ్డారా?

కొన్ని సంవత్సరాల ముందు ఇలాంటి విమర్శలన్నింటినీ సీరియస్‌గా తీసుకొనేదాన్ని. నా గురించి ఇలా ఎందుకు రాస్తున్నారని బాధపడేదాన్ని. తర్వాత నాకు ఒక విషయం అర్థమయింది. మంచి అయినా చెడు అయినా మన గురించి రాస్తున్నారంటే- ప్రజలకు మనపై ఆసక్తి ఉన్నట్లే! ప్రజలు మనని మర్చిపోలేదని అర్థం. ఇలా ఆలోచించటం మొదలుపెట్టిన తర్వాత ప్రశాంతత ఏర్పడింది. అంతేకాదు... గతం గడిచిపోయింది. సినిమాలు మానేయటం, మళ్లీ రావటం కూడా అయిపోయింది. ఇప్పుడు గతం గురించి ఎక్కువగా మాట్లాడటం నాకు ఇష్టం లేదు.

మీరు స్క్రిప్ట్స్ ఎలా ఎంపిక చేసుకుంటారు?

స్క్రిప్ట్ పూర్తిగా నా ఛాయిస్సే. నేనే ఎంపిక చేసుకుంటా. నాకు వచ్చిన పాత్రల్లో నేను ఒదిగిపోగలనా? అని ఆలోచిస్తా. స్క్రిప్ట్ చదివిన వెంటనే నాకు ఒక థ్రిల్ రావాలి. ఎందుకంటే- షూటింగ్ జరిగినన్ని రోజులు నేను ఆ పాత్రలోనే జీవించాలి కాబట్టి. నేను ఎంజాయ్ చేయగలిగిన పాత్రల్లో ఉండే ఎనర్జీ ప్రేక్షకులకు స్పష్టంగా తెలుస్తుందని నేను నమ్ముతాను.

బాగా వచ్చింది..

'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమా చాలా బాగా వచ్చింది. ప్రేక్షకులు బాగా మెచ్చుకుంటున్నారు. చాలారోజుల తర్వాత మొదటి రోజు మార్నింగ్ షోలకు ప్రేక్షకులు వచ్చారు. రత్నమాల నాకు చాలా నచ్చిన పాత్ర. కొన్ని పాత్రలు ప్రేక్షకుల మనస్సులో నిలిచిపోతాయి. రత్నమాల అలాంటి క్యారెక్టర్. ఈ పాత్ర చేసే సమయంలో చాలా ఎంజాయ్ చేశాం. ఈ పాత్ర నన్ను ఛాలెంజ్ చేసింది. నేను ప్రేక్షకులతో కలిసి సినిమా చూశా! అందరూ బాగా ఎంజాయ్ చేస్తున్నారు.

సోషల్ మీడియాను ఫాలో అవుతారా?

నేను సోషల్ మీడియా ఫాలో అవుతాను. అయితే దీన్ని ఒక సాధనంగా మాత్రమే చూస్తాను. నా ప్రేక్షకులకు నేను చెప్పదలుచుకున్న విషయాన్ని చెప్పటానికి మాత్రమే వాడతాను. ఏదో ఒక విషయం చెప్పి.. దానిపై వివాదం వస్తే... దాన్ని విశ్లేషించడం, మళ్లీ వివరణ ఇవ్వడం... ఇలా ఉపయోగించను. నా ఉద్దేశంలో కరెక్ట్‌గా వాడే వారికి మంచిదే. అదే జీవితమనుకొని.. నెగిటివిటీని వ్యాపింపచేయటం మాత్రం సరైనది కాదు. చాలా సందర్భాలలో మొత్తం స్టోరీ చెబితే తప్ప- అసలు విషయం మనకు అర్థం కాదు.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

దళితులు, మైనారిటీలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ప్రధానికి లేఖ రాయడం కావచ్చు... 'కేన్స్ ఫిలిం ఫెస్టివల్'లో... పుచ్చకాయను పోలి ఉన్న బ్యాగ్ ధరించి... పాలస్తీనియన్లకు సంఘీభావం ప్రకటించడం కావచ్చు... తన భావాలను స్పష్టంగా వ్యక్తం చెయ్యడంలో నటి కని కుశ్రుతికి ఎలాంటి సంకోచం ఉండదు. అలాగే ఎంచుకున్న పాత్రకు ప్రాణం పొయ్యడంలోనూ తనకు తిరుగులేదని నిరూపించుకున్నారు. 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్'లోని ప్రభ పాత్రలో ఆమె నటన అంతర్జాతీయంగా ప్రశంసలందుకుంది. తన గురించి, రంగస్థలం నుంచి వెండి తెర వరకూ దాదాపు రెండు దశాబ్దాల ప్రయాణం గురించి కని ఏం చెబుతున్నారంటే...

వెండితెరయినా.. ఏ వేదికైనా.. ఫైర్‌బ్రాండ్



"ప్రతి మనిషిలోనూ ఎన్నో కోణాలు ఉంటాయి. మన స్వభావంలో కొన్ని అంశాలు ఇతరులకు స్పష్టంగా కనిపిస్తూ ఉంటాయి. కానీ మనలో దానికి విరుద్ధమైన పార్శ్వం కొన్నిసార్లు బయటపడుతూ ఉంటుంది.... కనీసం మనకు బాగా సన్నిహితులైన వ్యక్తుల దగ్గర. నేను సరదా మనిషినని చెప్పలేను. కానీ ముక్కుసూటి మనిషినని మాత్రం చెప్పగలను. ఏదైనా నాకు నచ్చకపోతే... వెంటనే చెప్పేస్తాను. దీనికి కారణం నా తల్లితండ్రులు. కేరళలోని చెరువక్కళ్ అనే గ్రామంలో నేను పుట్టాను. మా అమ్మ జయశ్రీ వైద్యురాలు. నాన్న మైత్రేయి మైత్రేయన్ రచయిత, ఫొటోగ్రాఫర్. వాళ్ళిద్దరూ సామాజిక కార్యకర్తలు, హేతువాదులు. లోకంలో తారతమ్యాలు ఉండకూడదని పరితపించేవాళ్ళు. పేర్లలో రెండో భాగం సామాజిక స్థితిని సూచిస్తుంది కాబట్టి... వాటిని వదులుకున్నారు.నన్నూ అలాగే పెంచారు. కానీ పదోతరగతి బోర్డ్ ఎగ్జామ్‌కు దరఖాస్తు చేసినప్పుడు... సెకండ్ నేమ్ ఉండాల్సిందేనని స్కూల్ అధికారులు స్పష్టం చేశారు. ఇంటికి వచ్చి మా అమ్మకీ, నాన్నకీ చెప్పాను. "ప్రతి ఒక్కరూ అదే అడుగుతారెందుకూ? సెకెండ్ నేమ్ అంత ముఖ్యమా?" అన్నాను. దరఖాస్తులో తప్పనిసరి అని తెలుసు. చాలా పేర్లు చర్చించాం. చివరికి మా నాన్న కాజువల్‌గా ప్రస్తావించిన 'కుశ్రుతి' అనే మాట నాకు నచ్చింది. 'కుశ్రుతి' అంటే మలయాళంలో 'కొంటె, అల్లరి, తిక్క, చెడ్డ'... ఇలా చాలా అర్థాలున్నాయ్. ఆ తరువాత... నా అసలు పేరైన 'కని'ని వదిలేసి... అందరూ 'కుశ్రుతి' అనడం మొదలుపెట్టారు. ఆ పేరుకు అర్థం తెలిసిన కొందరు... "ఇది నిజంగా మీ పేరేనా?" అని అడుగుతూ ఉంటారు.

అమ్మపై ఒత్తిడి చేశారు...

తిరువనంతపురం కాలేజీలో చదువుతున్నప్పుడు... 'అభినయ థియేటర్ రీసెర్చ్ సెంటర్' (ఎడిఆర్‌సి)తో అనుబంధం ఏర్పడింది. అక్కడ చాలా విషయాలు నేర్చుకున్నాను. ఆ తరువాత త్రిసూర్ స్కూల్ ఆఫ్ డ్రామాలో థియేటర్ ఆర్ట్స్ ప్రోగ్రామ్, ఫ్రాన్స్‌లో రెండేళ్ళపాటు థియేటర్ ఎడ్యుకేషన్ కోర్సు చేశాను. మరోవైపు నాటకాలు కూడా వేసేదాన్ని. ఏడో శతాబ్దం నాటి సంస్కృత నాటిక 'భగవదజ్జుకమ్'ను ఎడిఆర్‌సి వారు దేశంలోని అన్ని రంగస్థల ఉత్సవాల్లో ప్రదర్శించేవారు. దానిలో 'వసంతసేన' పాత్రను దాదాపు ఆరేళ్ళపాటు పోషించాను. నా సినీరంగ ప్రవేశం... 2003లో ఒక చిన్న పాత్రతో మొదలైంది.2009లో విడుదలైన నా నాలుగో సినిమా 'కేరళ కేఫ్'తో నటిగా గుర్తింపు వచ్చింది. 2010లో వచ్చిన 'షికార్', 'కాకటెయిల్' సినిమాల్లో నా నటన విమర్శకుల మన్ననలందుకుంది. నిజానికి నటిని కావాలనే ఆలోచన నాకు ఎన్నడూ లేదు. రంగస్థలం నాకు చాలా ఇష్టం. కానీ నాకు డబ్బు అవసరం. నాటకాలకన్నా సినిమాల్లో ఎక్కువ డబ్బు వస్తుంది. కాబట్టే సినిమా అవకాశాలకు అంగీకరించాను. అయితే... తరచుగా లైంగిక వేధింపులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆఖరికి "మీ అమ్మాయిని ఒప్పించండి" అంటూ మా అమ్మ మీద కూడా కొందరు ఒత్తిడి చేయడాన్ని భరించలేకపోయాను. ఇక సినిమాల్లో నటించకూడదనే నిర్ణయానికి వచ్చాను.

అంతా కలలా ఉంది...

2016 నుంచి నాలుగేళ్ళు దాదాపుగా షార్ట్ ఫిలిమ్స్‌కే పరిమితమయ్యాను. నాకు బాగా పరిచయం ఉన్నవారు తీసిన రెండు మూడు సినిమాల్లో మాత్రం నటించాను. ఆ సమయంలోనే... దర్శకుడు సాజిన్ బాబు నాకొక కథ వినిపించి, 'ఖదీజా' అనే పాత్ర ఆఫర్ చేశారు. ఆ కథ, పాత్ర విషయంలో నాకు సందేహాలున్నా... వాటిని ఆయన తీర్చడంతో... 'ఓకే' అన్నాను. సినిమా పేరు 'బిరియానీ'. దానికి ఎన్నో అవార్డులు వచ్చాయి. కేరళ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ నటిగా, సౌత్ ఫిలిమ్ ఫేర్ అవార్డుల్లో బెస్ట్ యాక్ట్రెస్ (క్రిటిక్స్-మళయాళం)గా పురస్కారాలు స్వీకరించాను. మాస్కో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో.. ప్రధాన పాత్రలో అత్యుత్తమ నటన ప్రదర్శించిన నటిగా 'బ్రిక్స్ అవార్డ్'ను అందుకున్నాను. అప్పటినుంచి మంచి పాత్రలు నన్ను వెతుక్కుంటూ వచ్చాయి. 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్'లోని మళయాళీ నర్సు ప్రభ పాత్ర కూడా అలాంటిదే. ఆ స్క్రిప్ట్ చదివినప్పుడు... కవిత్వంలా అనిపించింది. ఆ కథ నా అంతరంగాన్ని స్పృశించింది. చిన్న బడ్జెట్ సినిమా. ప్రతి ఒక్కరం కష్టపడ్డాం. మా చిత్రం 'కేన్స్ చలన చిత్రోత్సవం' వరకూ వెళ్ళడం... 'గ్రాండ్ ప్రిక్స్' అవార్డు సాధించడం, మేము రెడ్ కార్పెట్ మీద నిలబడడం... ఇదంతా కలలా ఉంది. ఈ ఘనత దర్శకురాలు పాయల్ కపాడియాదే. "ప్రభ పాత్రలో మీరు ఒదిగిపోయార"ని సామాన్యుల నుంచి ప్రముఖుల వరకూ ఎందరో ప్రశంసలు కురిపిస్తున్నారు. "మమ్మల్ని మీలో చూసుకున్నాం" అంటూ నర్సుల నుంచి వస్తున్న ఫోన్లు... నాలో ఉద్వేగాన్ని కలిగిస్తున్నాయి.

వాటికి ప్రతిస్పందించాల్సిందే...

నేను కేన్స్ వేడుకలో... పుచ్చకాయ ఆకారంలోని హ్యాండ్ బ్యాగ్ ధరించి, రెడ్ కార్పెట్ మీద నడవడం మీద రకరకాల ప్రతిస్పందనలు వచ్చాయి. పుచ్చకాయ ముక్క... పాలస్తీనియన్ల ప్రతిఘటనకు చిహ్నం. వ్యక్తిగా నిర్దిష్టమైన సమస్యలపై ఎటువంటి వైఖరి తీసుకోవాలనేది నాకు తెలుసు. ఏక కాలంలో అనేక ఆందోళనకరమైన సంఘటనలు జరుగుతున్న ప్రపంచంలో మనం జీవిస్తున్నాం. తోటి మనుషులుగా మనం ప్రతిస్పందించాల్సిందేనని అనుకుంటాను. దేశంలోని మైనారిటీలు, దళితులపై జరుగుతున్న దాడులను నివారించాలనీ, ప్రభుత్వంతో ఏకీభవించనంతమాత్రాన జాతి వ్యతిరేకి, అర్బన్ నక్సలైట్ అనీ ముద్రలు వేయరాదనీ డిమాండ్ చేస్తూ 2019లో ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసిన నలభై తొమ్మిదిమందిలో నేనూ ఉన్నాను. అనురాగ్ కశ్యప్, కొంకణా సేన్ శర్మ, మణిరత్నం, శుభా ముద్గల్ తదితర సెలబ్రిటీలతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఆ లేఖపై సంతకాలు చేశారు. ఆ తరువాత నేను సోషల్ మీడియాలో తీవ్రమైన విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అలాగే... కేరళ ప్రభుత్వం నుంచి ఉత్తమ నటి అవార్డు అందుకోవడానికి వెళ్ళినప్పుడు... నేను పెదాలకు ఎర్రటి లిప్‌స్టిక్ రాసుకోవడం మీద సోషల్ మీడియాలో ఎగతాళి చేశారు. మన సమాజంలో నల్లటి మేని ఛాయ ఉన్నవారంటే చిన్న చూపు ఉంది. వారు లిప్‌స్టిక్ ధరించినప్పుడు దారుణమైన ట్రోలింగ్ ఎదుర్కోవాల్సి వస్తోంది. ఆ ధోరణిని నిరసించడానికే అలా లిప్‌స్టిక్ వేసుకున్నాను. సామాజిక అంశాలపై నా గళాన్ని విప్పడానికి ఎప్పుడూ సంకోచించను. కెరీర్ విషయానికి వస్తే... 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్' తర్వాత చాలామంది దర్శకులు నన్ను సంప్రదిస్తున్నారు. కాబట్టి మరిన్ని మంచి పాత్రలతో ప్రేక్షకుల్ని అలరించడానికి ఎదురు చూస్తున్నాను."

పేరెంటింగ్

పిల్లల ప్రవర్తన మూలాలు మనలోనే

పిల్లలు విసిగిస్తున్నారని వాళ్ల మీద కేకలేస్తాం! చిరాకు పడతాం, దండిస్తాం! కానీ వాళ్ల ప్రవర్తనను కొంత లోతుగా విశ్లేషిస్తే, వాటి మూలాలు మన ప్రవర్తనలోనే ఉన్నాయనే విషయాన్ని కనిపెట్టగలుగుతాం. పిల్లల ప్రవర్తన, వాటి అర్థాలను తెలుసుకుందాం!

• పిల్లలు పదే పదే డిస్టర్బ్ చేస్తున్నారా?: అయితే మీరు పిల్లల్ని ప్రేమగా దగ్గరికి తీసుకోవట్లేదని అర్థం.

శారీరక స్పర్శతో చూపించే ప్రేమ పిల్లల్లో సురక్షిత భావనను కలిగిస్తుంది. రోజులో ఒక్కసారైనా పిల్లలను ఒళ్లో కూర్చోబెట్టుకోవటం, హత్తుకోవటం, చేతులు పట్టుకుని మాట్లాడటం చేయాలి. ప్రేమను ఇలా వ్యక్తపరచటం వల్ల తల్లీబిడ్డల అనుబంధం బలపడుతుంది.

• పిల్లలు అబద్ధాలాడుతున్నారా?: అయితే పూర్వం వాళ్ల చేసిన తప్పులకు మీరు అతిగా స్పందించి ఉంటారు. చిన్న తప్పుకే విపరీతంగా స్పందించి పరుష పదజాలంతో దూషించటం, అవమానించటం చేస్తే పిల్లలు ఆ తరహా ధోరణిని భరించలేరు. అలాంటి పరిస్థితిని మళ్లీ ఎదుర్కొనే శక్తి లేక అబద్ధాలాడటానికి అలవాటు పడతారు. కాబట్టి పిల్లలు తప్పు చేస్తే అనునయంగా అడగాలి. కారణాన్ని వాళ్ల నుంచే రాబట్టాలి. మరోసారి అలా జరగకుండా చూసుకోమని సున్నితంగా చెప్పాలి. తిట్టడం, కొట్టడం వల్ల ప్రయోజనం శూన్యం.

• మీ పిల్లల్లో ఆత్మవిశ్వాసం లోపించిందా?: అయితే మీరు మీ పిల్లల్ని ఎక్కువ సలహాలిస్తూ, తక్కువగా ప్రోత్సహిస్తూ ఉండి ఉంటారు. ప్రతి చిన్న పనినీ పిల్లలకు నేర్పాల్సిన అవసరం లేదు. స్వయంగా ప్రయత్నం చేయనివ్వాలి. వాళ్లకి చేయబోయే పని గురించి, పదే పదే సలహాలిస్తే ఆసక్తి కోల్పోయే అవకాశమూ ఉంటుంది. ఆత్మవిశ్వాసమూ సన్నగిల్లుతుంది.



టోర్నీ పూర్తి షెడ్యూల్ ఆదివారం అనుబంధంలో..

నేటి మ్యాచ్‌లు | స్టార్ స్పోర్ట్స్‌లో..

అమెరికా X కెనడా
వేదిక: డాలస్ ఉ. 6 నుంచి

వెస్టిండీస్ X న్యూగిని
వేదిక: గయానా రా. 8 నుంచి













వచ్చేసింది క్రికెట్ తుఫాన్!

నేటి నుంచే టీ20 వరల్డ్‌కప్

20	జట్లు..	ఈనెల 29న ఫైనల్
55	మ్యాచ్‌లు..	
29	రోజులు	

ఎప్పటిలాగే ఫేవరెట్లు.. అంచనాలను తలకిందులు చేసే అండర్ డాగ్‌లు.. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని ఇట్టే మార్చేసే పవర్ హిట్టర్లు.. కీలక సమయంలో తడబడే చోకర్లు.. తమదైన వేళ మేటి జట్లకు షాకులిచ్చే పసికూనలు.. ఆఖరి బంతి వరకు నరాలు తెగే ఉత్కంఠ.. అనూహ్య ఫలితాలు.. పట్టరాని భావోద్వేగాల మహా సంగ్రామం టీ20 వరల్డ్‌కప్ వచ్చేసింది. అంతగా ఆదరణలేని అమెరికాలో.. బేస్‌బాల్ గోడలను బద్దలుకొట్టి.. క్రికెట్ జెండాను పాతే 20 జట్ల దండయాత్ర ఆదివారం ఆరంభం కానుంది.

న్యూయార్క్: ప్రపంచకప్ టైటిల్‌కు చేరువగా వచ్చి.. అంతలోనే దూరమవుతున్న భారత జట్టు ఈసారి కప్పుతోనే తిరిగి వెళ్లాలనుకొంటుండగా.. మరో ఐసీసీ టైటిల్‌ను సొంతం చేసుకొని అరుదైన రికార్డును దక్కించుకోవాలని ఆస్ట్రేలియా ఉవ్విళ్లూరుతోంది. పాకిస్థాన్, వెస్టిండీస్‌లు అనిశ్చితికి చెక్ పెట్టాలనుకొంటుండగా.. డిఫెండింగ్ చాంప్ ఇంగ్లండ్, సౌతాఫ్రికా కూడా ఫేవరెట్లలో ఒకటిగా బరిలోకి దిగుతున్నాయి. క్లాసెన్, మిల్లర్, డికాక్, రబాడ లాంటి ఆటగాళ్లున్న సఫారీ జట్టు.. ఈసారి ఎలాగైనా తమ 'చోకర్స్' ముద్రను తొలగించుకోవాలనే పట్టుదలతో ఉంది. ఇక, టీ20 ప్రపంచకప్‌లో 20జట్లు తలపడడం ఇదే తొలిసారి కాగా.. అందునా అమెరికాలో ఎంట్రీ ఇస్తుండడం ఈసారి మరింత ప్రత్యేకం. 29 రోజులపాటు సాగే ఈ పొట్టి కప్‌లో మొత్తం 55 మ్యాచ్‌లు జరగనున్నాయి. 16 మ్యాచ్‌లు యూఎ్‌సలో జరగనుండగా.. ఫైనల్ సహా 39 మ్యాచ్‌లు వెస్టిండీస్‌లో నిర్వహించనున్నారు. మొత్తం 20 జట్లు 4గ్రూపులుగా విడిపోయి తలపడుతున్నాయి. ప్రతి గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్-8కు అర్హత సాధిస్తాయి. సెమీఫైనల్స్ ఈనెల 26, 27న, ఫైనల్ 29న జరుగుతాయి.

భారత్‌కు పరీక్ష: 2013లో చివరిసారి ఐసీసీ ట్రోఫీ సాధించిన భారత్‌కు ఇది విషమ పరీక్ష. పైగా గత 12 నెలల్లో రోహిత్ కెప్టెన్సీలో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్, వన్డే వరల్డ్‌కప్ టైటిల్ ఫైట్‌లో టీమిండియా తుది మెట్టుపై చతికిల పడింది. అంతేకాకుండా గత రెండు పొట్టి కప్‌ల్లో కాలం చెల్లిన వ్యూహాలను అమలు చేసి ఘోరంగా విఫలమైంది. మరోసారి అలాంటి తప్పిదాలు తావులేకుండా చూసుకోవాలనుకొంటోంది. ఇటీవలే జరిగిన ఐపీఎల్‌లో బ్యాటర్లు సృష్టించిన విధ్వంసాన్ని స్ఫూర్తిగా తీసుకొని టీమిండియా చెలరేగాల్సి ఉంది. ఇక, స్పిన్నర్లకు సహకరించే కరీబియన్ పిచ్‌లపై ఎలా ఆడాలో మనోళ్లకు అవగతమే.

9న హైవోల్టేజ్

ప్రపంచకప్ అనగానే అందరికీ గుర్తొచ్చేది భారత్, పాక్ పోరు. టోర్నీకే హైలైట్‌గా నిలిచే ఈ హైవోల్టేజ్ ఫైట్ ఈనెల 9న న్యూయార్క్‌లోని నసౌ స్టేడియంలో జరగనుంది.



ట్రోఫీతో రోహిత్

3 ఈ టోర్నీలో మూడు సిక్సర్లు బాదితే.. అంతర్జాతీయ క్రికెట్ (మూడు ఫార్మాట్లలో కలిపి)లో 600 సిక్సర్లు పూర్తి చేసుకున్న తొలి ఆటగాడిగా రోహిత్ ప్రపంచ రికార్డు సృష్టిస్తాడు.

అందరికీ సవాలే..

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి ఈ ప్రపంచకప్ ఆఖరిదన్న వార్తలు వినిపిస్తుండడంతో.. ఇద్దరికీ ఈ టోర్నీ కీలకం కానుంది. అలాగే, ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్‌కు కూడా ఈ టోర్నీ ఎంతో ముఖ్యం. వన్డే వరల్డ్‌కప్ దారుణ ప్రదర్శనను మరువాలంటే.. ఇంగ్లండ్ ఈ టోర్నీలో అదరగొట్టాలి. అయితే, ఇంగ్లిష్ జట్టుకు భారత్, సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా నుంచి గట్టిపోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. ఆసీస్ కొత్త కెప్టెన్ మిచెల్ మార్ష్‌కు ఈ టోర్నీ అతి పెద్ద పరీక్ష కాగా.. వన్డే ప్రపంచకప్‌నకు అర్హత సాధించలేకపోయిన వెస్టిండీస్ సొంతగడ్డపై సత్తా చాటాలనుకొంటోంది. అనిశ్చితికి మారుపేరైన పాకిస్థాన్ జట్టు బ్యాటింగ్ ఈసారి ఆందోళన కలిగిస్తోంది. న్యూజిలాండ్ ఎప్పుడూ అండర్‌డాగ్ కాగా.. అఫ్ఘానిస్థాన్, నమీబియా, నెదర్లాండ్స్ టీమ్‌లు సంచలనం కోసం ఎదురుచూస్తున్నాయి. మొత్తంగా చూస్తే అంచనాలకు అందని టీ20 వరల్డ్ కప్.. థ్రిల్లింగ్ మ్యాచ్‌లతో ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించడం ఖాయం.

కరీబియన్లకు కనీస పోటీ ఇస్తారా..?



న్యూగిని జట్టు ఆటగాళ్లు



పావెల్

గయానా: సరికొత్తగా కనిపిస్తున్న ఆతిథ్య వెస్టిండీస్ జట్టు మూడో టైటిల్ కోసం తమ వేటను ఆరంభించనుంది. గ్రూప్ 'సి'లో భాగంగా ఆదివారం రాత్రి పసికూన పపువా న్యూగినియాతో తమ తొలి మ్యాచ్‌లో తలపడనుంది. ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించి ఊపు మీదున్న రోవ్‌మన్ పావెల్ సారథ్యంలోని విండీస్‌కు పపువా నుంచి కనీస పోటీ అయినా ఎదురవుతుందా? వేచి చూడాల్సిందే. కీలక ఆటగాళ్లు లేకపోయినా ఇటీవలే దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌ను సాధించిన విండీస్ ఈసారి తమ హార్డ్‌హిట్టర్లతో ప్రత్యర్థులను బెదరగొట్టాలనుకుంటోంది. 2016 ఫైనల్లో ఇంగ్లండ్‌పై ఆఖరి ఓవర్‌లో బ్రాత్‌వైట్ నాలుగు వరుస సిక్సర్లతో జట్టుకు రెండో టైటిల్ అందించాడు. కానీ ఆ తర్వాత కరీబియన్లు పేలవ ప్రదర్శనతో నిరాశపర్చగా, 2022 టోర్నీలోనైతే గ్రూప్ దశ నుంచే వెనుదిరిగింది. మరోవైపు 'గ్రూప్ ఎ'లో ఉన్న ఆతిథ్య యూఎస్ జట్టు కెనడాతో ఆదివారం ఉదయం తలపడనుంది. 184 ఏళ్ల తర్వాత ఇరు జట్ల మధ్య అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ జరుగబోతుండడం విశేషం. అలాగే రెండు జట్లకిదే తొలి టీ20 వరల్డ్‌కప్.

క్రికెట్‌కు దినేశ్ వీడ్కోలు



న్యూఢిల్లీ: వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ రెండు దశాబ్దాల క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు అధికారికంగా ప్రకటించాడు. ఇటీవలే ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పిన తను భారత జట్టు తరఫున ఆఖరిసారి 2022 టీ20 వరల్డ్‌కప్‌లో ప్రాతినిధ్యం వహించాడు. 'కొన్ని రోజులుగా అన్ని వైపుల నుంచి నాపై అభిమానం, ఆప్యాయత, మద్దతు కనబరుస్తున్నారు. ఇక అన్ని రకాల క్రికెట్ నుంచి తప్పుకోవడానికి ఇదే సరైన సమయమని భావిస్తూ, జీవితంలో కొత్త అధ్యాయానికి తెర తీయాలనుకుంటున్నా. ఈ సుదీర్ఘ జీవితంలో నాకు తోడ్పడిన కోచ్‌లు, కెప్టెన్లు, సహచరులకు అలాగే కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని ఎక్స్‌లో కార్తీక్ పోస్ట్ చేశాడు. ఎంఎస్ ధోనీ జోరులో పెద్దగా అవకాశాలు సాధించలేకపోయిన తను 2004లో భారత్ తరఫున అరంగేట్రం చేశాడు. ఆడిన 26 టెస్టుల్లో 1025, 94 వన్డేల్లో 1752, 60 టీ20ల్లో 686 పరుగులు చేశాడు.

ప్రాక్టీస్ అదిరింది

వామప్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ ఘనవిజయం

న్యూయార్క్: టీ20 వరల్డ్‌కప్ సన్నాహకంగా జరిగిన ఏకైక వామప్ మ్యాచ్‌లో టీమిండియా అదరగొట్టింది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ విభాగాల్లోనూ రాణించి బంగ్లాదేశ్‌పై 60 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 182 పరుగులు సాధించింది. కీపర్ పంత్ (53 రిటైర్డ్ అవుట్)తో పాటు హార్దిక్ పాండ్యా (40 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. సూర్యకుమార్ (31), రోహిత్ (23) ఫర్వాలేదనిపించగా.. ఓపెనర్ శాంసన్ (1) విఫలమయ్యాడు. ఆ తర్వాత భారీ ఛేదనలో బంగ్లా 20 ఓవర్లలో 9 వికెట్లకు 122 పరుగులు చేసి ఓడింది. మహ్మదుల్లా (40 రిటైర్డ్ అవుట్) టాప్ స్కోరర్. దూబే, అర్ష్‌దీప్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

ప్రీక్వార్టర్స్‌లో సబలెంకా, రిబకినా

ఫ్రెంచ్ ఓపెన్


సబలెంకా

పారిస్: గ్రాండ్‌స్లామ్ విజేతలు అర్యానా సబలెంకా, ఎలెనా రిబకినా, నాలుగో సీడ్ జ్వెరెవ్, ఐదో సీడ్ మెద్వెదెవ్ ఫ్రెంచ్ ఓపెన్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో రెండో సీడ్ సబలెంకా 7-5, 6-1తో బడోసాపై, నాలుగో సీడ్ రిబకినా 6-4, 6-2తో 25వ సీడ్ ఎలైస్ మెర్టిన్స్‌పై సునాయాసంగా విజయం సాధించారు. అయితే మరో మూడో రౌండ్‌లో అన్‌సీడ్ అవనేసిన్ 3-6, 6-3, 7-6 (6)తో ఏడో సీడ్ క్విన్‌వెన్ జాంగ్‌కు షాకిచ్చింది. పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో నాలుగో సీడ్ జ్వెరెవ్ 3-6, 6-4, 6-2, 4-6, 7-6 (3)తో 26వ సీడ్ గ్రీక్‌స్పూర్‌ని, ఐదో సీడ్ మెద్వెదెవ్ 7-6 (4), 7-5, 1-6, 6-4తో మెకాక్‌ని, 11వ సీడ్ డిమినార్ 4-6, 6-4, 6-3, 6-3తో స్ట్రఫ్‌ని ఓడించి ముందంజ వేశారు. అలాగే మూడో సీడ్ అల్కారజ్, 9వ సీడ్ సిట్సిపాస్, 21వ సీడ్ అలియాసిమో కూడా నాలుగో రౌండ్ చేరారు.

బాలాజీ తొలిసారి..: పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు శ్రీరామ్ బాలాజీ ముందంజ వేశాడు. రెండో రౌండ్‌లో బాలాజీ/మిగ్వెల్ ఏంజెల్ (మెక్సికో) ద్వయం 6-4, 3-6, 6-2తో ఫ్రాన్స్ జోడీ డాన్/థియో జోడీపై విజయం సాధించి రొలాండ్ గారోస్‌లో తొలిసారి ప్రీక్వార్టర్స్‌కు చేరింది.

మనుకు స్వర్ణం

న్యూఢిల్లీ: తైవాన్ అథ్లెటిక్స్ ఓపెన్‌లో భారత జావెలిన్ త్రోయర్ డీపీ మను స్వర్ణం సొంతం చేసుకొన్నాడు. శనివారం జరిగిన పోటీలో మను 81.58 మీటర్లు విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. మహిళల 100 మీ. హర్డిల్స్‌లో నిత్య రామరాజ్ రజతం, మహిళల 400 మీ. ఫైనల్లో విస్మయ కాంస్యం దక్కించుకున్నారు.

ప్రపంచ చాంపియన్‌కు భారత హాకీ జట్టు షాక్

లండన్: ఎఫ్ఐహెచ్ ప్రో హాకీ లీగ్ లండన్ లెగ్‌లో వరల్డ్ చాంపియన్ జర్మనీకి భారత్ షాకిచ్చింది. శనివారం జరిగిన ఈ పోరులో భారత్ 3-0తో జర్మనీపై గెలిచింది. హర్మన్‌ప్రీత్ (16వ), సుఖ్‌జీత్ (41వ), గుర్జంత్ సింగ్ (44వ) గోల్స్ చేశారు.

గాయత్రి జోడీకి నిరాశ

సింగపూర్: సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్‌లో అద్భుత ప్రదర్శన చేసిన భారత జోడీ గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ పోరాటానికి ముగింపు పడింది. శనివారం జరిగిన సెమీస్‌లో గాయత్రి ద్వయం 21-23, 11-21తో మత్సుయమ-షిడా (జపాన్) చేతిలో ఓడింది.

15 కేజీలు తగ్గాడు



టీ20ల్లో నెంబర్‌వన్ బ్యాటర్ సూర్య కుమార్ యాదవ్ గతంలోకన్నా ఇప్పుడు పర్ఫెక్ట్ ఫిట్‌నెస్‌తో కనిపిస్తున్నాడు. వాస్తవానికి అతను ఆమధ్య హెర్నియా సర్జరీ తర్వాత బరువు పెరిగాడు. ఆ తర్వాత జాతీయ క్రికెట్ అకాడమీలో చేరి కఠినమైన డైట్‌తో పాటు నిరంతర శిక్షణ తీసుకున్నాడు. ఈ కారణంగా ఏకంగా 12 నుంచి 15 కేజీలు తగ్గాడట. గతేడాది డిసెంబరు నుంచి క్రికెట్‌కు దూరమై ఈ ఐపీఎల్‌లో అడుగుపెట్టిన సూర్య.. తాజా ప్రపంచకప్‌నకు నూతనోత్సాహంతో బరిలో దిగుతున్నాడు.

ఈ రికార్డులు బద్దలవుతాయా..?

టీ20 ప్రపంచ కప్‌లో ఓవరాల్‌గా విరాట్ కోహ్లీ చేసిన పరుగులు 1141. ఇక, ఓ ఎడిషన్‌లో అత్యధికంగా కోహ్లీ 319 రన్స్ కొట్టాడు. బంగ్లాదేశ్ క్రికెటర్ షకీబ్ అల్ హసన్ ఓవరాల్‌గా 47 వికెట్లను ఖాతాలో వేసుకున్నాడు. శ్రీలంక బౌలర్ అజంత మెండిస్ (6/8) అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. అత్యధిక జట్టు స్కోర్లలో శ్రీలంక (260/6)దే రికార్డు. నెదర్లాండ్స్ అత్యల్పంగా 39 పరుగులకే ఆలౌటైంది. అత్యధికంగా క్రిస్ గేల్ రెండు సెంచరీలు బాదగా.. హాఫ్ సెంచరీల్లో కోహ్లీ (14) ముందున్నాడు.



బిజినెస్

సీడాక్ నుంచి మాస్‌చిప్‌కు రూ.509 కోట్ల కాంట్రాక్ట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న మాస్‌చిప్ టెక్నాలజీస్.. కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు చెందిన సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడాక్) నుంచి రూ.509.37 కోట్ల విలువైన కాంట్రాక్టును దక్కించుకున్నట్లు ప్రకటించింది. కాంట్రాక్టులో భాగంగా 5 ఎన్ఎం (నానో మీటర్) టెక్నాలజీని వినియోగించటం ద్వారా హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ (హెచ్‌పీసీ) ఎస్ఓసీ (సిస్టమ్ ఆన్ ఏ చిప్)ను డిజైన్, అభివృద్ధి చేయటంతో పాటు డెలివరీ చేయాల్సి ఉంటుందని తెలిపింది. సెమీకండక్టర్ ఇన్నోవేషన్‌లో భారత్‌ను అగ్రగామిగా నిలిపేందుకు ఈ ప్రాజెక్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొంది. కాగా దేశీయంగా, అంతర్జాతీయంగా మరిన్ని మార్కెట్ అవకాశాలను చేజిక్కించుకోవటానికి ఈ కాంట్రాక్టు ఎంతగానో దోహదపడుతుందని మాస్‌చిప్ తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,550 ▼	66,550 ▼	98,000 ▼
ముంబై	72,356 ▲	66,278 ▲	92,449 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	505	విజయవాడ	490
వరంగల్	507	గోదావరి	485
చిత్తూరు	563	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ.	66

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	145	గోదావరి	149
వరంగల్	145	విజయవాడ	149
కరీంనగర్	145	గుంటూరు	149
మహబూబ్‌నగర్	147	ఒంగోలు	149
కర్నూలు	147	చిత్తూరు	149
విశాఖపట్నం	135		

గత నెల జీఎస్‌టీ ఆదాయం

రూ.1.73 లక్షల కోట్లు

వార్షిక ప్రాతిపదికన 10% వృద్ధి ..ఏపీ వసూళ్లు రూ.3,890 కోట్లు.. తెలంగాణలో రూ.4,986 కోట్లు



న్యూఢిల్లీ: ఈ ఏడాది మే నెలకు వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 10 శాతం వృద్ధితో రూ.1.73 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. దేశీయ లావాదేవీల ద్వారా ఆదాయం పెరగడంతో పాటు దిగుమతులు తగ్గడం ఇందుకు దోహదపడిందని కేంద్ర ఆర్థిక శాఖ శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఎకానమీలో ఆర్థిక కార్యకలాపాలు, వృద్ధి జోరు కొనసాగింపునకు ఇది సంకేతమని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఈ ఏప్రిల్‌లో జీఎస్‌టీ స్థూల వసూళ్లు సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.2.10 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గతనెలకు తెలంగాణ నుంచి జీఎస్‌టీ వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 11 శాతం పెరిగి రూ.4,986 కోట్లుగా.. ఆంధ్రప్రదేశ్ నుంచి వసూళ్లు 15 శాతం వృద్ధితో రూ.3,890 కోట్లుగా నమోదయ్యాయి.

మే నెల జీఎస్‌టీ ఆదాయంలో సెంట్రల్ జీఎస్‌టీ (సీజీఎస్‌టీ) వాటా రూ.32,409 కోట్లుగా, స్టేట్ జీఎస్‌టీ (ఎస్‌జీఎస్‌టీ) వాటా రూ.40,265 కోట్లుగా, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ (ఐజీఎస్‌టీ) వాటా రూ.87,781 కోట్లుగా ఉంది. సెస్సు రూపంలో మరో రూ.12,284 కోట్లు వసూలైంది. సాధారణ సెటిల్‌మెంట్ ప్రక్రియలో భాగంగా రూ.67,204 కోట్ల నికర ఐజీఎస్‌టీ ఆదాయంలో రూ.38,519 కోట్లను సీజీఎస్‌టీలో, రూ.32,733 కోట్లను ఎస్‌జీఎస్‌టీలో జమ చేసింది. అనంతరం సీజీఎస్‌టీ ఆదాయం రూ.70,928 కోట్లకు, ఎస్‌జీఎస్‌టీ ఆదాయం రూ.72,999 కోట్లకు చేరుకుంది.

నికర వసూళ్లు రూ.1.44 లక్షల కోట్లు

స్థూల వసూళ్లలో రిఫండ్లు మినహాయించగా, గత నెలకు జీఎస్‌టీ నికర ఆదాయం 6 శాతం వృద్ధితో రూ.1.44 లక్షల కోట్లుగా ఉందని ఆర్థిక శాఖ వెల్లడించింది. ఈ ఏప్రిల్ 1తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో గడిచిన రెండు నెలలకు జీఎస్‌టీ స్థూల ఆదాయం వార్షిక ప్రాతిపదికన 11.3 శాతం పెరిగి రూ.3.83 లక్షల కోట్లుగా ఉంది. రిఫండ్లను మినహాయించగా, రెండు నెలలకు నికర వసూళ్లు రూ.3.36 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.



ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన స్టార్టప్ జెలియో ఈబైక్స్.. మార్కెట్లోకి గ్రేసీ సిరీస్‌లో మూడు ఎలక్ట్రిక్ స్కూటర్లను తీసుకువచ్చింది. వీటి ధరలు రూ.59,273 నుంచి రూ.83,073 (ఎక్స్‌షోరూమ్) వరకు ఉన్నాయి. అర్బన్ రైడర్స్‌కు అత్యంత అనువుగా ఉండే విధంగా ఈ బైక్స్‌ను రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. 60/72 వాట్స్ బీఎల్‌డీసీ మోటార్‌తో కూడిన ఈ స్కూటర్ ఒకసారి చార్జింగ్‌తో 100 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది.

పొగాకు కిలో రూ.360

బోర్డు చరిత్రలో ఇది ఆల్‌టైం రికార్డు

ఒంగోలు (ఆంధ్రజ్యోతి): దక్షిణాది పొగాకు మార్కెట్లో ధరలు అదరగొడుతున్నాయి. శనివారం ఒంగోలు-1 పొగాకు వేలం కేంద్రంలో కిలో పొగాకు ధర గరిష్ఠంగా రూ.360 పలికింది. భారత పొగాకు బోర్డు చరిత్రలో ఇది ఆల్‌టైం రికార్డు ధర. అంతేకాకుండా మేలురకం బేళ్ల కోసం వివిధ కంపెనీల కొనుగోలుదారులు పోటీపడుతున్నారు. ప్రధాన కంపెనీల కన్నా చిన్నచిన్న కొనుగోలుదారులు అధిక ధరకు కొనుగోలు చేస్తుండటం గమనార్హం. దక్షిణాదిలోని ఒంగోలు కేంద్రంగా ఉన్న రెండు రీజియన్లలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఉన్న 11 పొగాకు వేలం కేంద్రాలలో ఈ ఏడాది (2023-24) 57,013 హెక్టార్ల విస్తీర్ణంలో పంట సాగుకు, 8.682 కోట్ల కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతిచ్చింది. అయితే 73,350 హెక్టార్లలో పంట సాగు కాగా దాదాపు 13.4 కోట్ల కిలోల పంట ఉత్పత్తి అంచనా వేసింది. దీంతో పొగాకు బోర్డు ఫిబ్రవరి 29న కొన్నింటిలో, మార్చి 6న మరికొన్నింటిలో వేలాన్ని ప్రారంభించింది. తొలిరోజు కిలో పొగాకు ధర గరిష్ఠంగా రూ.230 పలికింది.



వేగం తగ్గిన వాహనం

- మే నెలలో నెమ్మదించిన విక్రయాల వృద్ధి
- లోక్‌సభ ఎన్నికలు, హై బేస్ ఎఫెక్టే కారణం

న్యూఢిల్లీ: వరుసగా రెండో నెలా ప్యాసింజర్ వాహన (పీవీ) విక్రయాలు నెమ్మదించాయి. మే నెలకు గాను పీవీల టోకు విక్రయాల్లో స్వల్ప వృద్ధి నమోదైంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వాహన గిరాకీ మందగించడంతో పాటు హై బేస్ ఎఫెక్ట్ (గత ఏడాది ఇదే నెల అమ్మకాల్లో భారీ వృద్ధి నమోదవడం) ఇందుకు ప్రధాన కారణమయ్యాయి. గత నెలలో వాహన తయారీ కంపెనీల నుంచి డీలర్లకు సరఫరా అయిన మొత్తం పీవీల సంఖ్య వార్షిక ప్రాతిపదికన 4 శాతం వృద్ధితో 3,50,257 యూనిట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే నెలల్లో కంపెనీలు తమ డీలర్లకు 3,35,436 యూనిట్ల వాహనాలను సరఫరా చేశాయి. దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ దేశీయ విక్రయాలు మే నెలలో అతి స్వల్ప పెరుగుదలతో 1,44,002 యూనిట్లకు పరిమితమయ్యాయి. గత ఏడాది మే నెలతో పోలిస్తే మారుతి ఎంట్రీలెవెల్, కాంపాక్ట్ మోడళ్ల అమ్మకాలు గత నెలలో తగ్గాయి. బ్రెజ్జా, గ్రాండ్ విటారా, ఎర్టిగా, వంటి యుటిలిటీ వాహనాల సేల్స్ మాత్రం పెరిగాయని కంపెనీ వెల్లడించింది. "హై బేస్ ఎఫెక్ట్ కారణంగా ఈ ఏడాది ప్యాసింజర్ వాహన విక్రయాల వృద్ధి రెండంకెల దిగువకే పరిమితం కావచ్చు. కాగా, లోక్‌సభ ఎన్నికలు, అధిక ఉష్ణోగ్రతలు గతనెల సేల్స్‌పై ప్రతికూల ప్రభావం చూపాయ"ని మారుతి సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ అన్నారు. ఏప్రిల్‌లోనూ వాహన పరిశ్రమ టోకు విక్రయాల వృద్ధి స్తబ్దుగా (1.5 శాతం)నే నమోదైంది.

- గత నెలకు హ్యుండయ్ మోటార్ ఇండియా టోకు విక్రయాలు వార్షిక ప్రాతిపదికన ఒక శాతం వృద్ధితో 49,151 యూనిట్లుగా నమోదయ్యాయి. ఈ ఏడాది పీవీల విక్రయాల వృద్ధి ఐదు శాతానికి దిగువకే పరిమితం కావచ్చని హ్యుండయ్ మోటార్ సీఓఓ తరుణ్ గార్గ్ అభిప్రాయపడ్డారు.
- టాటా మోటార్స్ ప్యాసింజర్ వాహన (ఎలక్ట్రిక్ వెహికిల్స్ సహా) టోకు అమ్మకాలు 2 శాతం పెరిగి 47,075 యూనిట్లుగా నమోదుకాగా.. మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) హోల్‌సేల్స్ మాత్రం ఏకంగా 31 శాతం వృద్ధితో 43,218 యూనిట్లకు పెరిగాయి.
- టయోటా కిర్లోస్కర్ టోకు అమ్మకాలు 24 శాతం వృద్ధి చెంది 25,273 యూనిట్లకు చేరుకోగా.. కియా ఇండియా సేల్స్ 4 శాతం పెరిగి 19,500 యూనిట్లుగా నమోదయ్యాయి. ఎంజీ మోటార్ అమ్మకాలు మాత్రం 5 శాతం తగ్గి 4,769 యూనిట్లకు పరిమితం అయ్యాయి.

ఖరీఫ్‌పై కోటి ఆశలు

(మొదటి పేజీ తరువాయి)

విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. తొలకరి వర్షాలకు పచ్చిరొట్ట ఎరువుకు ఉపయోగించే జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి విత్తనాలను ఎదజల్లడానికి రైతులు సిద్ధమయ్యారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా నిరుడు నైరుతీ, ఈశాన్య రుతుపవనాలు పెద్దగా ప్రభావం చూపక, ఏడాదంతా తీవ్ర వర్షాభావం కొనసాగింది. దీంతో 30% దాకా రైతులు ఖరీఫ్, రబీ పంటలు సాగు చేయలేకపోయారు. రెండు సీజన్లలో 43 లక్షల ఎకరాల్లో విత్తనమే పడలేదు. పంట ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. ఈ ఏడాది ఎల్‌నినో పోయి, రుతుపవనాల ప్రభావంతో వర్షాలు ఆశాజనకంగా కురుస్తాయని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో నిరుడు నష్టపోయిన రైతులు ఈ ఏడాది సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే 2019-22 మధ్య రాష్ట్రంలో అతివృష్టి, వరుస విపత్తులు, 2023లో కరువు, తుఫాన్‌తో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ముఖ్యంగా కౌలు రైతులు కోలుకోలేని దెబ్బతిన్నారు. ఈ కారణంగా ఈ ఏడాది పొలాల కౌలు రేట్లు పెద్దగా పెరగలేదు. భూసారాన్ని బట్టి కృష్ణా, గోదావరి డెల్టాలు, ఇతర కాలువలున్న ప్రాంతాల్లో ఎకరం కౌలు కింద 10 బస్తాల ధాన్యం లేదా రూ.20 వేల వరకు నగదు, మిర్చి, పత్తి సాగు చేసే ప్రాంతాల్లో ఎకరం రూ.25 - 30 వేలు, ఇతర పైర్లు వేసే చోట రూ.12 - 15 వేల మధ్య కౌలు ఒప్పందాలు జరుగుతున్నట్లు సమాచారం.

సాయమివ్వని జగన్ సర్కారు

జగన్ పాలనలో మొదటి నాలుగేళ్లు తుఫాన్లు, వరదలు, అకాల వర్షాలు, ఐదో ఏడాది తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితులు ఏర్పడి రైతులు నష్టపోయారు. ఈ నేపథ్యంలో సాగు రంగానికి జగన్ సర్కార్ తగిన రీతిలో సాయపడలేదన్న అభిప్రాయం రైతుల్లో నెలకొంది.

పెరిగిన సాగు అంచనా

ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి, పత్తి, మిర్చి, అపరాలు, నూనెగింజలతో సహా 25 రకాల పంటలు 86 లక్షల ఎకరాల్లో సాగు చేయాలని వ్యవసాయ, ఉద్యాన శాఖలు ప్రణాళికలు వేశాయి. గతేడాది కన్నా అధికంగా 4 - 5 లక్షల ఎకరాల్లో సాగు పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సీజన్‌లో రూ.200 కోట్ల రాయితీతో 6.31 లక్షల క్వింటాళ్ల విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తామని చెప్తున్నారు. ఖరీఫ్ పంటలకు 17.50 లక్షల టన్నుల ఎరువులను కేటాయించారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పద్ధతిలో ఈ సీజన్‌లో రూ.99,600 కోట్లు పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకర్ల కమిటీ నిర్ణయించింది.. కౌలు రైతులకు ఖరీఫ్, రబీ సీజన్ల కింద కేవలం రూ.5 వేల కోట్లే ప్రతిపాదించింది. ఈ ఏడాది కౌలు రైతులకు 10 లక్షల సాగు హక్కు పత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. గత ఐదేళ్లు తీవ్రంగా నష్టపోయినందున పంట రుణాలు అధికంగా ఇవ్వాలని కౌలు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఇప్పటికీ అందని సాయం

గతేడాది రాష్ట్రవ్యాప్తంగా 450 మండలాల్లో తీవ్ర వర్షాభావం ఏర్పడి, రైతులు నష్టపోగా, జగన్ సర్కార్ కేవలం ఖరీఫ్‌లో 103, రబీలో 87 మండలాలనే కరువు మండలాలను ప్రకటించింది. దీంతో లక్షలాది మంది రైతులు నష్టపోయారు. కరువు, తుఫాన్‌కు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పేరుతో గత మార్చి 6న సీఎం జగన్ ఆర్భాటంగా బటన్ నొక్కినా, రైతుల ఖాతాలకు మే 16 దాకా సొమ్ము జమ కాలేదు. ఈలోగా ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో 'పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు చెల్లింపులు వాయిదా వేయాలి' అని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. దీంతో ఖరీఫ్ కరువు, మిచౌంగ్ తుఫాన్ బాధిత రైతులకు మే మూడో వారంలో సొమ్ము చెల్లించిన ప్రభుత్వం.. రబీ నష్టానికి మాత్రం ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయలేదు. నష్టం అంచనాల పేరుతో జాప్యం చేస్తోంది. గతేడాది పంటల బీమా పరిహారం కూడా రైతులకు రావాల్సి ఉంది.

పదేళ్లయినా..

ఎక్కడి గొంగడి అక్కడే!

నత్తనడకన విభజన హామీల అమలు.. చట్టంలో భరోసా.. ఆచరణలో నిరాశ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర విభజనతో అన్నీ కోల్పోయిన నవ్యాంధ్రప్రదేశ్‌కు ఆర్థికంగా చేయూతనిచ్చి.. ఇతర రాష్ట్రాలతో సమానంగా అభివృద్ధి పథంలో నడిపేందుకు వీలుగా తెచ్చిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ లేదా విభజన చట్టం(2014), రాజ్యసభలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఇచ్చిన హామీల అమలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందన్న చందంగా మారింది. విభజన చట్టంలోని వివిధ నిబంధనల కింద, విభజన చట్టంలోని 13వ షెడ్యూల్‌లో విభజన తర్వాత ఏపీకి ఆర్థికంగా, అభివృద్ధిపరంగా అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా ఎన్నో హామీలున్నాయి. అలాగే మన్మోహన్ రాజ్యసభలో మరిన్ని వాగ్దానాలు చేశారు. వెనుకబడిన జిల్లాల కోసం ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, అసెంబ్లీ స్థానాల పెంపు, గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం ఏర్పాటు, పోలవరం జాతీయ ప్రాజెక్టుకు ఆర్థిక సాయం, విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు, పలు జాతీయ విద్యాసంస్థల ఏర్పాటు, దుగరాజపట్నం పోర్టు నిర్మాణం, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం, వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్.. విశాఖ, విజయవాడల్లో మెట్రో రైలు, వనరుల మధ్య అంతరాన్ని భర్తీ చేయడం, నూతన రాజధాని నగరానికి కేంద్రసాయం, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం, క్రూడాయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుతో పాటు పలు పన్ను ప్రోత్సాహకాలు ఆయా హామీల్లో ఉన్నాయి. వీటిలో కొన్ని పాక్షికంగా, కొన్ని నామమాత్రంగా అమలయ్యాయి. పూర్తిగా ఏ ఒక్క హామీ కూడా నెరవేరలేదు. నత్తనడకనే సాగుతున్నాయి.

అసెంబ్లీ స్థానాల పెంపు

విభజన చట్టంలోని సెక్షన్ 26(1) ప్రకారం.. రాజ్యాంగంలోని 170వ అధికరణలోని నియమాలకు అనుగుణంగా.. విభజన చట్టంలోని సెక్షన్ 15లోని నిబంధనలు దాటకుండా ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్థానాల సంఖ్యను 175 నుంచి 225కు పెంచాలి. ఆ మేరకు ఎన్నికల కమిషన్ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణను నిర్ధారిస్తుంది. ఈ హామీని అమలుచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం 2016 ఫిబ్రవరి 29న కేంద్ర హోం శాఖను కోరింది. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు 2017 జూలై 24న ప్రధానికి లేఖ రాశారు. దీనిపై 2018 డిసెంబరు 19న పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు కేంద్రం స్పందించింది. రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ 2026 తర్వాత చేపట్టే జనాభా లెక్కల కార్యక్రమం తర్వాతే ఉంటుందని సమాధానమిచ్చింది. దీంతో అది కూడా పెండింగ్‌లో పడిపోయింది.

పోలవరం జాతీయ ప్రాజెక్టు..

ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురయ్యే ఏడు మండలాలను తెలంగాణలోని ఖమ్మం జిల్లాలోనే ఉంచి రాష్ట్రాన్ని విభజించారు. దీనిపై నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు అభ్యంతరం తెలపడంతో మళ్లీ 2014 జూలై 17న గెజిట్ నోటిఫికేషన్ ద్వారా విభజన చట్టాన్ని సవరించి పోలవరం ముంపు మండలాలను నవ్యాంధ్రలో విలీనం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ప్రధానంగా రిజర్వాయర్, స్పిల్‌వే, విద్యుదుత్పత్తి కేంద్రం అనే 3 భాగాలున్నాయి. ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా మార్చడం, నిర్వహణ, కేంద్రసాయం లాంటి అంశాలను విభజన చట్టంలోని సెక్షన్ 90లో పేర్కొన్నారు. సెక్షన్ 90(1) ప్రకారం.. దీనిని జాతీయప్రాజెక్టుగా ప్రకటించారు. సెక్షన్ 90(2) ప్రకారం ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి అవసరాల కోసం ప్రాజెక్టు నిర్వహణ, నియంత్రణ, అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరగాలి. సెక్షన్ 90(3) ప్రకారం.. పోలవరం నిర్మాణానికి కొత్తగా ఏర్పడే తెలంగాణ ప్రభుత్వం అంగీకారం తెలిపినట్లే భావించాలి. సెక్షన్ 90(4) ప్రకారం ప్రాజెక్టును కేంద్రమే చేపట్టడంతో పాటుగా దానికి అవసరమైన పర్యావరణ, అటవీ అనుమతులు, పునరావాసం సమకూర్చే బాధ్యతలన్నీ తానే తీసుకోవాలి. 2014 ఏప్రిల్ 29 నాటి కేంద్ర కేబినెట్ నోట్ ప్రకారం.. ప్రస్తుత సత్వర నీటిపారుదల ప్రయోజనాల కార్యక్రమం (ఏఐబీపీ) మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రప్రభుత్వమే ప్రాజెక్టు బాధ్యతలను పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు అంచనా వ్యయం 2010-11 లెక్కల ప్రకారం రూ.16,010.45 కోట్లు కాగా.. ప్రాజెక్టు పూర్తయ్యే సమయానికి పెరిగే అదనపు ఖర్చులు, భూసేకరణ, ఆయకట్టు అభివృద్ధి పనులు, ముంపు బాధితులకు మెరుగైన పరిహారం వంటివన్నీ, భూసేకరణ, పునరావాస చట్టం -2013 ప్రకారం ఎప్పటికప్పుడు పెరుగుతాయని కూడా నోట్‌లో ఉంది. దీనిని 2014 మే 1వ తేదీన కేంద్ర మంత్రిమండలి ఆమోదించింది. ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం 2017-18 నాటిధరల ప్రాతిపదికపై రూ.57,297 కోట్లుగా సవరించి పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ)కి సమర్పించింది. సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) సూచనలతో అంచనా వ్యయాన్ని రెండోసారి సవరించి రూ.55,548 కోట్లుగా పేర్కొంది. టీఏసీ ఆ ప్రతిపాదనను ఆమోదిస్తూనే కేంద్ర జలసంఘం ఆధ్వర్యంలోని రివైజ్డ్ కాస్ట్ కమిటీ పరిశీలనకు పంపింది. 2020 మార్చిలో అంచనా వ్యయాన్ని రూ.46,257 కోట్లకు కుదించి ఆమోదించింది. దీనిపై జగన్ సర్కారు అభ్యంతరం వ్యక్తంచేయకపోగా చప్పట్లు కొట్టి మరీ సంతకాలు పెట్టివచ్చింది. తర్వాత 2013-14 నాటి అంచనాల్లోని తాగునీటి అంశాన్ని, విద్యుత్ ప్లాంట్ నిర్మాణాన్ని తాము పరిగణనలోకి తీసుకోబోమని, ఇరిగేషన్ కాంపోనెంట్ మాత్రమే పూర్తిచేస్తామంటూ.. అంచనా వ్యయాన్ని రూ.20,418 కోట్లకు పరిమితం చేసింది. 2014 తర్వాత పెరిగిన ప్రాజెక్టు వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడం విభజన చట్టంలోని సెక్షన్ 90(4) స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం. బహుళార్థ సాధక ప్రాజెక్టులు అంటేనే నీటిపారుదల, తాగునీరు, విద్యుదుత్పత్తి ఉంటాయి. దేశంలోని జాతీయ ప్రాజెక్టులన్నింటిలోనూ ఇవే ఉంటాయి. పోలవరం విషయంలో అందుకు భిన్నంగాఇరిగేషన్ వ్యయానికి మాత్రమే నిధులు మంజూరు చేస్తామంటోంది. జగన్ అధికారంలో ఉన్న ఈ ఐదేళ్లలో కేంద్రం ఈ ప్రాజెక్టు కోసం రూ.8,240 కోట్లు ఇవ్వగా, రాష్ట్ర ప్రభుత్వం అందులో కేవలం రూ.5,825 కోట్లు ఖర్చు చేసింది. మిగిలిన రూ.2415 కోట్లను ఇతర అవసరాలకు మళ్లించారు.

వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ

విభజన చట్టంలోని సెక్షన్ 46(2), 46(3), 94(2)ల్లో ఈ హామీ పొందుపరిచారు. విభజన బిల్లుపై 2014 ఫిబ్రవరి 20న రాజ్యసభలో చర్చ సందర్భంగా వెనుకబడిన జిల్లాల విషయం ప్రస్తావనకు వచ్చింది. వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమలోని నాలుగు జిల్లాలు కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం.. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీని బిల్లులో చేరుస్తామని అప్పటి ప్రధాని మన్మోహన్ హామీ ఇచ్చారు. ఈ ప్యాకేజీ ఒడిసాలోని కోరాపుట్-బోలంగిర్-కలహండి ప్రత్యేక ప్రణాళిక.. మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రత్యేక ప్యాకేజీ తరహాలో ఉండే విధంగా విభజన చట్టాన్ని సవరించాలని నవ్యాంధ్రలో ఏర్పాటైన తొలి ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. 7 జిల్లాల అభివృద్ధికి రూ.24,350 కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ కోరుతూ 2014 అక్టోబరు 16న కేంద్ర ప్రణాళికా సంఘానికి నివేదిక సమర్పించింది. అయితే కేంద్రం మాత్రం నీతి ఆయోగ్ సిఫారసుల మేరకు ఒక్కో జిల్లాకు రూ.50 కోట్ల చొప్పున ఏటా రూ.350 కోట్ల చొప్పున ఏడేళ్లపాటు (2014-15 నుంచి 2020-21 వరకు) మొత్తం రూ.1,750 కోట్లను ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీగా ఇచ్చింది. బుందేల్‌ఖండ్ ప్యాకేజీ కింద వెనుకబడిన ప్రాంతాలకు తలసరి రూ.4,115 లెక్కన కేటాయించిన కేంద్రం ఏపీకి రూ.426 మాత్రమే ఇచ్చింది.

గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు సాయం..

వామపక్ష తీవ్రవాద సమస్య ఎక్కువగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్ర విభజనతో గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం లేకుండా పోయింది. విభజన చట్టంలోని సెక్షన్ 9(2)లో హైదరాబాద్‌లోని గ్రేహౌండ్స్ కేంద్రమే ఉమ్మడి శిక్షణ కేంద్రంగా ఉంటుందని పేర్కొనడంతో సమస్య మరింత జటిలమైంది. అందులోని సెక్షన్ 9(3) ప్రకారం.. ఏపీలో రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిన చోట గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కేంద్రం సాయం చేస్తుందని ఉంది. దీనిప్రకారం గత రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు డివిజన్‌లో భూమిని ఎంపికచేసింది. గ్రేహౌండ్స్‌కు మౌలిక సదుపాయాలు, శిక్షణ సౌకర్యాల ఏర్పాటుకు రూ.858.37 కోట్లతో కేంద్ర హోం శాఖకు చంద్రబాబు ప్రభుత్వం ప్రతిపాదన పంపింది. కేంద్రం ఏపీలో గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం ఏర్పాటును ఆమోదిస్తూ 2018 ఏప్రిల్‌లో రూ.219.16 కోట్లు మంజూరు చేసింది. చివరకు రూ.9 కోట్లు మాత్రమే విడుదల చేసింది. దీంతో ఆ ప్రతిపాదన ఇంకా పట్టాలెక్కలేదు. జగన్ సర్కారు మూడు రాజధానుల ముచ్చట మొదలుపెట్టాక.. 2020 జూన్‌లో విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం జగన్నాథపురం గ్రామం పరిధిలో గ్రేహౌండ్స్ శిక్షణ సంస్థ ఏర్పాటుకు 385 ఎకరాలను గుర్తిస్తూ నిర్ణయం తీసుకుంది. 2021 నవంబరు 14న జరిగిన దక్షిణాది రాష్ట్రాల మండలి సమావేశంలో ఈ అంశంపై కేంద్రం స్పందించింది. కొత్తగా ఏర్పాటయ్యే గ్రేహౌండ్స్ కేంద్రంలో భారత ప్రభుత్వ ఏజెన్సీలకు 50 శాతం ట్రైనింగ్ స్లాట్లకు కేటాయించాలని, ఈ ప్రతిపాదనకు అంగీకరిస్తేనే ఖర్చు భరిస్తామని మెలిక పెట్టింది. దీనిపై సవరించిన ప్రతిపాదనను జగన్ ప్రభుత్వం కేంద్రానికి పంపింది.

అప్రమత్తంగా ఉండండి

▸ ఎన్నికల అధికారులు, ఎస్పీలు, సీపీలకు మీనా లేఖ

అమరావతి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఓట్ల లెక్కింపునకు ముందు, లెక్కింపు రోజున, ఆ తర్వాత అత్యంత శ్రద్ధతో శాంతిభద్రతలను పరిరక్షించడం అవశ్యం అని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా పేర్కొన్నారు. శనివారం ఈ మేరకు అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఎస్పీలు, సీపీలకు ఆయన లేఖ రాశారు. ఇప్పటి వరకు ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయంగా, చాలా వరకు శాంతియుతంగా నిర్వహించడంలో కృషి చేసిన ప్రతి ఒక్కరినీ ప్రశంసిస్తూ మీనా ధన్యవాదాలు తెలిపారు. ఆ లేఖలో.. 'ఎన్నికల ప్రక్రియ ఓట్ల లెక్కింపు అనే క్లిష్టమైన దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఎంతో వ్యూహాత్మకంగా సవాళ్లను ఎదుర్కోవాలి. తీవ్రమైన పోటీ కారణంగా భావోద్వేగాలు అదుపు తప్పే అవకాశం ఉంది. ఓట్ల లెక్కింపునకు ముందు, లెక్కింపు రోజున, తర్వాత అత్యంత శ్రద్ధతో శాంతిభద్రతలను నిర్వహించాలి. కౌంటింగ్ కేంద్రాల్లో ఆటంకాలు తలెత్తితే వాటిని దృఢంగా, నిర్దయాత్మకంగా పరిష్కరించాలి. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించే లేదా ఆర్వో ఆదేశాలను పాటించడంలో విఫలమైన ఏ వ్యక్తిని అయినా ఓట్ల లెక్కింపు స్థలం నుంచి పంపించే అధికారం ఉంది. రాజకీయంగా సున్నితమైన ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలను కఠినంగా అదుపు చేయాలి. సమస్యాత్మక ప్రాంతాలను, ఇబ్బంది కలిగించే వారిని నిరంతరం పర్యవేక్షించాలి. తప్పుడు వార్తలు, పుకార్లను వెంటనే ఖండించాలి. ఈ కీలకమైన కాలంలో శాంతిభద్రతలను కాపాడుకోవడంలో చేసే ప్రయత్నాలు ఎంతో అమూల్యమైనవి. మీరంతా సమిష్టిగా సవాళ్లను ఎదుర్కొంటారనే నమ్మకం నాకు గట్టిగా ఉంది' అని మీనా పేర్కొన్నారు.

పల్నాడులో అప్రకటిత కర్ఫ్యూ



పల్నాడు జిల్లా నరసరావుపేటలో మూత పడిన దుకాణాలు

నరసరావుపేట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో హింస చెలరేగిన నేపథ్యంలో పల్నాడు జిల్లాలో పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తోంది. విధ్వంసాలను అరికట్టడంలో విఫలమైన ఆ శాఖకు ఓట్ల లెక్కింపు ఓ సవాల్‌గా మారింది. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టింది. శనివారం సాయంత్రం నుంచి జిల్లా అంతటా 144 సెక్షన్‌ను కఠినంగా అమలు చేస్తున్నారు. అన్ని పట్టణాల్లో దుకాణాలను మూయించారు. దీంతో అప్రకటిత కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. నరసరావుపేటలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం ఓ చిన్నారి పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాల్సి ఉండగా, దానిని నిలిపివేయించి ఇంట్లో జరుపుకోవాలని పోలీసు శాఖ ఆదేశించింది. జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ బాలాజీ లత్కర్, ఎస్పీ మాలికాగార్గ్ కఠినంగా ఆంక్షలు అమలు చేస్తున్నారు. దీంతో ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దుకాణాలను మూయించడం పట్ల కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు తమ పొట్ట కొడుతున్నారని కార్మికులు, చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో హింసాత్మక ఘటనలపై పల్నాడు జిల్లాలో పోలీసులు 161 కేసులు నమోదు చేసి, దాదాపు 1200 మందిని అరెస్టు చేశారు. 382 మందిపై రౌడీషీట్లు తెరిచారు. కౌంటింగ్ సందర్భంగా జిల్లాలో ఎక్కడైనా అల్లర్లకు పాల్పడితే, వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జిల్లా నుంచి బహిష్కరిస్తామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా నాకాబంది నిర్వహిస్తున్నారు.

కూటమికే జై!

(మొదటి పేజీ తరువాయి)

చేశాయి. ప్రముఖ జాతీయ మీడియా సంస్థలు కొన్ని భాగస్వామ్య సంస్థలతో కలిసి పోలింగ్ సరళిపై సర్వేలు చేశాయి. పోలింగ్ రోజు ఓటు వేసిన ఓటర్ల నుంచి తెలుసుకున్న అభిప్రాయ సేకరణ కావడంతో వీటిని ఎగ్జిట్ పోల్స్‌గా పిలుస్తున్నారు. మిగిలిన సర్వేలతో పోలిస్తే ఇవి వాస్తవ ఫలితాలకు దగ్గరగా ఉంటాయన్న అభిప్రాయం ఉండడంతో ప్రజల్లో వీటిపై అమితమైన ఆసక్తి వ్యక్తమవుతోంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో సర్వే నిర్వహించిన జాతీయ స్థాయి మీడియా సంస్థల్లో ఎక్కువ.. ఏపీలో టీడీపీ కూటమి భారీ విజయం సాధించబోతున్నట్లు తెలిపాయి. ఇండియా టీవీ-సీఎన్ఎక్స్, సీఎన్ఎన్-న్యూస్18, ఏబీపీ-సీ-వోటర్, టుడేస్ చాణక్య, పిమార్క్, జన్ కీ బాత్, రిపబ్లిక్ టీవీ-మాట్రిజ్, ఇండియాటుడే సంస్థల సర్వేలు కూటమి విజయాన్ని అంచనా వేశాయి. ఒక్క టైమ్స్ నౌ-సీటీజీ మాత్రం వైసీపీ రెండోసారి గెలవబోతున్నట్లు అభిప్రాయపడింది. అదీ స్వల్ప మెజారిటీనే సూచించడం గమనార్హం. ఆ పార్టీకి 14 లోక్‌సభ స్థానాలు వస్తాయని.. కూటమికి 11 వస్తాయని పేర్కొంది. మిగిలిన సర్వేలు మాత్రం టీడీపీకి భారీ విజయాన్ని సూచించాయి. ఇండియా టీవీ సర్వే టీడీపీ కూటమికి 19-23 సీట్లు వస్తాయని పేర్కొంటే.. ఏబీపీ-సీ వోటర్ సర్వే ఏకంగా 21-25 ఎంపీ సీట్లు వస్తాయని తెలపడంవిశేషం. సీఎన్ఎన్-న్యూస్18 చానల్ కూటమికి 19-22 సీట్లు వస్తాయని తెలిపింది. పి-మార్క్ కూడా 19-22 ఎంపీ సీట్లు కూటమికే వస్తాయని పేర్కొనగా.. జన్ కీ బాత్ మాత్రం 12-15 సీట్లు వస్తాయని తెలిపింది. కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ పూర్తిసమన్వయ సహకారాలతో పనిచేశాయని.. అధికారపక్షంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ఓట్ల రూపంలో మార్చుకోవడంలో విజయం సాధించాయని 'ఇండియాటుడే' చర్చలో పలువురు విశ్లేషకులు అభిప్రాయపడడం గమనార్హం.

కొన్ని అటు.. కొన్ని ఇటు!

రాష్ట్ర స్థాయిలో కొన్ని సర్వే సంస్థలు కూటమికి విజయాన్ని పేర్కొనగా మరి కొన్ని వైసీపీకి అనుకూల ఫలితాలు వెలువరించాయి. ఈసారి ఊరూ పేరూ లేని అనేక సంస్థలు ఎగ్జిట్ పోల్స్ పేరుతో సర్వేల వివరాలు ప్రకటించడంతో వాటిని చూసేవారు అయోమయానికి గురయ్యారు. ఇందులో గత ఎన్నికల నుంచి సర్వే ఫలితాలు ప్రకటిస్తున్నవి కొన్ని మాత్రమే ఉన్నాయి. ఉదాహరణకు కేకే సర్వే అనే సంస్థ గత అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధిస్తుందని ఎగ్జిట్ పోల్‌లో సూచించింది. ఆ పార్టీకి 140 వస్తాయని తెలుపగా.. ఓట్ల లెక్కింపులో 151 వచ్చాయి. అదే సంస్థ ఈసారి కూటమికి 161 సీట్లు వస్తాయని ప్రకటించింది. ఇందులో టీడీపీకి 133, జనసేనకు 21, బీజేపీకి 7 సీట్లు వస్తాయని తెలిపింది. ఈ సంస్థ సర్వే ప్రకారం వైసీపీకి 14 మాత్రమే వస్తాయి.

- పలు రాష్ట్రాల్లో సర్వేలు నిర్వహిస్తూ ఆ రంగంలో ప్రఖ్యాతి పొందిన పీపుల్స్ పల్స్ సంస్థ కూడా టీడీపీ కూటమి 111-135 సీట్లతో విజయం సాధించబోతోందని తెలిపింది. ఆ సంస్థ అంచనా ప్రకారం.. టీడీపీకి 95-110, జనసేనకు 14-20, బీజేపీకి 2-5.. వైసీపీకి 45-60 అసెంబ్లీ సీట్లు లభించే అవకాశం ఉంది. ఇక ఎంపీ సీట్లు టీడీపీకి 13-15 వస్తాయని, వైసీపీకి 3-5 వస్తాయని ఈ సంస్థ అంచనా వేసింది.
- తెలుగు రాష్ట్రాల్లో పేరున్న సర్వే సంస్థల్లో ఒకటైన 'ఆరా' సంస్థ వైసీపీయే మళ్లీ విజయం సాధిస్తుందని పేర్కొంది. ఆ సంస్థ అంచనాల ప్రకారం.. వైసీపీకి 94-104 సీట్ల మధ్యలో వస్తాయి. టీడీపీ కూటమికి 71-81 రావచ్చు. వైసీపీకి 49 శాతం ఓట్లు, కూటమికి 47 శాతం ఓట్లు వస్తాయని ఆ సంస్థ అభిప్రాయపడింది.
- సర్వే రంగంలో తరచూ వినిపించే రైజ్ సంస్థ కూడా టీడీపీ కూటమి వైపే మొగ్గ ఉన్నట్లు తెలిపింది. కూటమికి 113-122 వస్తాయని, వైసీపీకి 48-60 రావచ్చని పేర్కొంది.
- ప్రముఖ ఎన్నికల విశ్లేషకుడు 'చాణక్య' పార్థ దాస్ వైసీపీకి 110-120 స్థానాలు రావచ్చని అంచనా వేశారు.
- లోక్‌సభ సీట్లు మాత్రమే ఎవరికి ఎన్ని వస్తాయో అంచనా వేసిన జాతీయ సర్వే సంస్థలు.. అసెంబ్లీ ఎన్నికల్లోనూ టీడీపీ కూటమే గెలుస్తుందని పేర్కొన్నా.. సీట్ల సంఖ్యను పేర్కొనలేదు.

వైసీపీకి అనుకూలంగా..

ఆరా, రేస్, ఆపరేషన్ చాణక్య, ఆత్మసాక్షి ఎస్ఏఎస్, పోల్ స్ట్రాటజీ, అగ్నివీర్, పొలిటికల్ లేబొరేటరీ, జన్‌మత్, ర్యాప్ స్ట్రాటజీ, టైమ్స్ నౌ-ఈటీజీ..

వైసీపీ ప్రముఖులకు భంగపాటు: రైజ్

శ్రీకాకుళం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీలో చాలామంది ప్రముఖులకు భంగపాటు తప్పదని ప్రముఖ ఎగ్జిట్ పోల్స్ సంస్థ రైజ్ పేర్కొంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కచ్చితంగా అధికారంలోకి వస్తుందని వెల్లడించింది. శ్రీకాకుళంలో శనివారం రైజ్ సంస్థ సీఎండీ పుల్లట ప్రవీణ్ మీడియాకు సర్వే నివేదికను వివరించారు. వైసీపీ నేతలు అంబటి రాంబాబు, తమ్మినేని సీతారాం, వల్లభనేని వంశీ, కొడాలి నాని, రోజా, అవంతి శ్రీనివాస్, బాలినేని, గుడివాడ అమర్నాథ్, బూడి ముత్యాలనాయుడు, మార్గాని భరత్, అనిల్‌కుమార్ యాదవ్, కొట్టు సత్యనారాయణ వంటివారు ఓటమిపాలవుతున్నట్లు వెల్లడించారు. పులివెందులలో జగన్‌కు 15వేల వరకు మెజార్టీ తగ్గుతుందని చెప్పారు. టీడీపీ 92-99 స్థానాలలో విజయం సాధిస్తుందని, సొంతంగా మేజిక్ ఫిగర్ దాటేస్తుందని చెప్పారు.

జనసేనకు జై కొట్టిన ఎగ్జిట్ పోల్స్

రాష్ట్ర అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ జనసేనకు భారీ విజయాన్ని సూచిస్తున్నాయి. ఎక్కువ సర్వే సంస్థలు ఆ పార్టీ 15 నుంచి 18 అసెంబ్లీ స్థానాల్లో గెలవబోతున్నట్లు తెలిపాయి. అలాగే పోటీచేసిన రెండు లోక్‌సభ స్థానాలు.. మచిలీపట్నం, కాకినాడలో కూడా విజయం సాధించనుందని పేర్కొన్నాయి. గత ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీచేసి ఓటమిపాలైన ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్.. ఈసారి పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి దాదాపు 40-50 వేల భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని వెల్లడించాయి. పొత్తులో భాగంగా జనసేన 21 అసెంబ్లీ స్థానాల్లో పోటీచేయగా.. 18 చోట్ల గెలుపు తథ్యమని పలు సర్వే సంస్థలు పేర్కొన్నాయి. 14 నుంచి 21 సీట్లు గెలిచే అవకాశం ఉందని 'పీపుల్స్ పల్స్' తెలిపింది. మొత్తం 21 స్థానాలూ దానివేనని 'కేకే సర్వేస్' అంచనా వేసింది. వైసీపీ మళ్లీ గెలుస్తుందని అంచనా వేసిన 'ఆరా' మస్తాన్ కూడా జనసేన మెజారిటీ అసెంబ్లీ స్థానాల్లో గెలవబోతున్నట్లు చెప్పారు.

లోకమంతా ఒకవైపు.. జగన్ మరోవైపు!

▸ అనామక సంస్థల సర్వేలతో సంతృప్తి!!

▸ వైసీపీయే గెలవబోతోందని నీలి, కూలి మీడియాలో ప్రచారం

▸ వైసీపీ శ్రేణుల్లో కనిపించని జోష్

అమరావతి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): లోకమంతా ఒకవైపు.. సీఎం జగన్ మరోవైపు అన్నట్లుగా వైసీపీ వ్యవహరిస్తోంది. ఎగ్జిట్‌పోల్స్‌లో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని పీపుల్స్ పల్స్, రైజ్ తదితర సంస్థలు పేర్కొన్నాయి. ప్రజల్లో జగన్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని స్పష్టం చేశాయి. కానీ ఊరూ పేరూ లేని అనామక సంస్థలు వైసీపీయే అధికారంలోనికి వస్తుందంటూ ఇచ్చిన ఫలితాలను జగన్‌కు చెందిన చెందిన నీలి, కూలి మీడియాలో ప్రముఖంగా ప్రచారం చేసుకుని ప్రభుత్వ పెద్దలు సంతృప్తి చెందుతున్నారు. ఈ సంస్థలూ జగన్ చెప్పినట్లుగా 151 స్థానాలకు మించి వస్తాయని పేర్కొనలేదు. వైసీపీ, టీడీపీ కూటమి మధ్య ఓట్లతేడా స్వల్పంగానే ఉంటుందని తెలిపాయి. అసెంబ్లీ స్థానాల్లో కొద్దిపాటి ఆధిక్యం చూపినా.. లోక్‌సభ స్థానాలకు వచ్చేసరికి దాదాపు ఉభయపక్షాలకు సమాన ఫలితాలు వస్తాయని తెలిపాయి. అయినా.. నీలి, కూలి మీడియా మాత్రం ఫ్యాన్ విజయం ఖాయమైపోయిందని ఊదరగొడుతున్నాయి. మరో 48గంటల్లో ఓట్ల లెక్కింపు, అసలైన ఫలితాలు వెలువడనున్నాయి. అప్పుడు ఎలాంటి ఊహాగానాలకు ఆస్కారం ఉండదు. ఈలోగా ప్రజల్లో ఎన్నికల ఫలితాలపై అయోమయం సృష్టించడం ద్వారా కొద్ది గంటలైనా కేడర్‌ను సంతోషపరిచేందుకు, పోలింగ్ ఏజెంట్లు చేజారకుండా కాపాడుకునేందుకు ప్రభుత్వ ముఖ్యులు ఈ విన్యాసాలు చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి గత నెల 13నే నాలుగో విడతలో రాష్ట్రంలో పోలింగ్ ముగిసింది. భారీస్థాయిలో 82 శాతం ఓటింగ్ జరగడంతో.. ఎవరెటు మొగ్గారో తెలియక మంత్రుల్లో అయోమయం నెలకొంది. పైగా మూడో తేదీ(సోమవారం) నాటికి చాంబర్లు ఖాళీ చేయాలంటూ సాధారణ పరిపాలనా శాఖ నుంచి ఆదేశాలు రావడంతో వారిలో నిస్తేజం ఆవహించింది. ఇదే సందర్భంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఓట్లపై ఎంత ఆశలు పెట్టుకున్నా.. ప్రజానాడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉందన్న సమాచారం వైసీపీ అభ్యర్థులను గందరగోళంలోకి నెట్టింది. మళ్లీ అధికారంలోనికి వస్తున్నామని .. తొమ్మిదో తేదీన విశాఖ వేదికగా ప్రమాణ స్వీకారం చేస్తున్నానని సీఎం జగన్మోహన్‌రెడ్డి స్వయంగా ప్రకటిస్తున్నా.. వారిలో విశ్వాసం కలుగడం లేదు. ఇప్పుడు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు చూశాక వారిలో ఏ మూలనో ఉన్న ఆశలు చెదిరిపోయాయి.

సజ్జలపై కేసుతో వైసీపీ మెదడు ఆగిపోయింది

▸ చంద్రబాబుపై అభూతకల్పనలతో ప్రచారం: టీడీపీ

అమరావతి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తప్పుడు మాటలు మాట్లాడినందుకు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేయడంతో వైసీపీకి మెదడు పనిచేయడం ఆగిపోయిందని టీడీపీ ఎద్దేవా చేసింది. శనివారం ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు, లీగల్ సెల్ న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. 'కేంద్ర కార్యాలయంలో అన్ని నియోజకవర్గాల చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు అసలు రాలేదు. చంద్రబాబు రాకపోయినా వచ్చినట్లు, ఏవేవో మాట్లాడినట్లు వైసీపీ నేతలు ప్రచారాలు చేస్తున్నారు. జగన్ పత్రికలో పచ్చి అబద్ధాలతో వార్తలు రాయించారు. హైదరాబాద్‌లో ఉన్న చంద్రబాబు అమరావతి వచ్చి ఈ సమావేశంలో మాట్లాడి మళ్లీ రహస్యంగా వెళ్ళిపోయారా? పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అనారోగ్యం వల్ల రాలేదు. ఇతర నేతలు ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఓటమి భయం వైసీపీ పిచ్చి పనులు చేయిస్తోంది. ఆ పార్టీ పతనం ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఇదే ఉదాహరణ' అని అశోక్ బాబు విమర్శించారు. న్యాయవాది గూడపాటి మాట్లాడుతూ.. 'వైసీపీ కౌంటింగ్ ఏజెంట్ల సమావేశంలో సజ్జల మాట్లాడిన మాటలకు సంబంధించిన ఆధారాలతో సహా మేం చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. జగన్ పత్రికలో పిచ్చి రాతలపై ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేశాం' అని చెప్పారు.

పిన్నెల్లి నుంచి ప్రాణహాని ఉంది

▸ సుప్రీంకోర్టును ఆశ్రయించిన బాధితుడు శేషగిరిరావు

న్యూఢిల్లీ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ టీడీపీ పోలింగ్ ఏజెంట్ నంబూరి శేషగిరిరావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన రెండు పిటిషన్లు దాఖలు చేశారు. ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో 6 వరకు రామకృష్ణారెడ్డిని అరెస్టు చేయకుండా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలని ఒక పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఏపీలో ఎన్నికలు జరిగిన రోజున ఈవీఎంను పిన్నెల్లి ధ్వంసం చేశారని, తనపై ఆయన వర్గీయులు దాడి చేశారని ఆరోపించారు. రామకృష్ణారెడ్డిని అరెస్టు చేయాలని పోలీసులను ఆదేశించాలని కోరారు. కౌంటింగ్ రోజున కూడా పిన్నెల్లి హింసకు పాల్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనపై మరో పిటిషన్ దాఖలు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు ఈవీఎంను ధ్వంసం చేశారని ఫిర్యాదు చేసి రామకృష్ణారెడ్డికి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ అంశాలేవీ పరిగణనలోకి తీసుకోకుండా పిన్నెల్లికి హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చిందని శేషగిరిరావు పేర్కొన్నారు. పిన్నెల్లి అరెస్టు మినహాయింపును రద్దు చేయాలని ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు కాగా, ఈ రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది.

కర్నూలులో ఏపీఈఆర్సీ సేవలు ప్రారంభం

కల్లూరు, జూన్ 1: కర్నూలు కేంద్రంగా రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) సేవలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రానికి వచ్చిన ఏపీఈఆర్సీ ఛైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డికి విద్యుత్ ఉద్యోగులు ఘనస్వాగతం పలికారు. కర్నూలు నగర శివారులోని దిన్నెదేవరపాడు సమీపంలో రూ.23 కోట్లతో భవనాన్ని నిర్మించారు. ఆ భవనంలో శనివారం ఏపీఈఆర్సీ ఛైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి బాధ్యతలు చేపట్టారు.

హౌసింగ్‌లో మరో 19 మంది రిటైర్డు ఉద్యోగుల తొలగింపు

అమరావతి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహనిర్మాణ సంస్థలో వివిధ క్యాడర్లలో పని చేస్తూ 60 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న మరో 19 మంది ఉద్యోగులను ప్రభుత్వం విధుల నుంచి తొలగించింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ జగన్ సర్కారు 2022 జనవరి 31న ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. కానీ కార్పొరేషన్లలో పని చేస్తున్న ఉద్యోగులకు ఆ ఉత్తర్వులను వర్తింపజేయలేదు. దీంతో ఉద్యోగులు అప్పట్లోనే హైకోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్లపై విచారణ జరిపిన కోర్టు.. రిటైర్డ్ ఉద్యోగులకు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల మేరకు రిటైర్డ్ ఉద్యోగుల సేవలను వినియోగించుకుంటున్నారు. అయితే, గత ఏడాదే హైకోర్టు రిటైర్డ్ ఉద్యోగులకు వ్యతిరేకంగా తుది తీర్పును వెలువరించింది. దీంతో గత ఏడాది 76 మందిని తాజాగా మరో 19 మందిని విధుల నుంచి తొలగించారు.

సర్వీసు ఓట్లనూ వదల్లేదు!

(మొదటి పేజీ తరువాయి)

చూసింది. ప్రకాశం జిల్లా ఒంగోలు పోస్టాఫీసుకు మే 14న 156 సర్వీసు ఓట్ల కవర్లు రాగా వాటిని పోస్టల్ సిబ్బంది ఆర్వోకు ఇవ్వకపోగా తిరిగి వెనక్కు పంపేశారు. తాము పంపిన కవర్లు వెనక్కి వచ్చినట్లు ఓ ఉద్యోగి ఇచ్చిన సమాచారంతో అసలు వ్యవహారం బయటపడింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు తమ ఓటు హక్కును ముందుగా వినియోగించుకొనే అవకాశం కల్పించినట్లే దేశ రక్షణ విభాగం, ఇతర కేంద్ర సర్వీసుల్లో పనిచేసే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశాన్ని ఈసీ కల్పించింది. ప్రకాశం జిల్లాలో మొత్తం 6,850 సర్వీసు ఓట్లు ఉన్నాయి. అందులో 90 శాతం ఒంగోలు లోక్‌సభ పరిధిలోనే ఉన్నాయి. హైదరాబాద్‌లోని లంగర్‌హౌస్ పోస్టాఫీసు నుంచి 156 మంది రక్షణ ఉద్యోగులు తమ ఓట్లను ఒంగోలు లోక్‌సభ ఆర్వో అయిన కలెక్టర్‌కు పంపారు. మే 14న ఒంగోలు ప్రధాన తపాలా కార్యాలయానికి ఆ కవర్లు వచ్చాయి. అయితే స్థానిక పోస్టల్ సిబ్బంది వాటిని 18న తిరిగి వెనక్కి పంపారు. కవర్లు తిరిగి వచ్చిన విషయాన్ని తెలుసుకున్న ఉద్యోగి ఒకరు కనిగిరి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ఉగ్రనరసింహారెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన ఒంగోలు లోక్‌సభ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డికి విషయాన్ని తెలిపారు. దీంతో టీడీపీ నేతలు ఒంగోలు, హైదరాబాద్‌ల్లో విచారించి పోస్టల్ బ్యాలెట్ కవర్లు వెనక్కిపోయినట్లు నిర్ధారించుకున్నారు. ఇదే విషయమై లంగర్‌హౌజ్ పోస్టుమాస్టర్‌కు ఉద్యోగులు ఇచ్చిన ఫిర్యాదుతో విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో ఆ 156 కవర్లను శనివారం తిరిగి ఒంగోలు పంపినట్లు తెలిసింది. కాగా, సోమవారం సాయంత్రంలోపు అందిన సర్వీసు ఓట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ఆ సమయానికి అవి అందుతాయా.. లేదా.. అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రకాశంలో దాదాపు 5వేల మందికి పైగా సర్వీసు ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు టీడీపీ నాయకులు చెబుతున్నారు. అయితే ఇప్పటికి జిల్లా అధికారులకు 1,896 సర్వీసు ఓట్లే అందాయి. తాజా ఘటనతో సర్వీసు ఓట్ల మాయాజాలానికి కూడా అధికార పార్టీ వైసీపీ నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయని కూటమి నాయకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఆ ఫిరాయింపులకు నేను కారణం కాదు

▸ చెప్పుడు మాటలు విని నన్ను బకరాను చేశారు

▸ 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'తో ఏబీ వెంకటేశ్వరరావు

అమరావతి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలు టీడీపీలోకి రావడానికి తాను కారణం కాదని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. వారిలో 22మంది ఇప్పటికీ ఉన్నారని... తనవల్లే పార్టీ మారినట్లు వారితో చెప్పించాలని ఆయన సవాల్ విసిరారు. రాజకీయ కోణంలో జరిగిన ప్రక్రియతో తనకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'తో మాట్లాడారు. పార్టీ మార్పుపై ఒక్కో ఎమ్మెల్యే ఒక్కో విధంగా స్పందించారని, వివిధ కారణాలతో వచ్చిన వారిని తాను తీసుకొచ్చినట్లు నింద వేసి బకరాను చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ శాఖలో కొంతమంది అబద్ధాలు చెప్పి ఉండొచ్చని, అదే వాస్తవం అనుకుని తనను టార్గెట్ చేసి కేసులు పెట్టారని వాపోయారు. వివేకా హత్య కేసులో ప్రాథమిక సాక్ష్యాలు చాలా కీలకమని అన్నారు. అక్కడ అన్నీ భూతద్దంలో వెతకాలని, అన్ని రకాల సాక్ష్యాలు సేకరించాలని ఘటన జరిగిన రోజు సూచించానని తెలిపారు. వివేకా కేసులో ఆనాడు పూర్తిగా ఆధారాలు సేకరించలేదని చెప్పారు. విచారణలో భాగంగా కింది సిబ్బందికి సూచనలు చేయడం సహజ ప్రక్రియ అని, ఇప్పటికీ ఈ కేసు కోర్టు పరిధిలో ఉన్నందున దానిపై మాట్లాడకూడదని పేర్కొన్నారు. 2019 తర్వాత పరిపాలన విధానంలో స్పష్టమైన మార్పు కనిపించిందని, తన విషయంలో ఊహించని పరిణామాలు నెలకొన్నాయని చెప్పారు. తన తప్పు ఉంటే క్షమాపణ చెప్పి శిక్షకు సిద్ధమయ్యేవాడినని, తాను తప్పు చేయనందుకే పోరాటం చేయాలని భావించానని ఆయన వివరించారు. ఇప్పటికీ న్యాయస్థానంలో పోరాటం కొనసాగుతోందని తెలిపారు. తన పోరాటంలో లక్షల మంది మానసికంగా అండగా నిలిచారని, వారిచ్చిన ధైర్యం తనలో మనోస్థైర్యాన్ని నింపిందని అన్నారు. పోరాడే కొద్దీ ఇంకా కొత్త కేసులు పెట్టారని, దాంతో తనలో పోరాట పటిమ మరింత పెరిగిందని చెప్పారు. తనలాంటి వాళ్లు కూడా జరిగిన తప్పులపై పోరాటం చేయకపోతే ఇక ఎవరు ముందుకొస్తారని ప్రశ్నించారు. ఇంతకాలం తనకు జరిగిన అన్యాయంపై న్యాయం కోసం పోరాడుతూనే ఉన్నానని తెలిపారు. పరిపాలన వ్యవస్థలో అనేక రూల్స్ ఉంటాయని, వాటిని పట్టించుకోకుండా ఆరోపణలు చేసి విచారణ పేరుతో కాలయాపన చేశారని ఆరోపించారు. ఆ సమయంలో తాను సైతం ఏమీ చేయలేని పరిస్థితి ఉండేదని, ఒక కేసు తేలిన వెంటనే ఇంకోటి పెట్టి విచారణ అనేవారని, ఊరూ పేరు లేనివాడు రెండో శనివారం తనపై ఆరోపణలు చేసి, దాన్ని పేపర్‌లో పబ్లిష్ చేసేవారని చెప్పారు. ఎలాంటి ఆధారం లేని వాటికి తాను ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని తెలిపారు. నాయకుడికి నిజానిజాలు విశ్లేషించుకునే గుణం ఉండాలని చెప్పారు. అందరి జీవితాలు ఒకేలా సాగవని, అనుకోని సవాళ్లు ఎదురవుతాయని అన్నారు. అనూహ్యంగా మలుపులు తిరిగినా ఎదుర్కొన్నానని, ఈ ఐదేళ్లు తనకు జరిగిన అన్యాయంపై ఉద్యమం చేశానని పేర్కొన్నారు. సమాజ హితం కోసం తన పని తాను చేస్తానని, శేషజీవితం ప్రశాంతంగా కొనసాగిస్తూ, ప్రజలు, సమాజం కోసం స్పందిస్తూనే ఉంటానని ఏబీవీ తెలిపారు.

మూడు రోజుల్లో సీమకు నైరుతి?

▸ రేపటి నుంచి రాష్ట్రంలో పెరగనున్న వర్షాలు

▸ ఏలూరు జిల్లాలో వడదెబ్బకు ఇద్దరు మృతి

▸ నేడూ కొనసాగనున్న ఎండలు, ఉక్కపోత

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కేరళకు ఆనుకుని అరేబియా సముద్రంతో పాటు బంగాళాఖాతం, కోస్తాంధ్రల్లో వేర్వేరుగా ఉపరితల ఆవర్తనాలు కొనసాగుతున్నాయి. అలాగే అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో తేమ మేఘాలు ఆవరించడంతో రుతుపవనాలకు అనుకూలమైన వాతావరణం కొనసాగుతోంది. ఇప్పటికే కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లో వర్షాలు కురుస్తుండగా, శుక్రవారం రాత్రి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోనూ పలుచోట వర్షాలు కురుస్తున్నాయి. రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలోని అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. ఈ నేపథ్యంలో రానున్న రెండు, మూడు రోజుల్లో రాయలసీమలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించనున్నాయని వెల్లడించింది. శనివారం దక్షిణ కోస్తాలో ఎండ తీవ్రంగా ఉండడంతోపాటు అక్కడక్కడ వడగాడ్పులు వీచాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆకాశం మేఘావృతమైంది. మధ్యాహ్నం తర్వాత ఎండ ప్రభావం చూపింది. వడగాడ్పులు తగ్గాయి. పలు ప్రాంతాల్లో వర్షాలు పడ్డాయి. రాజంపేటలో 32.5, గుంతకల్లులో 30.5, గుడుపల్లెలో 24.2, చిత్తూరులో 21, తవణంపల్లెలో 18.7, భీమునిపట్నంలో 18.2, కొయ్యూరులో 17.7, తొండంగిలో 15.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆదివారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల ఎండలు, ఉక్కపోత కొనసాగుతాయని, అక్కడక్కడ వడగాడ్పులు వీస్తాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.

నేడు ఈ జిల్లాల్లో భారీ వర్షాలు..

అల్లూరి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఆదివారం భారీ వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని పేర్కొంది.

వడదెబ్బకు ఒకే గ్రామంలో ఇద్దరి మృతి

ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం సీతారామనగరంలో ఇద్దరు వృద్ధులు వడదెబ్బకు మృతి చెందారు. గ్రామానికి చెందిన ఏలూరి ముక్తేశ్వరరావు(63) శుక్రవారం తాను సాగు చేస్తున్న ఆకుకూరల తోట వద్దకు వెళ్లి వడదెబ్బకు గురయ్యారు. గ్రామానికి చెందిన షేక్ మహబూబి (70) ఎండ తీవ్రత తట్టుకోలేక తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని భద్రాచలంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా రాత్రికి మరణించారు. మృతదేహాలను శనివారం గ్రామానికి తీసుకొచ్చారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి

నవ్య | దృశ్యం

ఆదివారం • 2 జూన్ 2024



వెండితెరపై హిట్ కాంబినేషన్లకు ఉండే క్రేజే వేరు. ఒక సినిమా సక్సెస్ అయితే ఆ మూవీలోని హీరో, హీరోయిన్ లేదా హీరో, డైరెక్టర్ లేదా డైరెక్టర్, ప్రొడ్యూసర్ కాంబినేషన్‌ను లక్కీ సెంటిమెంట్‌గా భావిస్తుంటారు. ఆ కాంబో మళ్లీ వెండితెరపైన ఎప్పుడు మ్యాజిక్ చేస్తుందా అని అభిమానులు ఎదురుచూస్తుంటే.. ఆ క్రేజ్‌ను సినిమా ప్రమోషన్స్‌కు, ఓపెనింగ్స్‌కు ఆపాదించుకొని క్యాష్ చేసుకోవాలని నిర్మాతలు ఇష్టపడుతుంటారు. ప్రస్తుతం థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతున్న హీరో, డైరెక్టర్ కాంబోలివే.



హిట్టు కాంబినేషన్ మరోసారి

తిక్కుంది.. లెక్కుంది.. అంతులేని కిక్కుంది

పవన్‌కల్యాణ్‌కు దాదాపు దశాబ్ద కాలం తర్వాత 'గబ్బర్ సింగ్' రూపంలో ఇండస్ట్రీ హిట్ ఇచ్చారు డైరెక్టర్ హరీశ్ శంకర్. 'గబ్బర్ సింగ్' సినిమాతో వసూళ్ల సునామీతో పాటు వెండితెరపైన అభిమానులకు పూనకాలు తెప్పించిన ఈ సినిమాను పవన్ ఫ్యాన్స్ ఇప్పటికీ మర్చిపోలేదు. వింటేజ్ పవన్‌ను అభిమానులకు మళ్లీ గుర్తుచేసిన డైరెక్టర్ హరీశ్, పవన్ అభిమానులకు ఆరాధ్యదైవంగా మారిపోయారు. ఆ సినిమాలోని డైలాగ్ 'నాక్కొంచెం తిక్కుంది..కానీ దానికో లెక్కుంది' లాగా ఈ కాంబోకు కొంచెం తిక్కుంది.. లెక్కుంది.. అంతులేని కిక్కుంది. దాదాపు పుష్కర కాలం తర్వాత ఈ కాంబో మరోసారి అభిమానులను పలకరించనుంది. 'ఉస్తాద్ భగత్‌సింగ్' పేరుతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో పవన్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. తమిళ చిత్రం 'తెరి'కి రీమేక్‌గా పలు మార్పుచేర్పులతో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమా నుంచి విడుదలైన 'భగత్స్ బ్లేజ్' అనే టీజర్‌లో పవన్ పలికిన పవర్‌ఫుల్ సంభాషణలు సినిమాపై అంచనాలను పదింతలు పెంచేశాయి.

సినీ లవర్స్‌ను ఉర్రూతలూగించేలా..

విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన రివెంజ్ డ్రామా 'రంగస్థలం' సినిమాలో రామ్‌చరణ్‌ను సరికొత్తగా వెండితెరకు పరిచయం చేశారు డైరెక్టర్ సుకుమార్. ఆ సినిమాలోని 'చిట్టిబాబు' పాత్రతో తన నటనా విశ్వరూపం చూపించి.. విమర్శకుల ప్రశంసలతో పాటూ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌ను అందుకున్నారు రామ్‌చరణ్. ఆరేళ్ల తర్వాత ఈ కాంబో మరోసారి సినిమా ప్రేక్షకులను ఉర్రూతలూగించేందుకు చేతులు కలిపింది. త్వరలోనే 'ఆర్‌సీ17' వర్కింగ్ టైటిల్‌తో పట్టాలెక్కనున్న ఈ సినిమా 2025 ద్వితియార్థంలో ప్రేక్షకులను పలకరించనుంది.

నాలుగోసారి మ్యాజిక్ చేయడానికి...

'జులాయి' సినిమాతో లాజిక్‌తో పాటు మ్యాజికల్ ఎంటర్టైన్‌మెంటును.. 'సన్నాఫ్ సత్యమూర్తి'తో ఫాదర్ సెంటిమెంట్‌తో తెరపైన హత్తుకునే భావోద్వేగాలను పండించి.. 'అల వైకుంఠపురంలో' మూవీతో ఫ్యామిలీ ఆడియెన్స్‌కు మరిచిపోలేని థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించి సక్సెస్‌ఫుల్ కాంబినేషన్‌కు చిరునామాగా మారారు అల్లుఅర్జున్, త్రివిక్రమ్ శ్రీనివాస్. ఈ మూడు సినిమాల్లో అల్లుఅర్జున్, నటన, త్రివిక్రమ్ మార్క్ సన్నివేశాలు, సంభాషణలు ఆడియెన్స్ నుంచి కాసుల పంట కురిపించాయి. మాస్, క్లాస్ ప్రేక్షకులను సమానంగా అలరించిన ఈ హిట్ కాంబో నాలుగోసారి వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమయ్యింది. ప్రస్తుతం 'పుష్ప 2' సినిమా చిత్రీకరణలో ఉన్న అల్లుఅర్జున్.. ఆ సినిమా తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో నటించనున్నారు. 'ఏఏ22' ఈ సినిమా వర్కింగ్ టైటిల్.

థియేటర్లలో పూనకాలు తెప్పించేలా..

'జనతా గ్యారేజ్' సినిమాతో ఎన్టీఆర్‌కు భారీ సక్సెస్‌ను అందివ్వడమే కాకుండా మలయాళంలోను ఆయనకు మంచి ఫ్యాన్ బేస్‌ను తెచ్చిపెట్టారు డైరెక్టర్ కొరటాల శివ. ఈ సినిమాలో ఎన్టీఆర్ డైలాగ్ డెలివరీ, ఆయన క్యారెక్టర్ అందరినీ విపరీతంగా ఆకట్టుకున్నాయి. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత ఈ సంచలన కాంబో మరోసారి 'దేవర' సినిమాతో థియేటర్లలో మాస్ హంగామా సృష్టించనుంది. అక్టోబర్ 5న పాన్ ఇండియా లెవెల్లో విడుదల కానున్న ఈ సినిమా రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. ఇప్పటికీ విడుదలైన ప్రచార చిత్రాలు, టీజర్, టైటిల్ సాంగ్ యూట్యూబ్‌లో సెన్సేషన్‌ను క్రియేట్ చేసి థియేటర్లలో పూనకాలు తెప్పించేలా ఉన్నాయి.

మాస్ జాతర

రవితేజ, హరీశ్ శంకర్ కలయికలో మొదటిసారి 2006లో 'షాక్' సినిమా తెరకెక్కింది. ఈ సినిమా కమర్షియల్ సక్సెస్‌ను అందుకోకపోయినా.. విమర్శకుల నుంచి మంచి ప్రశంసలే పొందింది. ఆ తర్వాత 2011లో కంప్లీట్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ 'మిరపకాయ్' సినిమాతో రవితేజ, హరీశ్ శంకర్ జోడీ హిట్టు కొట్టింది. సినిమాలో రవితేజ ఎనర్జీని ఫుల్‌గా వాడుకున్న హరీశ్.. సినిమాలోని కామెడీ, యాక్షన్ సీన్స్‌కు థియేటర్లలో ప్రేక్షకుల చేత చప్పట్లు కొట్టించి, విజిల్స్ వేయించారు. 'మిస్టర్ బచ్చన్' సినిమాతో పదమూడు ఏళ్ల తర్వాత ఈ హిట్ కాంబో రిపీట్ అవుతోంది. ఈ సినిమా థియేటర్లలో 'మిరపకాయ్'లాగే మాస్ జాతరను తిరిగి తెస్తుందని టీమ్ విశ్వాసంతో ఉంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోన్న 'మిస్టర్ బచ్చన్'ను ఈ ఏడాదే రిలీజ్ చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.





పవర్‌ఫుల్ సబ్జెక్ట్‌తో

మెగాస్టార్ చిరంజీవితో తమిళ దర్శకుడు మోహన్‌రాజా 'గాడ్‌ఫాదర్' సినిమాను తెరకెక్కించారు. ఇది 2019లో పృథ్వీరాజ్ సుకుమారన్ డైరెక్షన్‌లో మోహన్‌లాల్ నటించిన మలయాళ సూపర్ హిట్ చిత్రం 'లూసీఫర్'కి రీమేక్ అని తెలిసిందే. ఈ రీమేక్ సినిమా బాక్సాఫీస్ భారీ హిట్‌ను అందుకోలేకపోయినా ఇందులో గ్యాంగ్‌స్టర్‌గా, లోకల్ లీడర్‌గా టూ షేడ్స్‌లో చిరు చేసిన పవర్‌ఫుల్ పర్ఫామెన్స్ అభిమానులను ఆకట్టుకుంది. ఇటీవలే చిరు మోహన్‌రాజాతో మరో సినిమాను చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పవర్‌ఫుల్ సబ్జెక్ట్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని చిరంజీవి కుమార్తె సుస్మిత కొణిదెల నిర్మించనున్నారు.

విభిన్న తరహా కథాంశంతో ఓవైపు.. మాసీ అవతార్‌లో మరోవైపు

ప్రస్తుతం నడుస్తోన్న ఈ ట్రెండుకు రెండడుగులు ముందంజలోనే ఉన్నారు నాని. అందరూ ఒక సినిమాను నయా కాంబినేషన్‌లో.. ఇంకో సినిమాను రిపీట్ కాంబినేషన్‌లో చేస్తుంటే .. ఆయన ఒకేసారి తనకు హిట్స్‌ను అందించిన ఇద్దరు డైరెక్టర్స్‌తో వర్క్ చేస్తున్నారు. 2022లో విడుదలై డిఫరెంట్ ఫిల్మ్‌గా మల్టీప్లెక్స్ ఆడియెన్స్‌ను ఆకట్టుకున్న చిత్రం 'అంటే సుందరానికి' ఈ సినిమా డైరెక్టర్‌తో ప్రస్తుతం విభిన్న తరహా కథాంశంతో తెరకెక్కుతోన్న 'సరిపోదా శనివారం' సినిమాలో నటిస్తున్నారు. ఇది ఆగస్టు 29న విడుదలవుతోంది. అలాగే 2023లో నాని నటించిన చిత్రం 'దసరా'. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రానికి శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించారు. ఇటీవలే ఈ డైరెక్టర్‌తో ఇంకో సినిమాను ప్రకటించారు నాని. 'నాని 33' వర్కింగ్ టైటిల్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఆయన మాసీ అవతార్‌లో కనిపించనున్నారు. ఈ సినిమాను 2025 సమ్మర్‌లో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది.

'ఆకాశం నీ హద్దు రా' ఇచ్చిన కాన్ఫిడెన్స్‌తో...

తమిళ నటుడు సూర్య నటించిన ఎమోషనల్ యాక్షన్ ఎంటర్టైనర్ 'ఆకాశం నీ హద్దు రా'. డెక్కన్ ఎయిర్‌లైన్స్ వ్యవస్థాపకుడు జి.ఆర్ గోపీనాథ్ జీవితం స్ఫూర్తితో ఫిక్షన్‌ను జోడించి సుధా కొంగర ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ప్రేక్షకుల హృదయాల్ని గెలిచిన ఈ సినిమాను అక్షయ్‌కుమార్ హిందీలోనూ రీమేక్ చేశారు. 'ఆకాశం నీ హద్దు రా' ఇచ్చిన కాన్ఫిడెన్స్‌తో ప్రస్తుతం సూర్య, సుధాకొంగరతో కలసి మరో సినిమాలో నటిస్తున్నారు. 'సూర్య 43' ఆ సినిమా వర్కింగ్ టైటిల్.







సూర్యకు జంటగా





బుట్టబొమ్మ పూజాహెగ్డే మళ్లీ సౌత్ సినిమాల్లో రీ ఎంట్రీ ఇస్తోంది. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో సూర్య కథానాయకుడిగా ఓ చిత్రం (సూర్య 44-వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది.

ఈ చిత్రంలో పూజాహెగ్డేను కథానాయికగా ఎంపిక చేసినట్లు యూనిట్ శనివారం ప్రకటించింది. గతంలో విజయ్ సరసన 'బీస్ట్' చిత్రంలో పూజాహెగ్డే నటించారు. సూర్యతో కలసి నటించడం ఇదే తొలిసారి. అండమాన్ దీవుల్లో ఆదివారం నుంచి ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభించనున్నారు. 2 డి ఎంటర్టైన్‌మెంట్స్, స్టోన్‌బెంచ్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు.

తెలుగులో వరుస అపజయాలు ఎదురవడంతో బాలీవుడ్‌లో కొన్ని సినిమాల్లో ప్రయత్నం చేసినా అవేవీ పూజా కెరీర్‌కు ఊపునివ్వలేదు.

నా కల నిజమైంది



బాలీవుడ్‌లో ప్రస్తుతం రూపుదిద్దుకుంటున్న రెండు భారీ ప్రాజెక్ట్స్‌లో నటించే అవకాశం దక్కించుకుంది యువ కథానాయిక శర్వారి. దినేష్ విజన్స్ సంస్థ నిర్మించిన హారర్ కామెడీ 'ముంజ్యా' తో పాటు యష్‌రాజ్ ఫిల్మ్స్ రూపొందిస్తున్న స్పై యూనివర్స్‌లో కూడా ఆమె నటిస్తోంది. ఇందులో అలియా భట్‌తో పాటు శర్వారి స్క్రీన్ షేర్ చేసుకుంటోంది. ఈ రెండు చిత్రాల్లో 'ముంజ్యా' ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా శర్వారి మాట్లాడుతూ ' రెండు భారీ ప్రాజెక్ట్స్‌లో నేను భాగం అయినందుకు ఆనందంగా ఉంది. ఈ స్థాయికి చేరుకోవడానికి నేనెంతో కష్టపడ్డాను. ఇప్పటి వరకూ నేను ఒకే ఒక్క సినిమాలో నటించాను. అయితే టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించి చిత్ర పరిశ్రమ నాకు మంచి అవకాశాలు కల్పించడం థ్రిల్లింగ్‌గా ఉంది. ఆదిత్య చోప్రా రూపొందిస్తున్న స్పై థ్రిల్లర్‌లో నటించడంతో నా కల నెరవేరింది' అని చెప్పింది శర్వారి. ఈ సినిమాలతో పాటు నిఖిల్ అద్వానీ నిర్మిస్తున్న 'వేద'లో కూడా నాకు మంచి అవకాశం లభించింది' అని ఆనందంతో చెప్పిందామె. ఈ సినిమాలతో ప్రేక్షకులకు మరింత దగ్గరవుతాననే నమ్మకాన్ని శర్వారి వ్యక్తం చేసింది.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు







ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
షూటింగ్ స్టార్స్	హాలీవుడ్ మూవీ	జూన్ 03
హిట్లర్ అండ్ నాజీస్	వెబ్‌సిరీస్	జూన్ 05
హౌటూ రాబ్ ఎ బ్యాంక్	హాలీవుడ్ మూవీ	జూన్ 05
బడేమియా ఛోటేమియా	హిందీ చిత్రం	జూన్ 06
స్వీట్ టూత్	వెబ్‌సిరీస్	జూన్ 06
హిట్ మాన్	హాలీవుడ్ మూవీ	జూన్ 07
పర్ఫెక్ట్ మాచ్ 2	వెబ్‌సిరీస్	జూన్ 07
అమెజాన్ ప్రైమ్		
మైదాన్	హిందీ చిత్రం	జూన్ 05
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
గునాహ్	హిందీ సిరీస్	జూన్ 03
క్లిప్డ్	వెబ్‌సిరీస్	జూన్ 04
స్టార్‌వార్స్ : ది ఎకోలైట్	వెబ్‌సిరీస్	జూన్ 04
ది లెజెండ్ ఆఫ్ హనుమాన్	హిందీ సిరీస్	జూన్ 05
సోనీ లివ్		
గుల్లక్	హిందీ సిరీస్	జూన్ 07
వర్షన్గల్కు శేషం	మలయాళ చిత్రం	జూన్ 07
ఆహా...		
బూమర్ అంకుల్	తమిళ చిత్రం	జూన్ 07
బుక్ మై షో		
ఎబిగైల్	హాలీవుడ్ మూవీ	జూన్ 07
జియో సినిమా		
లాఫ్టర్ షెఫ్	కామెడీ షో	జూన్ 01
బ్లాక్ అవుట్	హిందీ చిత్రం	జూన్ 07

వెంకటేశ్‌కు బ్లాక్ బస్టర్ హిట్



తన తమ్ముడు వెంకటేశ్‌కు ఒక బ్లాక్ బస్టర్ హిట్ ఇవ్వాలని, మాస్ హీరోగా నిలబెట్టాలని నిర్మాత సురేశ్‌బాబు ప్లాన్ చేసి నిర్మించిన భారీ చిత్రం బొబ్బిలి రాజా. సురేశ్ ప్రొడక్షన్స్ బేనరుపై అంతకుముందు ఒకటో రెండో చిత్రాలకు నిర్మాతగా సురేశ్‌బాబు పేరు పెట్టినప్పటికీ వాటి నిర్మాణంలో ఆయన పాత్ర తక్కువే. అయితే సురేశ్ సంస్థ రజతోత్సవ సంవత్సరంలో నిర్మించిన 'బొబ్బిలి రాజా' చిత్ర నిర్మాణ బాధ్యతలు పూర్తిగా సురేశ్‌బాబుకే అప్పగించారు రామానాయుడు. చిత్రకథ ఎన్నుకోవడం దగ్గర్నుంచి తొలికాపీ వచ్చేవరకు ప్రతి దశలోనూ సురేశ్ బాబు ప్రమేయం ఉంది. ఈ చిత్రవిజయం కోసం ఆయన పడిన కష్టం మాటలలో వర్ణించలేనిది.

ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్

హీరో విలేజ్ నుండి సిటీకి వెళ్లి ప్రతీకారం తీర్చుకునే పాయింట్ తో కథ సిద్ధం చేశారు పరుచూరి సోదరులు. అయితే ఇందులో కొత్తదనం ఏమీ లేదనీ, పల్లెటూరు నుంచి ఫారెస్ట్‌కు హీరోను తీసుకెళ్తే అది కొత్తగా ఉంటుందని సూచించారు సురేశ్. ఆ ప్రకారం కథలో మార్పులు చేశారు పరుచూరి సోదరులు. సినిమాలో మొదట వాణిశ్రీ పాత్రను ధనవంతురాలిగా చూపిద్దామనుకున్నారు. అయితే ఆ పాత్ర ను మినిస్టర్ చేస్తే బాగుంటుందని పరుచూరి వెంకటేశ్వర రావు సూచించారు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో జరిగే కథ కనుక ఆమె పాత్రను అటవి శాఖ మంత్రిగా మార్చారు. 'రాష్ట్రాన్నయినా రాసిస్తాను కానీ ఈ పెళ్లికి అంగీకరించను' అనే డైలాగుతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు వాణిశ్రీ.



ఆ ఆంగ్ల సినిమాను కాపీ కొట్టి

ఫారెస్ట్ నేపథ్యంలో 'గాడ్స్ మస్ట్ బీ క్రేజీ' పేరుతో ఓ ఆంగ్ల చిత్రం వచ్చింది. ఇందులో కీలక సన్నివేశాలు కాపీ కొట్టి 'బొబ్బిలి రాజా'లో వాడుకున్నామని సురేశ్‌బాబు ఓపెన్‌గా చెబుతుంటారు.

1990 సెప్టెంబర్ 24న 'బొబ్బిలి రాజా' చిత్రం విడుదలైంది. ఓపెనింగ్స్ బాగున్నాయి కానీ రెండో రోజు నుంచి కలెక్షన్లు డ్రాప్ అయ్యాయి. సినిమా క్లాస్‌గా ఉందనీ, మాస్ ఎలిమెంట్స్ మరిన్ని పెట్టి ఉంటే పెద్ద హిట్ అయి ఉండేదని రామానాయుడు అనడంతో సురేశ్‌బాబు ఆలోచనలో పడ్డారు. క్లాసీ మాస్ పిక్చర్ తీసి తప్పు చేశానా అని ఆయన బాధ పడినా, సినిమా ఆడుతుందనే నమ్మకం ఉండేది. చివరకు ఆయన నమ్మకమే నిజమైంది. రెండో వారం నుంచి 'బొబ్బిలిరాజా' వసూళ్లు ఊపందుకున్నాయి.

మరోసారి జోడీ

జయాపజయాలు మాటెలా ఉన్నా కథానాయికగా రాశీఖన్నాకు అవకాశాలకు కొదవలేదు. అటు టాలీవుడ్‌లో, ఇటు బాలీవుడ్‌లో ఆమెకు పెద్ద హిట్ చిత్రాలేవీ లేవు. కానీ అవకాశాలు మాత్రం ఆమెను వెతుక్కుంటూ వస్తున్నాయి. తాజాగా ఆమె మరో బాలీవుడ్ చిత్రంలో నటిస్తున్నారు. విక్రాంత్ మాసే కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి 'తలాఖోంమే ఏక్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. బోధ్‌యాన్ రాయ్ చౌధురి దర్శకత్వం వహిస్తున్నారు. విక్రమ్ ఖాఖర్ నిర్మాత. అయితే విక్రాంత్‌మాసే, రాశీఖన్నా జంటగా నటిస్తున్న 'సబర్మతి రిపోర్ట్' చిత్రం కూడా ప్రస్తుతం సెట్స్‌పై ఉంది.




ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● ఆదివారం 2 జూన్ 2024
diksuchi@andhrajyothy.com

నిట్ తిరుచిరాపల్లిలో పీహెచ్‌డీ

తిరుచిరాపల్లిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- పీహెచ్‌డీ 2024 జులై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైం, పార్ట్ టైం విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఇనీషియల్ స్ర్కీనింగ్, రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 146 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఫుల్ టైం ప్రోగ్రామ్‌లో చేరినవారు గరిష్ఠంగా ఆరేళ్లలో; పార్ట్ టైం అభ్యర్థులు గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తి చేయవచ్చు.

విభాగాలు-సీట్లు: ఆర్కిటెక్చర్ 8, కెమికల్ ఇంజనీరింగ్ 8, కెమిస్ట్రీ 7, సివిల్ ఇంజనీరింగ్ 13, కంప్యూటర్ అప్లికేషన్స్ 8, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 10, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 11, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 13, ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ 3, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ 5, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్ 7, మేనేజ్‌మెంట్ స్టడీస్ 7, మేథమెటిక్స్ 8, మెకానికల్ ఇంజనీరింగ్ 13, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ 8, ఫిజిక్స్ 6, ప్రొడక్షన్ ఇంజనీరింగ్ 11 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సంబంధిత ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్/డిజైన్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ విభాగాలకు పీజీ(హ్యూమానిటీస్/సోషల్ సైన్స్/ఎకనామిక్స్/బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/కామర్స్/స్టాటిస్టిక్స్) పూర్తిచేసి ఉండాలి. మేథమెటిక్స్‌కు (మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్)(ఎంఏ/ఎమ్మెస్సీ); ఫిజిక్స్‌కు పీజీ(ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/మెటీరియల్స్ సైన్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్); కెమిస్ట్రీకి పీజీ(కెమిస్ట్రీ/అప్లయిడ్ కెమిస్ట్రీ) పూర్తిచేసి ఉండాలి. విభాగాన్ని అనుసరించి డీఎస్‌టీ/డీఏఈ/ఎన్‌బీహెచ్‌ఎం/ఇన్‌స్పయిర్/యూజీసీ/సీఎస్ఐఆర్ ఫెలోషిప్ అర్హత ఉండాలి. గేట్/యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/క్యాట్/ఏఐఎంఏ/ఎక్స్‌ఏటీ/మ్యాట్/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.



ఫెలోషిప్

- మొత్తం 146 ఫుల్ టైమ్ హెచ్‌టీఆర్ఏ ఫెలోషిప్స్ తోపాటు విశ్వేశ్వరాయ పీహెచ్‌డీ స్కీమ్ కింద ఎలక్ట్రానిక్స్ & ఐటీ విభాగాల్లో మరో 5 ఫెలోషిప్స్ ఉన్నాయి.
- ఫుల్ టైం ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం అయిదేళ్లపాటు ఫెలోషిప్ అందిస్తారు. మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; తరవాత మూడేళ్లు నెలకు రూ.42,000 ఇస్తారు. అభ్యర్థులు వారానికి ఎనిమిది గంటలపాటు రీసెర్చ్ గైడ్‌గా వ్యవహరిస్తూ హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ సూచనల ప్రకారం అకడమిక్ వర్క్ పూర్తిచేయాల్సి ఉంటుంది. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న వారికి పీఎంఆర్ఎఫ్ ఫెలోషిప్ వర్తిస్తుంది.
- విశ్వేశ్వరాయ ఫెలోషిప్ కింద మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; తరవాత మూడేళ్లు నెలకు రూ.43,750 ఇస్తారు. హాస్టల్ సౌకర్యం లభించని వారికి ఫెలోషిప్ మొత్తంలో 16 శాతాన్ని రీయింబర్స్‌మెంట్ ఆఫ్ రెంట్(ఆర్ఓఆర్)గా ఇస్తారు. రీసెర్చ్ కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1.2 లక్షలు; ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సపోర్ట్ కింద రూ.1.5 లక్షలు చెల్లిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 11
- **రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** జూన్ 20 నుంచి 30 వరకు
- **వెబ్‌సైట్:** nitt.edu

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఆఫీస్ ఆటోమేషన్ అండ్ అసిస్టివ్ టెక్నాలజీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని పర్సన్ విత్ ఇంటలెక్చువల్ డిజెబిలిటీ, ఆటిజం స్పెక్ట్రం డిజార్డర్, మెంటల్ ఇల్‌నెస్, స్పెసిఫిక్ లెర్నింగ్ డిజెబిలిటీ, మల్టిపుల్ డిజెబిలిటీస్ కేటగిరీలకు ప్రత్యేకించారు. దీనికి తిరుచిరాపల్లిలోని భారతీదాసన్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిఫరెంట్లీ ఏబుల్డ్ పర్సన్స్ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 10 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎగ్జామ్‌కు సంబంధించిన మోడల్ పేపర్లను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. చెన్నై క్యాంపస్‌లో స్టడీ సెంటర్ ఉంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూన్ 15
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదో తరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, అభ్యర్థి ఫొటో, కమ్యూనిటీ సర్టిఫికెట్, డిజెబిలిటీ సర్టిఫికెట్
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in



ఐఐఎస్‌డబ్ల్యూబీఎంలో ఎంఎస్‌డబ్ల్యూ

కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఐఐఎస్‌డబ్ల్యూబీఎం)- 'మాస్టర్స్ ఇన్ సోషల్ వెల్ఫేర్(ఎంఎస్‌డబ్ల్యూ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా క్లాస్ రూమ్ సెషన్స్, ప్రజంటేషన్స్, సెమినార్లు, సమ్మర్ ఇంటర్న్‌షిప్, ఫీల్డ్ వర్క్స్ ఉంటాయి. ఇది డ్యూయెల్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్. రిటెన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి యూనివర్సిటీ ఆఫ్ కోల్‌కతా డిగ్రీని ప్రదానం చేస్తుంది.



స్పెషలైజేషన్‌లు: చైల్డ్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, కరెక్షనల్ సోషల్ వర్క్, కమ్యూనిటీ ఆర్గనైజేషన్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాక్టీసెస్, లేబర్ వెల్ఫేర్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఇంజనీరింగ్ సహా ఏదేని ప్రొఫెషనల్ డిగ్రీ/అయిదేళ్ల ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.700
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **రిటెన్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 28
- **రిటెన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూలు:** జూలై 10, 11
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 12
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 28 నుంచి
- **వెబ్‌సైట్:** www.iiswbm.edu

పీజీ డిప్లొమా ఇన్ పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్

సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలోని యూనిట్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ప్రొడక్ట్స్(సీఎస్ఐఆర్-యూఆర్‌డీఐపీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది ఏడాది వ్యవధి గల ఫుల్ టైం ప్రోగ్రామ్. ఇందులో 12 మాడ్యూల్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా థియరీ క్లాసెస్, ప్రాక్టికల్ సెషన్స్, డెయిలీ అసైన్‌మెంట్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

మాడ్యూల్స్

- ఇంట్రడక్షన్ టు ఐపీఆర్ అండ్ పేటెంట్స్ అండ్ పేటెంట్ లెజిస్లేషన్
- ఇంటర్నేషనల్ ఫ్రేంవర్క్స్
- పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్ అండ్ బేసిక్స్ ఆఫ్ పేటెంట్ సెర్చింగ్
- సెర్చింగ్ ఆన్ పేటెంట్ డేటా బేసెస్
- అండర్‌స్టాండింగ్ డేటాబేస్ ఫీచర్స్
- అడ్వాన్స్‌డ్ పేటెంట్ సెర్చింగ్
- ఇన్ఫర్మేషన్ సెర్చింగ్ ఇన్ వేరియస్ డొమైన్స్
- పేటెంట్ అనలిటిక్స్ అండ్ మాపింగ్ అండ్ ఇట్స్ అప్లికేషన్
- పేటెంట్ ఇన్ఫర్మేషన్ ఫర్ టెక్నాలజీ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్
- పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్ ఫర్ పేటెంట్ వాల్యుయేషన్
- పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్ ఫర్ ఆర్ అండ్ డీ ప్లానింగ్, స్ట్రాటజిక్ పేటెంటింగ్ అండ్ పర్ఫార్మెన్స్ బెంచ్ మార్కింగ్
- పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్ ఫర్ పేటెంట్ స్ట్రాటజీ అండ్ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్

అర్హత వివరాలు: ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ(సైన్స్/టెక్నాలజీ)/ఎంఫార్మసీ/ బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సైన్స్ డిగ్రీతోపాటు ఎల్ఎల్‌బీ/మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్/ఎంబీఏ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 4
- **వెబ్‌సైట్:** pgdp.urdip.res.in

జాబ్ కార్నర్

కేంద్ర శాఖల్లో వివిధ ఉద్యోగాలు

ఖాళీలు: 312

దేశ వ్యాప్తంగా కేంద్ర విభాగాలు/శాఖల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆర్కియలాజికల్ కెమిస్ట్: **4 పోస్టులు**
2. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆర్కియలాజిస్ట్: **67 పోస్టులు**
3. సివిల్ హైడ్రోగ్రాఫిక్ ఆఫీసర్: **4 పోస్టులు**
4. స్పెషలిస్ట్ గ్రేడ్-3 అసిస్టెంట్ ప్రొఫెసర్: **132 పోస్టులు**
5. స్పెషలిస్ట్ గ్రేడ్-3: **35 పోస్టులు**
6. డిప్యూటీ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్: **9 పోస్టులు**
7. అసిస్టెంట్ డైరెక్టర్: **4 పోస్టులు**
8. అసిస్టెంట్ డైరెక్టర్ గ్రేడ్-2: **46 పోస్టులు**
9. ఇంజనీర్ అండ్ షిప్ సర్వేయర్ కం-డిప్యూటీ డైరెక్టర్ జనరల్: **2 పోస్టులు**
10. ట్రెయినింగ్ ఆఫీసర్: **8 పోస్టులు**
11. అసిస్టెంట్ ప్రొఫెసర్: **1 పోస్టు**

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు ఫీజు: రూ.25. ఎస్సీ, ఎస్టీ, మహిళలు, దివ్యాంగ అభ్యర్థులకు దరఖాస్తు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 13

వెబ్‌సైట్: https://upsc.gov.in/



ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో టీచింగ్ పోస్టులు

నోయిడాలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్ అడ్‌హక్ బేసిస్ పైన కింద పేర్కొన్న టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. టీజీటీ(హిందీ): **2 పోస్టులు**
2. పీఆర్‌టీ(స్పెషల్ ఎడ్యుకేషన్): **1 పోస్టు**

వయసు: ఫ్రెషర్స్ అయితే 40 సంవత్సరాలు, అనుభవం(4 నుంచి 10 ఏళ్లు) ఉన్న వారు అయితే 57 ఏళ్లు మించకూడదు. **అర్హతలు:** అభ్యర్థులు సీబీఎస్ఈ నిబంధనల మేరకు తగిన అర్హతలు కలిగి ఉండాలి. సీఎస్‌బీ/సీటెట్‌లో అర్హత పొంది ఉండాలి.



ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జూన్ 8

వెబ్‌సైట్: apsnoida.edu.in/

ఎన్ఐటీవీఏఆర్‌లో రీసెర్చ్ అసిస్టెంట్స్

పుణెలోని ఐసీఎంఆర్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌లేషనల్ వైరాలజీ అండ్ ఎయిడ్స్ రీసెర్చ్...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. రీసెర్చ్ అసిస్టెంట్: **1 పోస్టు**
2. ల్యాబొరేటరీ టెక్నీషియన్: **1 పోస్టు**
3. డేటా ఎంట్రీ ఆపరేటర్: **1 పోస్టు**

అర్హత: సంబంధిత విభాగంలో ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టుకు నెలకు రూ.31,000, ల్యాబొరేటరీ టెక్నీషియన్‌కు రూ.18,000, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.17,000

వయోపరిమితి: రీసెర్చ్ అసిస్టెంట్, ల్యాబొరేటరీ టెక్నీషియన్ పోస్టులకు 30 ఏళ్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు 28 ఏళ్లు మించకూడదు.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

ఇంటర్వ్యూ తేదీ: జూన్ 14

వేదిక: ఆడిటోరియం ఆఫ్ ఐసీఎంఆర్- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌లేషనల్ వైరాలజీ అండ్ ఎయిడ్స్, రీసెర్చ్ ప్లాట్ నెం.73, జీ-బ్లాక్, భోసరీ, పుణె.

వెబ్‌సైట్: https://www.nariicmr.res.in/

తేజ్‌పూర్ యూనివర్సిటీలో ఖాళీలు

అసోంలోని తేజ్‌పూర్ యూనివర్సిటీ కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 21

పోస్టుల వివరాలు

1. రిజిస్ట్రార్(అడ్మినిస్ట్రేషన్): **1 పోస్టు**
2. ఇంటర్నల్ ఆడిట్ ఆఫీసర్(అడ్మినిస్ట్రేషన్): **1 పోస్టు**
3. డిప్యూటీ రిజిస్ట్రార్(అడ్మినిస్ట్రేషన్): **1 పోస్టు**
4. అసిస్టెంట్ రిజిస్ట్రార్(అడ్మినిస్ట్రేషన్): **4 పోస్టులు**
5. అసిస్టెంట్(అడ్మినిస్ట్రేషన్): **1 పోస్టు**
6. ల్యాబొరేటరీ అసిస్టెంట్(డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్): **1 పోస్టు**
7. జూనియర్ అకౌంటెంట్(అడ్మినిస్ట్రేషన్): **2 పోస్టులు**
8. అప్పర్ డివిజన్ క్లర్క్(అడ్మినిస్ట్రేషన్): **1 పోస్టు**
9. లోయర్ డివిజన్ క్లర్క్(అడ్మినిస్ట్రేషన్): **6 పోస్టులు**
10. మల్టీ టాస్కింగ్ స్టాఫ్(అడ్మినిస్ట్రేషన్): **5 పోస్టులు**

అర్హతలు: పోస్టును అనుసరించి మాస్టర్స్/బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 15

వెబ్‌సైట్: http://www.tezu.ernet.in/




తన దాకా వస్తే గానీ


ఒక అడవిలో రెండు కోతులు ఉండేవి. ఆ రెంటిలో ఒక కోతి మిగతా జంతువులతో స్నేహంగా ఉంటూ తన పనేదో తాను చూసుకునేది. రెండో కోతిచాలా తుంటరిది. అది కనిపించిన జంతువునల్లా ఏడిపిస్తూ వాటి మీద రాళ్లు విసురుతూ, కళ్లలో మట్టి జల్లుతూ,అవి దాచుకున్నఆహారాన్ని దొంగిలిస్తూఉండేది. వఇలా చేయడం తప్పు అని మంచికోతి తుంటరి కోతిని మందలిస్తూ తన పనుల వల్ల ఇతర జంతువులు ఎలా బాధపడతాయో చెబుతూ ఉండేది. కానీ తుంటరి కోతి మంచి కోతితో నీది మట్టి బుర్ర, అందుకే ఎలా అందరినీ ఏడిపిస్తూ సరదాగా ఉండవచ్చో, తెలియదు. అందులోఎంత వినోదం ఉందో తెలిస్తే నువ్విలా మాట్లాడవు అంటూ కోపగించుకునేది. అడవిలోని మిగతా జంతువులు ఈరెంటిని మంచికోతి మరియు తుంటరి కోతి అనే పిలిచేవి. తుంటరి కోతికి ఒక పిల్ల ఉండేది. అదంటే తుంటరి కోతికి పంచ ప్రాణాలు.ఒక రోజు తుంటరి కోతి పిల్ల ఎక్కడో తప్పిపోయింది. పిల్ల కనబడకపోయేసరికి తుంటరి కోతి ఎంతో ఆందోళన పడి దిగులుతో ఏడ్చింది. కొంత సేపటి తర్వాత మంచి కోతి తుంటరి కోతి పిల్లను తీసుకొచ్చిఅప్పగించింది. తప్పిపోయిన నా పిల్లను వెతికి తెచ్చినందుకు ధన్యవాదాలు అన్నది తుంటరి కోతి. దానికి మంచికోతి అయ్యో నీ పిల్ల తప్పిపోవడం ఏమిటి నేనే దాన్ని కాసేపు దాచి ఉంచాను అన్నది. ఎందుకలా చేసావు అని అడిగిన తుంటరి కోతితో మంచి కోతి ఇలా అన్నది .నువ్వేగా ఎవరినైనా సరదాగా ఏడిపిస్తే ఎంతో ఆనందం వినోదం వస్తాయని చెప్పావు అదెలా ఉంటుందో చూద్దాం అని నేనే నీ పిల్లను కాసేపు దాచాను కానీ పిల్ల కనిపించక నువ్వు చాలా బెంగ పెట్టుకున్నావు. ఏదైనా తనదాకావస్తే గానీ తెలియదు అంటారు ఇందుకే కాబోలు అన్నది మంచి కోతి.

సరైన నీడ ఏది?



7 తేడాలు గుర్తించండి





దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 322

			7		5	2		
	8							1
2		4			3		5	
6		7						
	9	3				7	1	
						5		9
	3		2			9		4
4							8	
		1	8		7			

సుడోకు - 321 సమాధానం

1	6	5	7	4	3	2	9	8
8	2	4	6	1	9	3	7	5
7	3	9	5	2	8	4	1	6
4	9	3	2	6	1	5	8	7
2	8	1	3	5	7	6	4	9
6	5	7	9	8	4	1	2	3
9	7	2	4	3	5	8	6	1
5	1	6	8	9	2	7	3	4
3	4	8	1	7	6	9	5	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.